www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 6-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 292 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి సా. 4.09 తదుపరి ద్వాదశి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ. 7.36, మూల తె. 6.27; వర్జ్యం: మ. 3.13-4.44, తె. 4.56-6.27; దుర్ముహూర్తం: ఉ. 9.06-9.51, రా. 10.19-11.08; అమృతఘడియలు: రా. 12.22-1.53; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 6.09 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'వైజాగ్'లో విజయఢంకా

106 పరుగులతో భారత్ గెలుపు

రెండో టెస్టులో ఇంగ్లండ్ చిత్తు

1-1తో సిరీస్ సమం

ఉప్పల్ టెస్టులో ఎదురైన పరాజయానికి అంతే దీటుగా బదులిస్తూ మనోళ్లు వైజాగ్‌లో విజయఢంకా మోగించారు. ప్రత్యర్థి బజ్‌బాల్ జోరుకు బుమ్రా, అశ్విన్ చెక్ పెట్టిన వేళ.. రెండో టెస్టులో భారత్ 106 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. 399 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 292 పరుగులకే కుప్పకూలి దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంది. ఫలితంగా ఐదు టెస్టుల సిరీస్‌లో రోహిత్ సేన 1-1తో సమవుజ్జీగా నిలిచింది. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 9 వికెట్లు తీసిన బుమ్రాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. - వివరాలు స్పోర్ట్స్‌లో

అండర్-19 వరల్డ్‌కప్
సెమీఫైనల్ నేడు
భారత్ X దక్షిణాఫ్రికా
మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

రెండో టెస్టులో 106 రన్స్‌తో భారత్ భారీ గెలుపు

విశాఖలో విజయభేరి


అశ్విన్

1 టెస్టుల్లో ఇంగ్లండ్‌పై ఎక్కువ వికెట్లు (97) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్.

టెస్టుల్లో తన రెండో ఉత్తమ గణాంకాలు (9/91) నమోదు చేసిన బుమ్రా. అలాగే భారత్ నుంచి మాజీ పేసర్ చేతన్ శర్మ (10 వికెట్లు) తర్వాత ఇంగ్లండ్‌పై ఇదే బెస్ట్ షో.

2 భారత్‌లో నాలుగో ఇన్నింగ్స్‌లో రెండో అత్యధిక స్కోరు (292) చేసిన జట్టుగా ఇంగ్లండ్. శ్రీలంక (299/5) టాప్‌లో ఉంది.

1 1996లో సచిన్, గంగూలీ తర్వాత 25 ఏళ్లలోపున్న ఇద్దరు భారత బ్యాటర్లు (జైస్వాల్, గిల్) ఒకే టెస్టులో సెంచరీలు చేయడం ఇదే తొలిసారి.

యువ ఆటగాళ్లు భేష్

'ఇంగ్లండ్‌లాంటి పటిష్ట జట్టుపై యువ ఆటగాళ్లు చూపిన ప్రతిభ అమోఘం. వారిని చూస్తే గర్వంగా ఉంది. అయితే తమ స్కోర్లను భారీగా మల్చుకోలేకపోయారు. టెస్టులకు కొత్త కావడంతో అనుభవం ద్వారా ఆ లోటును భర్తీ చేస్తారని భావిస్తున్నాం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తూనే, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడనీయడం ముఖ్యం. బుమ్రా ఓ చాంపియన్ ప్లేయర్.

- రోహిత్

గిల్ ఓకే..

రెండో రోజు ఆటలో ఫీల్డింగ్ చేసేటప్పుడు గిల్ కుడిచేతి చూపుడు వేలికి గాయమైంది. దీంతో అతను సోమవారం పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. అలాగే గిల్‌కు చేసిన స్కానింగ్‌లో పెద్దగా ఆందోళనపడాల్సిన అవసరం లేదని, మరికొద్ది రోజుల్లో అతను పూర్తిగా కోలుకోనున్నట్టు తేలింది.

అబుధాబికి ఇంగ్లండ్ జట్టు


భారత్‌తో రాజ్‌కోట్‌లో జరిగే మూడో టెస్ట్‌కు పది రోజులు సమయం ఉండడంతో..ఇంగ్లండ్ జట్టు అబుధాబి వెళ్లనుంది. భారత్ పర్యటనకు ముందు ఆ జట్టు అక్కడే శిబిరంలో పాల్గొంది. ఈనెల 15న మూడో టెస్టు మొదలవనుండడంతో..అప్పటివరకు అబుధాబి వెళ్లి స్టోక్స్ సేన విశ్రాంతి తీసుకోనుంది.

- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 292 ఆలౌట్
- బుమ్రా, అశ్విన్ విజృంభణ

సంచలనమేమీ లేదు.. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌కు భారత బౌలర్లు సమర్థవంతంగా చెక్ పెట్టారు. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా, 399 పరుగుల లక్ష్యాన్ని స్టోక్స్ సేన దూకుడుగా ఛేదిస్తుందేమోనని అనుకున్నా.. పేసర్ బుమ్రా, స్పిన్నర్ అశ్విన్ వారి ఆటలను సాగనివ్వలేదు. ఛేదన ఎంతైనా 60-70 ఓవర్లలోనే ముగిస్తామని ప్రగల్భాలు పలికిన పర్యాటక జట్టును రెండు సెషన్లలోపే భారత్ ప్యాకప్ చేసింది. ఫలితంగా.. ఐదు టెస్టుల సిరీస్‌ను టీమిండియా ప్రస్తుతానికి 1-1తో సమం చేసింది.



విశాఖపట్నం (స్పోర్ట్స్): ఇంగ్లండ్ చేతిలో ఎదురైన తొలి టెస్టు పరాజయానికి భారత జట్టు గట్టిగానే బదులిచ్చింది. తమపై పెట్టుకున్న అంచనాలను నిజం చేస్తూ బౌలర్లు సమష్టిగా రాణించారు. తద్వారా ఆటకు నాలుగోరోజైన సోమవారమే ముగిసిన రెండో టెస్టులో 106 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. అటు తగిన సమయం ఉన్నప్పటికీ ఇంగ్లండ్ వేగంగా ఆడే ప్రయత్నంలో వికెట్లను చేజార్చుకుని మూల్యం చెల్లించుకుంది. 399 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 292 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ క్రాలే (73), బెన్ ఫోక్స్ (36), హార్ట్‌లీ (36) మాత్రమే ఆకట్టుకున్నారు. బుమ్రా, అశ్విన్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. ఓవరాల్‌గా 9 వికెట్లతో రాణించిన బుమ్రాకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. ఈ ఫలితంతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-1తో నిలిచింది. మూడో టెస్టు ఈనెల 15 నుంచి రాజ్‌కోట్‌లో జరుగుతుంది.


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీతో బుమ్రా

తొలి సెషన్‌లోనే ఖాయమైంది: ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఇంగ్లండ్ తొలి సెషన్‌ను ఆరంభించింది. మరో 332 పరుగులు కావాల్సిన వేళ.. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు సెషన్ ముగిసేసరికి 127 పరుగులు జత చేశారు. కానీ ఈ క్రమంలో ఏకంగా ఐదు వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఫలితం ఎలా ఉండబోతోందో అవగతమైంది. స్పిన్ త్రయం కుల్దీప్, అశ్విన్, అక్షర్ మిడిలార్డర్‌ను ఇబ్బందిపెట్టారు. తొలి టెస్టులో స్పిన్‌ను రివర్స్ స్వీప్‌తో ఎదుర్కొన్న ప్రత్యర్థి వ్యూహం ఈసారి పనిచేయలేదు. అయితే క్రాలే మాత్రం దూకుడుగా వెళ్లాడు. ఆరంభంలో ఫోర్లతో ఆకట్టుకున్న రెహాన్ అహ్మద్ (23)ను తొలి గంటలోపే అక్షర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పోప్ (23) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. అశ్విన్ ఓవర్‌లో స్లిప్‌లో అతడిచ్చిన క్యాచ్‌ను రోహిత్ మెరుపు వేగంతో అందుకున్నాడు. అశ్విన్ బౌలింగ్‌లోనే జో రూట్ (16) అనవసర షాట్‌కు వికెట్ చేజార్చుకున్నాడు. అయితే క్రాలేకు జతగా బెయిర్‌స్టో (26) క్రీజులో ఉండడంతో అప్పటికీ ఇంగ్లండ్ విజయంపై ఆశలు కోల్పోలేదు. కానీ అర్ధసెంచరీతో ఊపు మీదున్న క్రాలేను కుల్దీప్, బెయిర్‌స్టోను బుమ్రా వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో ఇంగ్లండ్‌కు గట్టి దెబ్బ తగిలింది.

చివర్లో పోరాటం: రెండో సెషన్‌ను కెప్టెన్ స్టోక్స్ (11), ఫోక్స్ ఆరంభించడంతో అప్పటికీ ప్రమాదం లేకపోలేదనిపించింది. అత్యంత గడ్డు పరిస్థితుల్లోనూ ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించిన అనుభవం స్టోక్స్‌కు ఉంది. కానీ, ఈసారి అతను చేజేతులా వికెట్‌ను సమర్పించుకుని భారత్‌ను సంబరాల్లో ముంచాడు. అశ్విన్ ఓవర్‌లో ఫోక్స్ సింగిల్ కోసం పరిగెత్తాడు. అటు నుంచి స్టోక్స్ కాస్త బద్ధకంగా కదలడంతో మిడ్ వికెట్‌లో బంతిని అందుకున్న శ్రేయాస్ మెరుపు వేగంతో వేసిన త్రోకు వికెట్లు నేలకూలాయి. అప్పటికి స్టోక్స్ బ్యాట్ వెంట్రుకవాసి తేడాతో క్రీజుకు దూరంగా ఉండడంతో రనౌట్ కాకతప్పలేదు. ఈ దశలో ఫోక్స్, హార్ట్‌లీ పోరాడారు. ఇద్దరూ స్పిన్నర్ల ఓవర్లలో చెరో సిక్సర్‌తో వేగం పెంచేందుకు చూశారు. అలాగే అడపాదడపా ఫోర్లతో ఆకట్టుకుంటూ ఎనిమిదో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఫోక్స్‌ను రిటర్న్ క్యాచ్‌తో బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఆశలు అడుగంటాయి. మరో ఐదు ఓవర్లలో చివరి రెండు వికెట్లు కూడా నేలకూలడంతో ఇంగ్లండ్ ఓటమి పాలైంది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 253; భారత్ రెండో ఇన్నింగ్స్: 255

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (ఎల్బీ) కుల్దీప్ 73; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రెహాన్ (ఎల్బీ) అక్షర్ 23; పోప్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 23; రూట్ (సి) అక్షర్ (బి) అశ్విన్ 16; బెయిర్‌స్టో (ఎల్బీ) బుమ్రా 26; స్టోక్స్ (రనౌట్) 11; ఫోక్స్ (సి అండ్ బి) బుమ్రా 36; హార్ట్‌లీ (బి) బుమ్రా 36; బషీర్ (సి) భరత్ (బి) ముకేశ్ 0; అండర్సన్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 69.2 ఓవర్లలో 292 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-50, 2-95, 3-132, 4-154, 5-194, 6-194, 7-220, 8-275, 9-281, 10-292. **బౌలింగ్:** బుమ్రా 17.2-4-46-3; ముకేశ్ 5-1-26-1; కుల్దీప్ 15-0-60-1; అశ్విన్ 18-2-72-3; అక్షర్ 14-1-75-1.

ప్రసాద్ జోడీకి ఇరాన్ టైటిల్

మిక్స్‌డ్ రన్నరప్‌గా సిక్కి జంట

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఇరాన్ ఫజర్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగు షట్లర్లు సత్తా చాటారు. ఇరాన్‌లోని యాజ్డ్‌లో జరిగిన ఈ పోటీల్లో పురుషుల డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్ గరగ-సాయి ప్రతీక్ ద్వయం విజేతగా నిలవగా, మిక్స్‌డ్‌లో సిక్కి-సుమిత్ రెడ్డి జంట రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది.

న్యూజెర్సీలో ఫిఫా కప్ ఫైనల్

2026 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల

న్యూయార్క్: 2026 ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ ఫైనల్‌కు న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియం వేదిక కానుంది. 20వ ప్రపంచకప్ జరిగే వేదికలు, మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఫిఫా విడుదల చేసింది. అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీ 2026 జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరగనుంది. జూన్ 11న మెక్సికోలోని అజ్‌టెకా స్టేడియంలో ఆరంభ మ్యాచ్ జరగనుంది.

డబ్ల్యూటీసీలో రెండో స్థానానికి టీమిండియా

దుబాయ్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పట్టికలో భారత్ రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఘనవిజయం సాధించడంతో టీమిండియా 4 స్థానాలు ఎగబాకింది. భారత్ 52.77 పాయింట్ల శాతంతో రెండోస్థానంలో ఉండగా, స్వల్ప తేడా(55.00)తో ఆస్ట్రేలియా టాప్‌లో కొనసాగుతోంది. ఇక, తొలి ఐదు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య 5 శాతం తేడానే ఉండడం విశేషం.

క్వార్టర్స్‌లో నిఖత్

లవ్లీనాపై అనర్హత వేటు
స్ట్రాంజా బాక్సింగ్

బల్గేరియా: స్ట్రాంజా ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ స్టార్ బాక్సర్, డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన 50 కిలోల విభాగంలో నిఖత్ 3-2తో ఒయున్‌సెట్సెగ్ యెసుజెన్ (మంగోలియా)పై నెగ్గింది. ఇదే టోర్నీలో 75 కిలోల విభాగంలో పోటీపడ్డ టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా అనూహ్యంగా అనర్హత వేటుకు గురైంది. ఐర్లాండ్ బాక్సర్ రౌర్కే అయోఫితో జరిగిన ఆరంభ బౌట్‌లో మూడో రౌండ్‌లో ఇద్దరి మధ్య తీవ్రమైన పెనుగులాట జరగగా, మూడు హెచ్చరికల అనంతరం లవ్లీనాను రెఫరీ డిస్‌క్వాలిఫైగా ప్రకటించాడు.

రచిన్ 'డబుల్'

- కివీస్ తొలి ఇన్నింగ్స్ 511
- దక్షిణాఫ్రికా 80/4



మౌంట్‌మాంగనుయ్: రచిన్ రవీంద్ర (240) ద్విశతకంతో చెలరేగిన వేళ..దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ భారీస్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 258/2తో సోమవారం ఆట కొనసాగించిన కివీస్ 511 పరుగులకు ఆలౌటైంది. కిందటి రోజు 112 పరుగులతో ఆడుతున్న కేన్ విలియమ్సన్ తన స్కోరుకు మరో 6 రన్స్ జోడించి అవుటవగా..118తో నాటౌట్‌గా ఉన్న రచిన్ దానిని 'డబుల్'గా మలచి 240 పరుగుల వద్ద నిష్క్రమించాడు. ఇక..తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా రెండోరోజు ఆఖరికి 80/4 స్కోరుకే పరిమితమై తీవ్ర ఇక్కట్లలో పడింది. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సఫారీ జట్టు 431 రన్స్ వెనుకంజలో నిలిచింది.

ఆంధ్ర ఇన్నింగ్స్ విజయం


నితీశ్

పట్నా: బిహార్‌తో ఎలిట్ గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర ఇన్నింగ్స్ 157 పరుగులతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 111/8తో నాలుగో రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బిహార్ 124 పరుగులకు ఆలౌటైంది. బిహార్ తొలి ఇన్నింగ్స్‌లో 182, ఆంధ్ర 463 పరుగులు చేశాయి. నితీశ్‌కుమార్ రెడ్డి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఈ విజయంతో ఆంధ్ర 7 పాయింట్లు దక్కించుకొంది.

సర్వీసెస్ 'ఒక' రికార్డు: హరియాణాతో జరిగిన మ్యాచ్‌లో సర్వీసెస్ ఒక్క పరుగు తేడాతో గెలిచి రంజీ చరిత్రలో రికార్డు సృష్టించింది.

అఫ్ఘాన్‌పై లంక విజయం

కొలంబో: అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టులో శ్రీలంక పది వికెట్లతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 199/1తో సోమవారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్ఘాన్ 296 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ జయసూర్య ఐదు వికెట్లతో ప్రత్యర్థిని వణికించాడు. ఇక.. 56 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ కోల్పోకుండా లంక ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ 198, శ్రీలంక 439 పరుగులు చేశాయి.

బిజినెస్

లాభాల స్వీకారంతో నష్టాలు

ముంబై: స్టాక్‌మార్కెట్ సోమవారం నష్టాలతో ముగిసింది. ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో చివరి గంటలో లాభాల స్వీకరణ అమ్మకాలు హోరెత్తాయి. దీంతో సెన్సెక్స్ 354.21 పాయింట్ల నష్టంతో 71,731.42 వద్ద, నిఫ్టీ 82.10 పాయింట్ల నష్టంతో 21,771.70 వద్ద క్లోజయ్యాయి.

రూ.1,000 పైకి ఎల్‌ఐసీ షేరు: ఎల్‌ఐసీ షేర్లలో సోమవారం మంచి కదలిక కనిపించింది. బీఎస్ఈలో ఈ షేర్లు 5.90 శాతం లాభంతో రూ.1,000.35 వద్ద ముగిశాయి. దీంతో ఎల్‌ఐసీ మార్కెట్ క్యాప్ సోమవారం ఒక్క రోజే రూ.35,230.25 కోట్లు పెరిగి రూ.6,32,721.15 కోట్లకు చేరింది. ఇంట్రాడేలో ఒక దశలో ఎల్‌ఐసీ షేర్లు 8.81 శాతం లాభంతో రూ.1,027.95కు చేరి 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకాయి. లిస్టింగ్ తర్వాత మదుపరులకు చుక్కలు చూపించిన ఎల్‌ఐసీ షేర్లు రూ.1,000 మార్క్‌ను అధిగమించడం ఇదే మొదటిసారి.

'హ్యుండయ్' నుంచి రూ.46,513 కోట్ల ఐపీఓ!: హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) భారీ ఐపీఓకు సిద్ధమవుతోంది. కంపెనీ ఈ ఏడాది చివర్లో 330 నుంచి 560 కోట్ల డాలర్ల (సుమారు రూ.27,409 కోట్ల నుంచి రూ.46,513 కోట్లు) సమీకరణ కోసం ఐపీఓకు వస్తుందని సమాచారం. ఇదే జరిగితే భారత ఐపీఓ మార్కెట్‌లో ఇదే అతి పెద్ద ఐపీఓ అవుతుంది. అయితే ఈ వార్తలపై హుండయ్ మోటార్ ఇండియా అధికారికంగా నోరు మెదపడం లేదు.

కీయస్ స్మార్ట్ హోమ్‌కు రూ.100 కోట్ల ఫండింగ్

హైదరాబాద్: నగరానికి చెందిన స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ స్టార్టప్ కీయస్ స్మార్ట్ హోమ్‌కు రూ.100 కోట్ల ఫండింగ్ లభించింది. ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఓఏకేఎస్ అసెట్ మేనేజ్‌మెంట్ సహా ఇతరుల నుంచి ఈ నిధులను సమీకరించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణె, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ల ఏర్పాటుతో పాటు హైదరాబాద్ మార్కెట్లో అగ్రగామి స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ ప్లేయర్‌గా ఎదిగేందుకు, ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లోకి విస్తరించేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు కంపెనీ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,220 ▼	57,950 ▼	76,700 ▼
ముంబై	62,510 ▼	57,260 ▼	70,420 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




5వ తేదీ		విజయవాడ	543
హైదరాబాద్	540	విశాఖపట్నం	555
6వ తేదీ		వరంగల్	542
చిత్తూరు	583		
గోదావరి	543	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	111	గోదావరి 113	
వరంగల్	111	విజయవాడ	113
కరీంనగర్	111	గుంటూరు	117
మహబూబ్‌నగర్	111	ఒంగోలు	117
కర్నూలు	111	చిత్తూరు	123
విశాఖపట్నం	107		

అంబానీ చేతికి పేటీఎం వాలెట్!



రేసులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం..

న్యూఢిల్లీ: పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ తన వాలెట్ బిజినెస్‌ను విక్రయించేందుకు ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. పేటీఎం వాలెట్ సేవలు.. ఆర్‌బీఐ నిషేధం విధించిన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ పరిధిలోకే వస్తాయి. పేటీఎం మేనేజ్‌మెంట్ గత నవంబరు నుంచే జియో ఫైనాన్షియల్‌తో చర్చలు జరుపుతున్నదని, హెచ్‌డీఎఫ్‌సీతో చర్చలు ఆర్‌బీఐ నిషేధానికి కొన్ని రోజుల ముందే ప్రారంభించినట్లు సమాచారం. కాగా, అంబానీకి చెందిన ఈ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ).. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను మొత్తంగా కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన డిజిటల్ వాలెట్ పేజాప్‌కు ఇప్పటికే 1.4 కోట్ల మంది కస్టమర్లున్నారు. పేటీఎం వాలెట్‌ను దక్కించుకోగలిగితే ఈ సెగ్మెంట్లో అగ్రగామి కంపెనీ కాగలదు. ప్రస్తుతానికి ఈ సేవల్లో అంతగా ప్రభావం చూపలేకపోయిన జియో ఫైనాన్షియల్స్‌కు పేటీఎంతో డీల్ బాగా కలిసిరావచ్చని ఇండస్ట్రీ వర్గాలన్నాయి.

ఫిబ్రవరి 29 తరువాత నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) డిపాజిట్లు స్వీకరించకుండా గతవారం ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతో పాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు(ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆదేశించింది. అయితే, అకౌంట్లలోకి వడ్డీ, కాష్‌బ్యాక్ లేదా రిఫండ్ సొమ్మును మాత్రం జమచేయవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, కస్టమర్లు తమ అకౌంట్‌లో ఉన్న నగదును ఉన్నంతవరకు వినియోగించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకూ ఎలాంటి ఆంక్షలుండవని తెలిపింది. ఇవి తప్ప మార్చి 1 నుంచి ఐఎంపీఎస్, ఏఈపీఎస్ వంటి నగదు బదిలీ లావాదేవీలు, భారత్ బిల్ పేమెంట్ లావాదేవీలు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందిచడానికి వీల్లేదని పీపీబీఎల్‌ను ఆదేశించింది. దీంతో ఈ నెలాఖరు నుంచి పీపీబీఎల్ సేవలు దాదాపుగా నిలిచిపోనున్నాయి. 2022 మార్చిలోనే పీపీబీఎల్ కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. పీపీబీఎల్ లైసెన్సును వచ్చే నెలలో రద్దు చేసే దిశగా ఆర్‌బీఐ యోచిస్తున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తొలుత డిపాజిటర్ల సొమ్ముకు రక్షణ కల్పించాక బ్యాంక్‌పై వేటు వేయవచ్చన్నారు. కాగా, పీపీబీఎల్‌లో మనీలాండరింగ్ జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తిస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా అన్నారు.

పేటీఎం షేరు మరో 10 శాతం డౌన్

పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు వరుసగా మూడో రోజూ లోయర్ సర్క్యూట్‌ను తాకింది. సోమవారం బీఎస్ఈలో ఈ షేరు ధర మరో 10 శాతం క్షీణించి రూ.438.35 వద్దకు పతనమైంది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు 42 శాతం క్షీణించింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.20,471.25 కోట్లు తగ్గి రూ.27,838 కోట్ల స్థాయికి జారుకుంది.

పీపీబీఎల్ కస్టమర్లకు ప్రత్యామ్నాయాలు..

ఆర్‌బీఐ నిషేధం నేపథ్యంలో పీపీబీఎల్ కస్టమర్లు తమ ఖాతాలోని సొమ్మును యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మీడియేట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్), రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్‌టీజీఎస్) ద్వారా ఇతర అకౌంట్లోకి బదిలీ చేసుకోవచ్చు. కానీ, మీ పీపీబీఎల్ అకౌంట్లోకి మాత్రం మార్చి ఒకటి నుంచి సొమ్ము జమ చేయలేరు. పేటీఎం వాలెట్‌లోని సొమ్మును కూడా ఇతర అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. అయితే, పేటీఎం వాలెట్‌పై ఒక లావాదేవీ ద్వారా గరిష్ఠంగా రూ.25,000, రోజుకు గరిష్ఠంగా రూ.లక్ష బదిలీ చేసుకోగలుగుతారు. అయితే, ఇందుకు 3 శాతం లావాదేవీ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.25,000 బదిలీకి రూ.750 రుసుము చెల్లించాలి. పీపీబీఎల్ వాలెట్, ఫాస్టాగ్, ఎన్‌సీఎంసీ సేవలను ఇతర బ్యాంక్‌లకు బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు బ్యాంక్ ఇప్పటికే వెల్లడించింది.

పీపీబీఎల్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర సంస్థల వాలెట్, ఫాస్టాగ్ సేవలకు మారవచ్చు. దేశంలో 20కి పైగా బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు వాలెట్ సేవలందిస్తున్నాయి. మొబిక్విక్, ఫోన్‌పే, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అమెజాన్ పే అందులో కొన్ని. అలాగే, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వంటి 37 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్‌లు ఫాస్టాగ్ సేవలందిస్తున్నాయి. కస్టమర్లు తమ ఫాస్టాగ్‌ను మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లేదా గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో రీచార్జ్ చేసుకునే వీలుంటుంది.

ఆర్‌బీఐ ఆదేశాలతో తమ రుణ, బీమా పంపిణీ, ఈక్విటీ బ్రోకింగ్ వ్యాపారాలకు పీపీబీఎల్‌తో సంబంధం లేదు కాబట్టి వాటిపై ఎలాంటి ప్రభావం ఉండదని పేటీఎం ఇప్పటికే స్పష్టం చేసింది. అంతేకాదు, కంపెనీకి చెందిన ఆఫ్‌లైన్ మర్చంట్ పేమెంట్ నెట్‌వర్కింగ్ సేవలైన పేటీఎం క్యూఆర్, పేటీఎం సౌండ్‌బాక్స్, పేటీఎం కార్డ్ మెషీన్ యధాతథంగా కొనసాగనున్నాయి. ఈ సేవల్లో కొత్త కస్టమర్లను చేర్చుకునేందుకు ఎలాంటి ఆంక్షల్లేవని పేటీఎం వెల్లడించింది.

ఎల్‌ఐసీ కొత్త ప్లాన్ ఇండెక్స్ ప్లస్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) ఇండెక్స్ ప్లస్ పేరిట వ్యక్తిగత జీవిత బీమా ప్లాన్‌ను విడుదల చేసింది. ఇది యూనిట్ లింక్డ్, రెగ్యులర్ ప్రీమియం పాలసీ. ఇది అమలులో ఉన్న కాలం అంతా జీవితబీమా కవరేజీతో పాటుగా పొదుపు అవకాశం కూడా కల్పించే పాలసీ అని ఎల్‌ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది. నిర్దిష్ట గడువు ముగిసిన అనంతరం వార్షికంగా చెల్లించే ప్రీమియంలో కొంత శాతాన్ని గ్యారంటీ జోడింపుగా యూనిట్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ సొమ్మును యూనిట్లు కొనుగోలు చేసేందుకు వినియోగించవచ్చు. ఐదు సంవత్సరాల లాకిన్ గడువు ముగిసిన అనంతరం ఆ యూనిట్లను పాక్షికంగా ఉపసంహరించుకునే అవకాశం కూడా కల్పిస్తారు.

ప్లాన్ ముఖ్యాంశాలు...

- ప్లాన్‌లో చేరేందుకు కనీస వయసు 90 రోజులు. గరిష్ఠ వయో పరిమితి హామీ మొత్తం ఆధారంగా 50 లేదా 60 సంవత్సరాలు.
- కనీస హామీ మొత్తం వార్షిక ప్రీమియంకు 7 నుంచి 10 రెట్లు.
- మెచ్యూరిటీకి కనీస వయసు 18 సంవత్సరాలు కాగా గరిష్ఠ వయసు 75 లేదా 85 సంవత్సరాలు.
- కనీస కాలపరిమితి 10 లేదా 15 సంవత్సరాలు.
- కనీస ప్రీమియం రూ.30000 (ఏడాదికి), రూ.15000 (అర్ధసంవత్సరానికి), రూ.7500 (త్రైమాసికానికి), రూ.2500 (నెలవారీగా)
- ఎన్ఎస్ఈ 100 ఇండెక్స్ లేదా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్‌లలోని ఎంపిక చేసిన షేర్లలో పెట్టుబడులు పెట్టే ఫ్లెక్సి గ్రోత్ ఫండ్ లేదా ఫ్లెక్సీ స్మార్ట్ గ్రోత్ ఫండ్‌లో ఏదైనా ఎంచుకునే అవకాశం
- మెచ్యూరిటీ సమయానికి పాలసీదారుడు జీవించి ఉన్నట్టయితే యూనిట్ ఫండ్ విలువతో సమానమైన మొత్తం చెల్లిస్తారు.

యూనియన్ బ్యాంక్‌కు పీసీఐ పిన్ సర్టిఫికేషన్



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేమెంట్ కార్డు పరిశ్రమ పిన్ లావాదేవీ భద్రత (పీసీఐ పిన్) సర్టిఫికేషన్‌ను సాధించింది. బ్యాంక్ వ్యవస్థల ద్వారా నిర్వహించే అన్ని రకాల లావాదేవీల గోప్యత, సమగ్రత సంరక్షణ విషయంలో పరిశ్రమ అగ్రశ్రేణి ప్రమాణాలకు దీటుగా పటిష్ఠమైన భద్రత కల్పిస్తున్నందుకు ఇది గుర్తింపు అని బ్యాంక్ తెలిపింది. రోజురోజుకీ పెరుగుతున్న పలు ముప్పులను నిరోధించేందుకు నిరంతరాయంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా కస్టమర్ల విశ్వాసం పొందడం బ్యాంకు లక్ష్యమని పేర్కొంది.

అరబిందో అనుబంధ సంస్థ విక్రయం

హైదరాబాద్: నష్టాల్లో ఉన్న అమెరికాలోని తన అనుబంధ కంపెనీ 'యుజియా యూఎస్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎల్ఎల్‌సీని అరబిందో ఫార్మా విక్రయించింది. ఈ కంపెనీ వ్యాపార ఆస్తులు, అప్పులు, ఉద్యోగులతో కలిపి ఎంపవర్ క్లినిక్ సర్వీస్ న్యూజెర్సీ అనే కంపెనీకి 5.2 కోట్ల డాలర్లకు (సుమారు రూ.432 కోట్లు) విక్రయించింది. దీనికి తోడు 'యుజియా యూఎస్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎల్ఎల్‌సీ, దాని అనుబంధ సంస్థల ఉత్పత్తి యూనిట్లను 20 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం ద్వారా మరో 5.8 కోట్ల డాలర్లు (సుమారు రూ.482 కోట్లు) అరబిందో ఫార్మాకు లభిస్తాయి.

ఎయిర్‌టెల్ లాభం రూ.2,442.2 కోట్లు

న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ మూడో త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. కంపెనీ ఈ కాలానికి రూ.37,899.5 కోట్ల ఆదాయంపై రూ.2,442.2 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022 డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 5.8 శాతం, నికర లాభం 54 శాతం పెరిగాయి.

చార్జీల దరువు తప్పదు: ఒక్కో ఖాతాదారుడి నుంచి లభించే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 7.7 శాతం పెరిగి రూ.208కి చేరింది. అయితే ఇది ఏ మాత్రం గిట్టుబాటు కాదని, చార్జీలు మరింత పెంచక తప్పదని కంపెనీ ఎండీ గోపాల్ విఠల్ ఈ సందర్భంగా చెప్పారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 6-2-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

గ్రామీ అవార్డుల్లో మనోళ్ల 'శక్తి'

ఐదు పురస్కారాలు సాధించిన భారతీయులు

ఫ్యూజన్ బ్యాండ్ 'శక్తి'కి గ్లోబల్ మ్యూజిక్ అవార్డు

ఆ బ్యాండ్ సభ్యుల్లో.. ప్రముఖ తబలా మ్యాస్ట్రో జాకీర్ హుస్సేన్, గాయకుడు శంకర్ మహదేవన్

జాకీర్‌కు 3, వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియాకు 2 అవార్డులు 8


అవార్డును అందుకున్న శంకర్ మహదేవన్, గణేశ్ రాజగోపాలన్, జాకీర్‌హుస్సేన్, సెల్వ గణేశ్

మాకు 370 సీట్లు

బీజేపీ సొంతంగా గెలుస్తుంది.. ఎన్‌డీఏ స్కోరు 400 దాటుతుంది

100 రోజుల్లో నా మూడో దఫా షురూ

ఈసారి వెయ్యేళ్లు గుర్తుండేలా పాలన

3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

దేశానికి బలమైన ప్రతిపక్షం అవసరం

కాంగ్రెస్ ఆ పనిచేయదు, ఇతరుల్ని చేయనివ్వదు.. ఆ పార్టీకి ఇక తాళమే

దశాబ్దాలు అధికారంలో ఉంది.. అంతే సమయం ప్రతిపక్షంలో ఉండాలి

ఓబీసీలు లేరంటారేంటి?.. నేనే ఓబీసీని

లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ


సోమవారం పార్లమెంటు ప్రాంగణానికి వచ్చిన వివిధ మత పెద్దలకు ప్రధాని మోదీ అభివాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లను కచ్చితంగా గెలుస్తుందని, మొత్తంగా ఎన్‌డీఏ కూటమి 400కు పైగా సీట్లను సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధీమా వ్యక్తం చేశారు. తన మూడో దఫా ప్రభుత్వంలో భారతదేశానికి వచ్చే వెయ్యేళ్లకు అవసరమైన పునాది వేసేలా చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. తన మూడో దఫా పాలన ఎంతో దూరంలో లేదని, 100-125 రోజుల్లో ప్రారంభమవుతుందని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ మోదీ సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. దాదాపు 100 నిమిషాల పాటు కొనసాగిన ఆయన ప్రసంగంలో విపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌ను దునుమాడారు. దేశంలో ప్రతిపక్షాల దుస్థితికి కాంగ్రెస్ పార్టీయే కారణమని, కాంగ్రెస్ దుకాణానికి తాళం వేసే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఇండియా కూటమి గాడి తప్పిందని, ఆ కూటమి పక్షాల మధ్య ఐక్యత లేదని.. వారిపై వారికే విశ్వాసం లేనప్పుడు ప్రజలకు వారి మీద విశ్వాసం ఎలా ఉంటుందని ప్రధాని

మిగతా 8వ పేజీలో...


ఇండియా కూటమి గెలిస్తే.. రిజర్వేషన్లపై

50% పరిమితి ఎత్తేస్తాం



దేశవ్యాప్తంగా కులగణన చేపడతాం: రాహుల్

హేమంత్ సోరెన్ సతీమణికి పరామర్శ



ఈసీలో దొంగలు పడ్డారు!

రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో చొరబడ్డ ఐ-ప్యాక్

కీలక డేటా మొత్తం చోరీ!

ఇప్పటికే కలకలం రేపుతున్న 'ఓట్ల దొంగలు'

ఇప్పుడు ఏకంగా ఈసీలోకి 'దొంగల' చొరబాటు వ్యవహారం వెలుగులోకి..

సీఈవో కార్యాలయంలో ఉద్యోగులుగా చేరిన ఇద్దరు

ఆ ఇద్దరికీ ఐ-ప్యాక్‌తో సన్నిహిత సంబంధాలు

వారిలో ఒకరు ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్ హోదాలో ప్రవేశం

ఈసీ కార్యాలయంలోని కీలక విభాగాలపై కన్ను

నమ్మి లాగిన్లు వారిద్దరి చేతిలో పెట్టిన అధికారులు

అదే అదునుగా డేటా అంతా చాప చుట్టేశారు

రెండు నెలలు మాత్రమే అక్కడ విధులు

ఈ లోపే హార్డ్‌డిస్కులు, మెయిల్స్ మొత్తం కాపీ

తీవ్ర ఆందోళనలో రాష్ట్ర ఈసీ అధికారులు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జనంలోకి చొచ్చుకుపోవడం చేతకాక వైసీపీ అడ్డదారులు తొక్కుతోంది. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో ఓట్ల దొంగల వ్యవహారం ఇప్పటికే కలకలం రేపుతోంది. ఇప్పుడు ఏకంగా సీఈవో కార్యాలయంలోకే దొంగలు చొరబడడం తాజా సంచలనం. అత్యంత విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం.. వైసీపీ సొంత సంస్థగా భావించే ఐ-ప్యాక్ టీమ్‌తో సంబంధాలున్న ఇద్దరు వ్యక్తులు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలో కీలక స్థానాల్లో ఉద్యోగాలు సంపాదించారు. వారి ద్వారా ఈసీలో ఉన్న డేటా మొత్తం వైసీపీ సేకరించినట్టు తెలుస్తోంది. గత ఏడాది అక్టోబరులో మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి ఈసీలోకి ప్రవేశించారు. ఆ తర్వాత మరొకరు కూడా చేరారు. వీరిద్దరికీ

మిగతా 8వ పేజీలో...

నిబద్ధతతో పనిచేస్తారని విశ్వసిస్తున్నాం 9

రాష్ట్ర ఎన్నికల అధికారులనుద్దేశించి హైకోర్టు వ్యాఖ్య

దూప్లికేట్ ఓట్లపై ఈసీకి సుప్రీం నోటీసు 10

పేపర్ లీక్ చేస్తే కోటి జరిమానా

మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష

పోటీ పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట.. 8

లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ బిల్లు


8

ప్రజాస్వామ్య ఖూనీని సహించం

అపహాస్యంగా చండీగఢ్ మేయర్ ఎన్నిక.. పరిస్థితి భయం కలిగిస్తోంది

బ్యాలెట్ పేపర్ మీది గుర్తులను రిటర్నింగ్ అధికారి చెరిపేసినట్టుంది

రికార్డులు సమర్పించండి: సుప్రీం



వ్యాపారవేత్తలపై ప్రతీకార చర్యలు

పెరిగిపోతున్నాయ్!

వనవాసానంతరం రాముడిలా తిరిగొస్తా

టీడీపీ ఎంపీ జయదేవ్ గల్లా వ్యాఖ్య

పార్లమెంటులో చివరి ప్రసంగం 8

పార్టీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు

వివేకా కేసు డైరీని కోర్టు ముందుంచండి! 10



సీబీఐకి సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దేశం

అవినాశ్‌రెడ్డి బెయిల్ పిటిషన్ రద్దుపై విచారణ ఏప్రిల్ 22 తర్వాతకు వాయిదా


8

హెచ్-4 వీసా ఉంటే.. వర్క్ ఆథరైజేషన్

ఇక ఆటోమేటిక్

హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు, పిల్లలకు చాన్స్.. ఏటా లక్ష మందికి లబ్ధి

ఐ1, ఐ2, ఐ3 వీసాలున్నవారికే చాన్స్

ఏడాదికి 18 వేల మందికి గ్రీన్‌కార్డులు

కీలక బిల్లు ఆమోదించనున్న అమెరికా

గట్టెక్కిన సోరెన్

ఝార్ఖండ్‌లో విశ్వాస పరీక్షను 47-29 ఓట్లతో నెగ్గిన చంపయి 8

అవినీతిని నిరూపిస్తే తప్పుకొంటా..

బీజేపీకి హేమంత్ సోరెన్ సవాల్

కోర్టు అనుమతితో బలపరీక్షకు రాక

వచ్చే ఎన్నికల్లో

జగన్ X జనం!

అరాచక పాలనపై తిరుగుబాటు మొదలు: చంద్రబాబు

బటన్ నొక్కుడులో బొక్కుడెంత

ఉత్తరాంధ్రను ఊడ్చేశారు..

రుషికొండను మింగేశారు

కబ్జాల కేంద్రంగా విశాఖ

రాష్ట్రాన్ని నలుగురు రెడ్లకు అప్పగించారు

ఇదేనా సామాజిక న్యాయం? 9

చెల్లిని, తల్లినే వదిలిపెట్టని వ్యక్తి జనాన్ని మాత్రం వదిలిపెడతాడా?

టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తే పేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తాం

రైతుకు రూ.25 వేలు అందిస్తాం

మమ్మల్ని ఆశీర్వదించండి

యువత ఎటువైపు ఉంటే విజయం అటువైపే. వచ్చే ఎన్నికల్లో ఓటు బటన్ నొక్కి, జగన్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధం.

పరిశ్రమలను తరిమికొట్టాడు.. ఐటీ, ప్రభుత్వ ఉద్యోగాలు వంటి శాశ్వత ఉపాధి కల్పించాల్సిన సీఎం.. వలంటీర్లు, ఫిష్‌మార్ట్, మద్యం దుకాణాల్లో పెట్టి రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చానంటున్నాడు.

- చంద్రబాబు

ఎన్నికల నాటికి తుఫానుగా మారి ఈ సీఎం కొట్టుకుపోవడం ఖాయం

అర్జునుడు కాదు.. అక్రమార్జునుడు





గొండుపాలెం, చింతలపూడి సభల్లో బాబు వినతి

ఏలూరు జిల్లా చింతలపూడిలో బహిరంగ సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు

అరచేతిలో 'వైద్యం'

కొత్త మెడికల్ కాలేజీలపై సీఎం రోతపత్రికలో తప్పుడు రాతలు

ఎన్నికల వేళ మభ్యపెట్టే యత్నం

5 కొత్త కాలేజీల్లో ఆధునిక వసతులట

క్షేత్రస్థాయిలో భిన్నంగా పరిస్థితులు

పూర్తిస్థాయిలో నిర్మాణం కాని భవనాలు

నిర్మాణంలోనే హాస్టళ్లు, బోధనాస్పత్రులు

కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు

ఈ ఏడాదిలో 5, వచ్చే ఏడాదిలో 7 కొత్త కాలేజీలు రెడీ అంటూ డబ్బా

పలు చోట్ల పునాదుల దశలోనే నిర్మాణాలు

ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణం తాజా పరిస్థితి

ఆంధ్రజ్యోతి పరిశీలన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కొత్తగా ప్రారంభించిన 5 మెడికల్ కాలేజీల్లో విద్యార్థులకే సరైన సౌకర్యాలు లేకుంటే.. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ అంటూ సీఎం జగన్ రోత పత్రికలో చెత్త రాతలు రాశారు. హాస్టల్ భవనాల నిర్మాణాలను ఇంకా పూర్తి చేయకపోయినా, కనీస వసతులు కల్పించకపోయినా.. ఆధునిక వసతులతో కొత్త కాలేజీలు నిర్మించారని తప్పుడు రాతలు రాశారు. పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీని నియమించకపోయినా, బోధనాస్పత్రులు నిర్మించకపోయినా, చాలా భవనాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నా.. వైద్య విద్యలో

మిగతా 10వ పేజీలో...



ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసుల్లో 41ఏ నిబంధనలు పాటించరా?

ఎమ్మెల్యేను అరెస్టు చేస్తే బాధ్యులు లోపలికే

ఉన్నతాధికారులపై చర్యలకు ఆదేశిస్తే తప్ప పరిస్థితి చక్కబడేలా లేదు

న్యాయమూర్తి తీవ్ర వ్యాఖ్యలు

ఏలూరి ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

ఎంపీలు, ఎమ్మెల్యేలే భయపడుతుంటే..

ఇక సామాన్యుల పరిస్థితేంటి?

పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసుల్లో పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నిబంధనలు పాటించకపోవడంపై హైకోర్టు సోమవారం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా 41ఏ నోటీసులిచ్చేలా ఆదేశించండి.. పోలీసులు అరెస్టు చేస్తారేమోనని భయపడుతుంటే.. ఇక

మిగతా 10వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జార్ఖండ్ పరీక్ష

జార్ఖండ్‌లో చంపయి సొరేన్ ప్రభుత్వం విశ్వాసపరీక్షలో బలంగా నెగ్గింది. మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ అరెస్టు అనంతరం, మూడురోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఆయన ఈ తొలిపరీక్ష దాటగానే ఓ ట్వీట్ చేస్తూ, తమ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న కుట్రలను జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి సంఘటితంగా ఛేదించిందన్నారు. న్యాయస్థానం అనుమతితో ఈ విశ్వాసపరీక్షలో పాల్గొన్న హేమంత్ సొరేన్ చర్చ సందర్భాన్ని వినియోగించుకొని బీజేపీమీద తీవ్ర విమర్శలు చేశారు. జార్ఖండ్‌ను ఆదివాసీ ముఖ్యమంత్రులు పాలించడం ఆ పార్టీకి గిట్టదని, చివరకు దాని పాలనలో కూడా అదే విషయం రుజువైందని అంటూ, తనపై ఆరోపణలు రుజువుచేయగలిగినపక్షంలో రాజకీయాలనే కాదు, రాష్ట్రాన్నే వదిలిపోతానని ఓ భీకర ప్రతిజ్ఞచేశారు. పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడు, శిబూ సొరేన్‌కు విశ్వాసపాత్రుడు అయిన చంపయిని సీఎం కుర్చీలో కూచోబెట్టడంవల్లనే ఈ గండంనుంచి జేఎంఎం బయటపడగలిగిందని చాలామంది నమ్మకం.

హేమంత్‌ను అరెస్టుచేసిన తరువాత, అక్కడి కూటమి ప్రభుత్వాన్ని కూల్చేయడం సులభమని బీజేపీ భావించిందో లేదో తెలియదు కానీ, జెఎంఎం నాయకులు మాత్రం చాలా జాగ్రత్తలు పడ్డారు. తమ ఎమ్మెల్యేలందరినీ హైదరాబాద్‌లో దాచి, ఆఖరునిముషంలో సభలో ప్రవేశపెట్టారు. చంపయిని ఆహ్వానించడం, ప్రమాణస్వీకారం, విశ్వాసపరీక్ష ఇత్యాది ఘట్టాల్లో జాప్యం, కుట్రలు జరిగాయని, వాటిని సంఘటితంగా ఎదుర్కొన్నామని జేఎంఎం వాదన. అయితే, హేమంత్ స్థానాన్ని ఎవరు భర్తీచేయాలన్న చర్చ పార్టీలో ఇంకా మొదలుకాకముందే, ఆయన భార్య కల్పన ముఖ్యమంత్రి కాబోతున్నారని రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. ఆ తరువాత శిబూ సొరేన్ పెద్దకోడలు, జెఎంఎం ఎమ్మెల్యే సీతాసొరేన్ బహిరంగంగానే కల్పనను వ్యతిరేకించడం, పార్టీలో తనతో సహా ఎంతోమంది సీనియర్లు ఉన్నారని గుర్తుచేయడం తెలిసినవే. హేమంత్ మీద ఈడీ దూకుడు పెంచుతున్నకొద్దీ ఆయన స్థానంలోకి కల్పన వస్తారన్న ప్రచారం బీజేపీ విస్తృతంగా చేసింది. విద్య, పారిశ్రామిక రంగాలకు పరిమితమైన కల్పన రాజకీయాలకు దూరంగా ఉన్నట్టు కనిపించినా, ఒడిశా మూలాలున్న ఆమెకు రాజకీయాలమీద ఆసక్తి ఉన్నదని, వ్యవహారాలు చక్కబెట్టగల సమర్థత ఉన్నదని చాలామంది అంటారు.

హేమంత్ అరెస్టు విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చూపిన పట్టుదల ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఫోర్జరీ పత్రాలతో భూమి కాజేశాడన్న ఆరోపణ తప్ప, ఆయనేమీ హంతకుడు కాదు, బ్యాంకులకు కోట్లు ఎగవేసి విదేశాలకు పారిపోతున్న పారిశ్రామికవేత్తా కాదు. ఆయనను ప్రశ్నించడం ముఖ్యం కావచ్చు కానీ, అది ఆలస్యం కావడం వల్ల వచ్చిపడే నష్టమేమీ లేదు. ఇంతకంటే తీవ్రమైన ఆరోపణలున్న నాయకులు, ముఖ్యమంత్రులు కేంద్రంలోని పెద్దల ఆశీస్సులతో చల్లగా ఉన్న దేశం మనది. హేమంత్ విషయంలో అవినీతిమీద పోరాటం కంటే విపక్షనేతల వేటకే బీజేపీ ప్రాధాన్యతనిస్తోందని అనిపించకమానదు. ఆయన కనిపించడం లేదని ఈడీ అనడం, బీజేపీ రాద్ధాంతం చేయడం చూసినప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తితో వ్యవహరించాల్సిన తీరు ఇదా అని విస్మయం కలుగుతుంది. ఈ పరిణామాల్లో హేమంత్ వ్యవహరించిన తీరు కూడా ఆశ్చర్యం కలిగించేదే. తనను అరెస్టుచేయడం ఖాయమని తేలిపోవడంతో, ఇంటిపోరును చక్కదిద్దుకోవడానికి, అధికార కూటమి ఎమ్మెల్యేలతో మంతనాలు జరపడానికి ఆయన ఈ సమయాన్ని వాడుకున్నట్టుంది. ముఖ్యమంత్రిగా అరెస్టువారెంట్ మీద సంతకం చేస్తే, రాజ్యాంగ సంక్షోభం పేరిట రాష్ట్రపతిపాలన విధించే అవకాశం ఉన్నందున, రాజీనామా తరువాతే దానిపై సంతకం చేసి ఆయన తన ప్రభుత్వాన్ని తెలివిగా కాపాడుకున్నాడని కొందరు అంటారు. హేమంత్‌బాబు మళ్ళీ రాష్ట్రాన్ని పరిపాలిస్తారు అంటూ విశ్వాసపరీక్ష సందర్భంగా చంపయి హామీ ఇచ్చారు. మరో మూడునెలల్లో పార్లమెంటు ఎన్నికలు, ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండగా, హేమంత్ అరెస్టు రాష్ట్రంలోని 28శాతం ఆదివాసీ జనాభాకు ఏ అభిప్రాయం కలిగిస్తుందో చూడాలి. ఈడీ విచారణ అదేపనిగా సాగుతూ, అసెంబ్లీ ఎన్నికలయ్యేవరకూ హేమంత్ జైల్లోనే ఉండాల్సివస్తే, చంపయ్‌కు అది విషమపరీక్షే. ఎంతకాదనుకున్నా, ఏదో విధంగా హేమంత్ లేని జార్ఖండ్‌ను కైవసం చేసుకోవడం సులభమే.

భారత యాత్రికుడు, హిందూ ధర్మయోధుడు

అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన పక్షం రోజులలోనే బీజేపీ సంస్థాపక సభ్యుడైన లాల్‌కృష్ణ అద్వాణీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం భారత జాతీయవాదులందర్నీ ఎంతో ఆనందపరిచింది. అయోధ్యకూ, అద్వాణీకి అవినాభావ సంబంధం ఉన్నది. అయోధ్య రథయాత్రకు ఆయన పూనుకోకపోయి ఉంటే రామమందిర పునర్నిర్మాణం కోసం స్వతంత్ర భారత చరిత్రలో అతి పెద్ద ప్రజా ఉద్యమం ప్రారంభమయి ఉండేదే కాదు. ఈ దేశ ప్రజల్లో అంతర్లీనంగా ఉన్న జాతీయవాద భావాలను పెల్లుబుకేలా చేసి ఇవాళ 500 సంవత్సరాల బానిసత్వం నుంచి దేశం విముక్తి అయ్యేందుకు అద్వాణీయే నాంది పలికారన్న విషయంలో ఎవరికీ ఏ మాత్రం సందేహం లేదు.

హిందూ మత భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు సాధించుకునేందుకే భారతీయ జనతా పార్టీ రామ జన్మభూమిని తెరమీదకు తీసుకువచ్చిందని కుహనా లౌకిక పార్టీలు, మేధావులు ఇప్పటికీ విమర్శిస్తుంటారు అయితే బీజేపీతో నిమిత్తం లేకుండా ఈ దేశ ప్రజలందరూ శ్రీరాముడిని ఆరాధిస్తారని, అయోధ్యతో వారు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా, మానసికంగా మమేకం అయ్యారనే సత్యాన్ని వారు గ్రహించలేదు. లేకపోతే అయిదు దశాబ్దాలుగా రామజన్మభూమి కోసం ప్రజలు పోరాడేవారే కాదు. భారత ప్రజల మనోభావాలను తెలుసుకునేందుకే అయోధ్యలో 1990 సెప్టెంబర్– అక్టోబర్ నెలల్లో సోమనాథ్ నుంచి అయోధ్య వరకూ అద్వాణీ రామ్ రథయాత్ర జరిపారు. ఆనాడు ఎవరూ ఊహించని విధంగా ఈ యాత్రకు ప్రజాస్పందన లభించింది. హిందూ ధర్మం భారతీయ ఆత్మ. ఈ ధర్మం పట్ల ప్రజలకున్న మమేకతను ఒక సానుకూల శక్తిగా మళ్లించినట్లయితే దాన్ని జాతీయ పునర్నిర్మాణం కోసం ఉపయోగించుకోవచ్చని స్వామీ వివేకానంద చెప్పిన మాటల్లో ఎంత సత్యం ఉన్నదో బీజేపీ తెలుసుకుంది. ఇవాళ అయోధ్యలో రామమందిర నిర్మాణంలో ప్రాణప్రతిష్ఠ జరిగినప్పుడు కోట్లాది ప్రజలు సానుకూలంగా స్పందించి వాడవాడలా సంబరాలు, ప్రార్థనలు జరుపుకోవడాన్ని చూస్తుంటే నాడు అద్వాణీ రథయాత్రకు లభించిన ప్రతిస్పందన ఎంత సహజమైనదో అర్థమవుతోంది. అద్వాణీ చేపట్టిన ఉద్యమం పట్ల ప్రజల ప్రతిస్పందన గమనించి నాడు కుహనా లౌకిక పార్టీలన్నీ ఏకమై ఆయనను 1990 అక్టోబర్ 23న బిహార్‌లోని సమస్తిపూర్‌లో అరెస్టు చేసి దాదాపు ఐదు వారాల పాటు నిర్బంధించాయి. ఆ రోజు అద్వాణీతో పాటు వేలాది బీజేపీ కార్యకర్తల, కోట్లాది ప్రజల మనోభావాలను తొక్కిపెడితేనేం వారిలో ఉన్న అంతర్లీన జాతీయ వాద భావనల్ని అణిచివేయలేకపోయారు. నివురుగప్పిన దావానలమైనట్లు ఆ తర్వాత కూడా అయోధ్యకోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, బలిదానాలు జరిగాయి. తమ ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు ప్రజలు భారతీయ జనతా పార్టీని పూర్తి మెజారిటీతో రెండుసార్లు అధికారంలోకి తీసుకువచ్చారు.


■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

రామజన్మభూమి కోసమే కాదు, దేశాన్ని సమైక్యం చేసేందుకు అద్వాణీ అనేక యాత్రలు జరిపారు. 1993లో ఆయన తన జనాదేశ యాత్రను మైసూరు నుంచి ప్రారంభించి భోపాల్ వరకు 14 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజల జీవితాల్లో మతాన్ని నిర్మూలించేందుకు, మైనారిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ బిల్లును వ్యతిరేకించేందుకు ఆయన ఈ యాత్ర చేపట్టారు. నక్సలైట్ పీడిత ప్రాంతాలతో పాటు దేశ వ్యాప్తంగా నలుమూలలా ఆయన యాత్రకు అమోఘమైన ప్రతిస్పందన లభించింది. ఆ తర్వాత ముఖ్యమైనది 1996లో ఆయన కొచ్చిన్ నుంచి జరిపిన సురాజ్ యాత్ర. రామరాజ్యం భావన గురించి వివరిస్తూ అధికార పార్టీ అవినీతిని ఎండగడుతూ నెలరోజులకు పైగా ఆయన ఈ యాత్ర రాజస్థాన్‌లో ప్రవేశించే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఈ యాత్రను నిర్వహించిన వారిలో ఒక కార్యకర్తగా నేను అద్వాణీ తన ప్రసంగాల ద్వారా దేశభక్తిని ఎలా పురిగొల్పారో, ప్రజల్లో అద్భుతమైన ప్రతిస్పందన ఏ విధంగా లభించిందో ప్రత్యక్షంగా తెలుసుకున్నాను 1997లో దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమ భావాలను పురికొల్పేందుకు, స్వరాజ్యం నుంచి సురాజ్యం సాధించే దిశగా దేశ ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించేందుకు ఆయన స్వాతంత్ర్య స్వర్ణజయంతి యాత్ర. నిర్వహించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమ వీరులు, అమరులకు నివాళులు అర్పించేందుకు వారి ప్రాంతాలను సందర్శించారు. వారు త్యాగాలు జరిపిన ప్రాంతాలకు వెళ్లడం ఒక తీర్థయాత్రగా అద్వాణీ అభివర్ణించారు. నిజానికి స్వాతంత్ర్యం సాధించామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు కూడా స్వర్ణజయంతిని జరుపుకోలేదు. కాని అద్వాణీ తన స్వర్ణజయంతి యాత్ర ద్వారా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి అయిదు దశాబ్దాల్లో దేశం సాధించిన విజయాలు, వైఫల్యాలను సమీక్షించి ప్రజల్లో చర్చను లేవనెత్తారు. భారతీయ జనతా పార్టీయే దేశానికి మంచి పాలనను అందించగలదని వివరించారు. దేశాన్ని ఆకలి, అవినీతి, భయం నుంచి విముక్తి కావాలంటే బీజేపీ అధికారంలోకి రావల్సిన చారిత్రక అవసరాన్ని ఆయన వివరించారు. అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వాన్ని 13 రోజుల్లో పడగొట్టడంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొన్న సమయమది. దాదాపు 15వేల కిలోమీటర్ల మేరకు నాలుగు దశల్లో జరిపిన ఈ స్వర్ణజయంతి రథయాత్రలో 59 రోజుల పాటు 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆయన ప్రయాణించి 759 సభల్లో ప్రసంగించారు. స్వాతంత్ర్యోద్యమాన్ని జాతీయ వాదంతో సమ్మిళితం ఎలా చేయాలో, దేశం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లపై ఏ విధమైన దృక్పథాన్ని అలవరుచుకోవాలో ఆయన ఈ యాత్ర ద్వారా తెలిపారు. నాడు అద్వాణీ జరిపిన స్వర్ణ జయంతి యాత్ర 1998లో అటల్ బిహారీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు దోహదం చేసింది.


ప్రజలతో సంబంధాలే ప్రజాస్వామ్యానికి ప్రాణం అని అద్వాణీ రుజువు చేశారు. ఆయన లాగా భారతదేశంలో విస్తృతంగా పర్యటించి జన నాడి తెలుసుకున్న నాయకుడు మరొకరు లేరు. నిత్యం ప్రజల్లో ఉంటూ, సామాన్యులనే నేతలుగా రూపొందిస్తూ భారతీయ జనతా పార్టీని ఆయన పటిష్ఠం చేశారు. ఈ నిరంతర యాత్రికుడికి 'భారతరత్న' ప్రదానం చేయడం చంద్రుడికి ఓ నూలుపోగు మాత్రమే.

అధికారంలో ఉన్నప్పుడు కూడా అద్వాణీ యాత్రలు జరపడం ఆపలేదు. 2002లో భారత్ ఉదయ్ యాత్ర పేరుతో 33 రోజుల పాటు 8500 కిలోమీటర్ల మేరకు రెండు దశలుగా 16 రాష్ట్రాల్లోని 121 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆయన పర్యటించారు. మళ్లీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2006లో భారత సురక్షా యాత్ర జరిపి ఉగ్రవాదం, మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి, రాజకీయాల్లో నేరచరిత్రుల వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలకు వివరించారు. 2011లో జనచేతనా యాత్ర పేరుతో బిహార్ నుంచి ప్రారంభించి 40 రోజుల పాటు దేశ వ్యాప్తంగా పర్యటించారు. యూపీఏ హయాంలో అవినీతిని ఆయన ఎండగట్టారు. ఈ యాత్ర ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించి 2014లో బీజేపీ అఖండ మెజారిటీతో అధికారంలోకి రావడానికి మార్గాన్ని సుగమం చేసింది. తన జీవితమంతా ప్రజలను కలుసుకునేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ అద్వాణీ వదిలిపెట్టలేదు. ప్రజలతో సంబంధాలే ప్రజాస్వామ్యానికి ప్రాణం అని ఆయన రుజువు చేశారు. ఆయన లాగా భారతదేశంలో విస్తృతంగా పర్యటించి ప్రజల నాడి తెలుసుకున్న నాయకుడు మరొకరు లేరు. నిత్యం ప్రజల్లో ఉంటూ, సామాన్యులనే నేతలుగా రూపొందిస్తూ భారతీయ జనతా పార్టీని ఆయన పటిష్ఠం చేశారు. దేశం కోసం ఈ నిరంతర యాత్రికుడు చేసిన త్యాగాలను గౌరవించేందుకు 'భారతరత్న' ప్రదానం చేయడం చంద్రుడికి నూలుపోగు సమర్పించడం మాత్రమే.


భారత రాజ్యాంగం విప్లవకరమైనదే కానీ...

వర్తమాన భారత రాజకీయ రంగంలో రెండు పరస్పర విరుద్ధ వాస్తవాలు ఒకేసారి కొనసాగుతున్నాయి. మొదటిది: ఒక ప్రజాస్వామిక రాజ్యాంగం అమలులో వున్నది. కొందరు దీన్ని లౌకిక, సామ్యవాద రాజ్యాంగం అని కూడ అంటున్నారు. రెండోది: దేశ పాలన ఫాసిస్టు శక్తుల చేతుల్లోకి పోయింది. ప్రజాస్వామిక రాజ్యాంగం అమలులో ఉన్న కాలంలోనే రాష్ట్రపతి ఉత్తర్వులతో దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించడాన్ని మనం చూశాం. ప్రజాస్వామిక, లౌకిక, సామ్య వాద రాజ్యాంగం అమల్లోవున్న కాలంలోనే ఫాసిస్టు శక్తులు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడాన్నీ ఇప్పుడు చూస్తున్నాం.

రాజ్యాంగం అమాయికంగా ఫాసిజాన్ని ప్రమోట్ చేస్తున్నదా? ఫాసిస్టులు రాజ్యాంగాన్ని తెలివిగా వాడుకుంటున్నారా? అనే ప్రశ్న ఈ సందర్భంగా తలెత్తడం సహజం. ఎలా చూసినా భారత రాజ్యాంగం విప్లవకరమైనది. మనువు విధించిన సామాజిక నిబంధనలతో, చాణుక్యుడు/ కౌటిల్యుడు / విష్ణుగుప్తుడు రూపొందించిన ఆర్థిక విధానాలతో నడిచే వ్యవస్థలో నలిగిపోతున్న కోట్లాది మంది ప్రజానీకానికి అది కొత్త జీవితాన్ని ఇచ్చింది. మరోమాటలో చెప్పాలంటే, కుల–మత ప్రధాన ఫ్యూడల్ వ్యవస్థను పెట్టుబడీదారీ వ్యవస్థగా మార్చడంలో రాజ్యాంగం కేటలిస్ట్ పాత్రను నిర్వహించింది. సమాజంలో వచ్చిన ఆ గుణాత్మకమార్పును మనం స్పష్టంగా చూస్తున్నాం. అందుకు రాజ్యాంగాన్ని మెచ్చుకోవాలి.

రాజ్యాంగ సభలోని దాదాపు డజను కమిటీల్లో కీలకమైన డ్రాఫ్టింగ్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన బిఆర్ అంబేడ్కర్ తన చివరి ఉపన్యాసంలో (నవంబరు 25, 1949) రాజ్యాంగం పరిధి–పరిమితుల గురించి ప్రస్తావించాడు. 'ప్రతి మనిషికీ ఒక ఓటు; ప్రతి ఓటుకూ సమాన విలువ ఇవ్వడం ద్వారా రాజకీయరంగంలో సమానత్వాన్ని సాధించాం. అయితే, ఇది సరిపోదు. సాంఘిక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించి తీరాలి. భవిష్యత్తు పాలకులు అందుకు కృషి చేయాలి. వాళ్ళు సాధ్యమైనంత త్వరగా సాంఘిక, ఆర్థిక రంగాల్లో సమానత్వాన్ని సాధించకపోతే ఆ రంగాల్లోని పీడితులకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం పోతుంది. అప్పుడు వాళ్ళు తిరగబడి ఇన్నేళ్ళుగా మనం కష్టపడి నిర్మించిన ఈ ప్రజాస్వామిక భవనాన్ని పేల్చి పడేస్తారు' అని హెచ్చరించాడు. ప్రతిదానికీ వున్నట్టు రాజ్యాంగాలకూ ఒక ఎక్స్‌పైరీ డేట్ వుంటుంది; అది పెట్టుబడిదారుల రాజ్యాంగం కావచ్చు, సోషలిస్టుల రాజ్యాంగం కావచ్చు. దేనికీ మినహాయింపు లేదు. రాజ్యాంగాలు ఎల్లకాలం తొలినాటి ఆదర్శాలతో కొనసాగలేవని వివిధ దేశాల చరిత్ర మనకు చెపుతున్నది.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ముస్లింలను ఒక పథకం ప్రకారం 'నయా అస్పృశ్యులు'గా మార్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్ని పీష్వా బాలాజీ బాజీరావు, అహమద్ షా దుర్రానీ అబ్దాలీల మధ్య పోటీగా జరిపారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఛత్రపతి శివాజీ, ఔరంగజేబ్‌ల మధ్య పోటీగా జరిగాయి. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు రాణి అబ్బక్క, టిప్పూ సుల్తాన్‌ల మధ్య పోటీగా జరిగాయి. రేపు లోక్‌సభ ఎన్నికలు శ్రీరామునికీ శంబూకునికి మధ్య జరపడానికి పూర్తి సన్నాహాలు చేస్తున్నారు.



ఇన్ని విశాల సమూహాలు రాజ్యాంగాన్ని నమ్ముతున్నప్పుడు వాళ్ళను కటువుగా 'రాజ్యాంగవాదులు' అనడం ఒక చారిత్రక తప్పిదం అవుతుంది. నిస్సందేహంగా భారత రాజ్యాంగం ఒక సామాజిక విప్లవ దస్త్రం. అంతకన్నా మేలైన సమాజాన్ని నిర్మించాలనుకున్నవారు అంతకన్నా మేలైన, ఆచరణ సాధ్యమైన, రాజ్యాంగాన్ని ప్రతిపాదించాలి.

పోటీలో వున్న ఏ అభ్యర్థీ తమకు నచ్చలేదని చెప్పడానికి పోలింగ్‌లో 'నోటా'ను వాడడం ఒక ప్రజాస్వామిక హక్కుగా మనం భావిస్తున్నాం. 'ముస్లింల ఓట్లు మాకు వద్దు' అనడం కూడా ఎన్నికల్లో ఒక ప్రజాస్వామిక హక్కుగా చెలామణీ అయిపోతున్నది. ఐదేళ్ళకొకసారి ఎన్నికలు జరగడమే కొలమానం కనుక దీన్ని వామపక్షాలు సహితం ప్రజాస్వామ్యం అనక తప్పడంలేదు. పైగా, ఇవన్నీ రాజ్యాంగబద్ధంగా, దేశ అత్యున్నత న్యాయస్థానం ఆశీస్సులతోనే జరుగుతున్నాయి.

భూస్వామ్య వ్యవస్థ కన్నా పెట్టుబడీదారీ వ్యవస్థ విప్లవకరమైనదని కార్ల్ మార్క్స్ – ఫ్రెడరిక్ ఏంగిల్స్ స్వయంగా మెచ్చుకున్నారు. లెనిన్‌కూ అలాంటి అభిప్రాయమే వుంది. పెట్టుబడీదారీ వ్యవస్థను మించిన సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజాలను నిర్మించాలంటే పెట్టుబడీదారీ రాజ్యాంగాన్ని మించిన రాజ్యాంగాలను రూపొందించుకోవాలని వాళ్ళు సమంజసంగానే ఆలోచించారు. మహాత్మా గాంధీజీ మరణం తరువాత 1948 ఫిబ్రవరిలో కలకత్తాలో జరిగిన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభల్లో అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి బిటి రణదివె స్వాతంత్ర్యాన్ని 'అధికార మార్పిడి'గా పేర్కొన్నాడు. దాదాపు అదే సమయంలో రాజ్యాంగ సభ లక్ష్య ప్రకటన తీర్మానాన్ని (ఆబ్జెక్టివ్ రిజల్యూషన్) ఆమోదించింది. 'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం' వంటి ఆదర్శాలు ఆ తీర్మానంలో వున్నాయి. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అప్పటికి వాటిని నమ్మలేదు సాయుధ పోరాటానికి పిలుపిచ్చింది. లక్ష్య ప్రకటన తీర్మానమే తరువాత రాజ్యాంగ ప్రవేశిక (preamble)గా మారింది.

రాజ్యాంగం మీద చర్చను ఒక విధంగా అంబేడ్కరే మొదలెట్టాడు అనవచ్చు. రాజ్యాంగం ఒక నిబంధనావళి కనుక అందులో ప్రకటించుకున్న ఆదర్శాలకన్నా వాటిని అమలు చేసేవారే ముఖ్యం. 'అమలుపరచేవారు చెడ్డవారయితే మంచి రాజ్యాంగం కూడ చెడ్డదయిపోతుంది. అమలుపరచేవారు మంచివారయితే చెడ్డ రాజ్యాంగం కూడ మంచిదయిపోతుంది' అన్నాడు. అంతటితో ఆగలేదు; 'గొప్ప ఆదర్శంతో దేవాలయాన్ని నిర్మిస్తే దాన్ని ప్రారంభించడానికి ముందే దెయ్యాలు ఆక్రమించుకున్నాయి' అన్నాడు. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక కూడా సమాజంలో పీడన కొనసాగుతుంటే దాన్ని ఇతరులకన్నా ముందు తనే తగలబెడతాననీ అన్నాడు.

'ఆలోచనాపరులు ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు; కానీ చెయ్యాల్సిందేమంటే దాన్ని మార్చడం అన్నాడు' కార్ల్ మార్క్స్. లెనిన్ మరింత స్పష్టంగా 'నిర్దిష్ట పరిస్థితుల, నిర్దిష్ట విశ్లేషణ' అన్నాడు. విశ్లేషించడం అంటే ఆ వ్యవస్థలో పీడకులు ఎవరో, పీడితులు ఎవరో తేల్చడం. భారత సమాజ నిర్దిష్ట పరిస్థితుల, నిర్దిష్ట విశ్లేషణను భారత కమ్యూనిస్టు పార్టీలు ఏవీ ఇప్పటి వరకు చేయలేదు. ముఖ్యంగా, అప్పట్లో కుల వ్యవస్థనూ, ఇప్పట్లో మత వ్యవస్థను నిర్దిష్టంగా విశ్లేషించలేదు. సాంస్కృతిక మ్యాపింగ్ విధానాలు (Cultural Cartography) అభివృద్ధి చెందిన కాలంలో అలాంటి విశ్లేషణలు చేయకుండా కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన పోరాటాలు లక్ష్యాలను సాధించలేదు. పైగా, పెట్టుబడీదారీ వ్యవస్థ బలపడడానికే అవి దోహదపడ్డాయి. పీడిత ప్రజలు ఆర్థిక ప్రయోజనాలకు ఆశపడేమాట నిజమేగానీ వాళ్ళు అంతకన్నా తమ సాంస్కృతిక ఉనికినే బలంగా కోరుకుంటారు. కమ్యూనిస్టు పార్టీలు ప్రజాదరణను క్రమంగా కోల్పోతుండడానికి ఇది ప్రధాన కారణం.

వ్యవస్థ భూస్వామ్యం నుండి పెట్టుబడీదారీ దిశగా, అక్కడి నుండి కార్పొరేట్ దశగా మారే క్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీలకు చాలా మేళ్లు జరిగాయి. పట్టణీకరణ – నగరీకరణ జరిగేకొద్దీ బహుజనుల ఆత్మగౌరవం పెరిగింది. వాళ్ళ ఉనికిని కాపాడే అనేక చట్టాలు వచ్చాయి. కనీసం మనుషులుగానే పరిగణించని సమూహాలకు వ్యక్తిగత ఆస్తిహక్కు వచ్చింది. వ్యక్తిగత ఆస్తిహక్కు వల్ల కార్పొరేట్లకే ఎక్కువ మేలు జరుగుతున్నదనేది నిజమే. సంపద ఒక చోట పోగవుతూ మరోవైపు పేదరికం పెరుగుతున్నదనేదీ వాస్తవమే. అయినప్పటికీ, సాంస్కృతికంగా అణగారిన సమూహాలకు ఇప్పటి స్థితి కొంచెం ఊపిరి పీల్చుకునేలా చేస్తున్నది. దీనికి కారణం రాజ్యాంగమేనని వాళ్ళు నమ్ముతారు. ఈ ఘనత అంబేడ్కర్‌దేనని వాళ్ళు భావించడమూ సహజం.

మరోపక్క మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీలకు పెట్టుబడీదారీ రాజ్యాంగం మీద ఎన్నడూ నమ్మకం లేదు. రాజ్యాంగ ఆదర్శాలను ప్రభుత్వాధినేతలు పాటించరు అనే అభిప్రాయం వారిలో బలంగా వుంటుంది. వాళ్ళే ప్రకటించుకున్న రాజ్యాంగాన్ని వాళ్ళే పాటించడం లేదు అనేది వాళ్ళ ప్రధాన విమర్శ ప్రాతినిధ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మొత్తంగా కార్పొరేట్లు హైజాక్ చేసినపుడు ప్రత్యామ్నాయం ఏమిటీ? అనేది సమంజసమైన ప్రశ్న. ఇటీవల విజయవాడలో జరిగిన విప్లవ రచయితల సంఘం (విరసం) మహాసభలో ఇదే ప్రధాన చర్చనీయాంశం.

ముస్లిం మతమైనారిటీల ఉనికి అంతరించిపోయే సందర్భం వచ్చినపుడు తలెత్తిన షాహీన్ బాగ్ ఉద్యమం భారత రాజ్యాంగాన్నే ఆశ్రయించింది. నిరాశ్రయులు, నిస్సహాయులకు అది పెద్ద దిక్కుగా కన్పించింది. 'స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం' నినాదాలతో ఢిల్లీ నగర శివార్లు ప్రతిధ్వనించాయి. ఆ తరువాత సాగిన రైతాంగ ఉద్యమం షాహీన్ బాగ్ నుండే స్ఫూర్తి పొందింది. ఉమ్మడి పౌరస్మృతి అంశం ముందుకు వచ్చినప్పుడు ఈశాన్య భారతదేశంలోను ఆదివాసులు షాహీన్ బాగ్ మార్గాన్నే అనుసరించారు. రాజ్యాంగాన్ని హృదయాలకు హత్తుకున్నారు.

కార్పొరేట్ వ్యవస్థను, అది రాజ్యాంగ ఆదర్శాలను కాలరాస్తున్న తీరునూ విరసం విమర్శించడంలో తప్పులేదు. విమర్శించాలి కూడా. పనికి రానపుడు రాజ్యాంగాన్నీ తిరస్కరించవచ్చు. కానీ, రాజ్యాంగంవల్ల తమ జీవితాలు బాగుపడ్డాయని నమ్ముతున్న పీడిత సమూహాలతో సున్నితంగా వ్యవహరించాలి. మతోన్మాదాన్ని ఆశ్రయించి బలపడుతున్న కార్పొరేట్ వ్యవస్థలోని పీడితుల్ని, అస్పృశ్యుల్ని, నయా అస్పృశ్యుల్ని ఏకం చేయడానికి ప్రయత్నించాలి. ఇన్ని విశాల సమూహాలు రాజ్యాంగాన్ని నమ్ముతున్నప్పుడు వాళ్ళను కటువుగా 'రాజ్యాంగవాదులు' అనడం ఒక చారిత్రక తప్పిదం అవుతుంది. నిస్సందేహంగా భారత రాజ్యాంగం ఒక సామాజిక విప్లవ దస్త్రం. అంతకన్నా మేలైన సమాజాన్ని నిర్మించాలనుకున్నవారు అంతకన్నా మేలైన, ఆచరణ సాధ్యమైన, రాజ్యాంగాన్ని ప్రతిపాదించాలి.

■ డానీ

ప్రపంచమంతా మంటగలుస్తున్న మానవ హక్కులు!

ప్రపంచ మానవ హక్కుల నివేదిక 2024 జనవరి 11న న్యూయార్క్‌లో విడుదలైంది. హ్యూమన్ రైట్స్ వాచ్ అనే అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ప్రతి సంవత్సరం ఈ నివేదికను రూపొందిస్తుంది. ప్రస్తుత నివేదిక ముప్పె[illegible]లుగవది. మొత్తం 740 పేజీల ఈ నివేదిక ఆఫ్ఘనిస్తాన్ నుంచి జింబాబ్వే వరకు 105 దేశాల్లో 2023 మానవ హక్కుల పరిస్థితిని సమీక్షించింది. యుద్ధకాల దురాగతాలు పెరుగుతున్నాయని, మానవ హక్కుల కార్యకర్తలపై అణచివేతలు, హక్కుల చట్టాలపై ప్రభుత్వాల దాడి పెరుగుతున్నదని నివేదిక వివరించింది. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల సూత్రాలను వర్తింపజేయడంలో ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాల వల్ల లెక్కలేనన్ని జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని నివేదిక పేర్కొంది.

ఉక్రెయిన్, మయన్మార్ మాదిరిగానే ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య తిరిగి నెలకొన్న పోరాటం అక్కడి సామాన్యులకు ప్రాణసంకటంగా మారింది. హమాస్ యుద్ధ నేరాలను ఖండించిన అనేక ప్రభుత్వాలు, గాజాపై ఇజ్రాయెల్ దాడులకు అంతగా స్పందించడం లేదు. ఆఫ్ఘనిస్థాన్‌లో మానవ హక్కుల పరిస్థితి క్షీణిస్తూనే ఉంది. తాలిబాన్ విస్తృతంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడింది– ప్రత్యేకించి మహిళలు, బాలికలకు వ్యతిరేకంగా. బాలికలకు మాధ్యమిక, ఉన్నత విద్యపై నిషేధం; మహిళలకు పలు రంగాలలో ఉద్యోగాలపై నిషేధం; మహిళల సంచారం, వాక్ స్వాతంత్ర్యంపై పలు కట్టుబాట్లు; మహిళలు, బాలికలపై పలు ఆకృత్యాల తీరును నివేదిక నిర్ధారించింది. 2024 జాతీయ ఎన్నికలకు ముందు బంగ్లాదేశ్ అధికారులు అణచివేతను కఠినతరం చేశారు. భద్రతా దళాలు ప్రతిపక్ష సభ్యుల మూకుమ్మడి అరెస్టులు చేశాయి. లీకైన పోలీసు అధికారుల సమావేశాల మినిట్లను బట్టి విపక్ష సభ్యులను పోటీకి అనర్హులు చేసే నెపంతో నేరారోపణలు జరిగినాయి. ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి చెందిన ఐదు లక్షల సభ్యులు రాజకీయ ప్రేరేపిత నేరాలను ఎదుర్కొంటున్నారు. బంగ్లాదేశ్‌లోని మహిళలకు గృహ హింస నుండి న్యాయం పొందేందుకు చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయి. 51 శాతంతో ప్రపంచంలో అత్యధిక బాల్య వివాహాల రేటు బంగ్లాదేశ్ కలిగి ఉంది. బాల్య వివాహాలను చట్టబద్ధం చేసిన ఒకే ఒక్క దేశంగా బంగ్లాదేశ్ ఇటీవల అవతరించడం సిగ్గు చేటు.

జిన్‌పింగ్ పాలనలో చైనాలో అణచివేత తీవ్రమైంది. చైనా ప్రభుత్వం జిన్‌జియాంగ్‌లోని ఉయ్‌ఘర్‌లు, ఇతర టర్కిక్ ముస్లింలకు వ్యతిరేకంగా అణచివేత కొనసాగిస్తోంది. టిబెట్, జింజియాంగ్‌లలో విదేశాలలో కుటుంబ సభ్యులు, స్నేహితులను సంప్రదించేవారిని, వారి సంస్కృతి, భాష, మతం కోసం వాదించే వారిని 'వేర్పాటువాదులు'గా పరిగణించి వారిపై కఠినమైన జైలు శిక్షలు విధించబడుతున్నాయి. చైనా అంతటా, ప్రభుత్వం సామాజిక నియంత్రణలను మరింత కఠినతరం చేస్తోంది. హాంకాంగ్‌లో జాతీయ భద్రతా చట్టం ద్వారా నగరంపై పూర్తి నియంత్రణను చేపట్టింది. అక్కడి నివాసితుల కనీస హక్కులు లేకుండా చేస్తున్నది.

ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వంలో మతపరమైన, ఇతర మైనారిటీల పట్ల వివక్ష, కళంకం కలిగించే విధానాలు కొనసాగుతున్నాయి. దేశంలోని అనేక ప్రాంతాలలో మతపరమైన హింసాత్మక సంఘటనలు జరిగినాయి. మణిపూర్ రాష్ట్రంలో వందల సంఖ్యలో జాతి ఘర్షణల్లో ప్రజలు చనిపోయారు. జమ్మూ, కశ్మీర్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛ, శాంతియుత సమావేశం, ఇతర హక్కులపై ఆంక్షలు కొనసాగాయి. ఏడాది పొడవునా భద్రతా బలగాలు జరిపిన చట్టవిరుద్ధ హత్యల నివేదికలు వచ్చాయని హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక తెలిపింది. అధికార పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపుల ఆరోపణలపై అథ్లెట్లు వారాల తరబడి నిరసన వ్యక్తం చేసినప్పటికీ అధికారులు విచారణ ఆలస్యం చేశారు. పౌర సమాజ కార్యకర్తలు, స్వతంత్ర పాత్రికేయులు, రాజకీయ ప్రత్యర్థులపై బెదిరింపులు, ఆరోపణల ద్వారా వారిని నిశ్శబ్దపరచడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని నివేదిక పేర్కొంది. మణిపూర్‌లో జాతుల హింసలో రాష్ట్ర నాయకత్వం పాత్ర పోషించిందని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఒక నివేదికను ప్రచురించిన తర్వాత పోలీసులు దానిపై క్రిమినల్ కేసులు పెట్టారని అది గుర్తుచేసింది.



దేశంలోని అనేక ప్రాంతాలలో మతపరమైన హింసాత్మక సంఘటనలు జరిగినాయి. మణిపూర్‌లో జాతి ఘర్షణల్లో వందల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. జమ్మూ, కశ్మీర్‌లో ఏడాది పొడవునా భద్రతా బలగాలు జరిపిన చట్టవిరుద్ధ హత్యల నివేదికలు వచ్చాయని హ్యూమన్ రైట్స్ వాచ్ తెలిపింది.

పాకిస్తాన్‌లో మహిళలు, బాలికలపై హింస–అత్యాచారం, హత్య, యాసిడ్ దాడులు, గృహ హింస, విద్య తిరస్కరణ, పని వద్ద లైంగిక వేధింపులు, బలవంతపు వివాహాలు ఆ దేశమంతటా ఉన్న తీవ్రమైన సమస్య అని నివేదిక పేర్కొంది. పాకిస్తాన్‌లో ప్రతి ఏటా 1000 మహిళలు 'గౌరవ హత్యలకు' బలైపోతున్నారు. యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ (UNICEF) అంచనా ప్రకారం 18ఏళ్ల లోపు గల 18.9 మిలియన్ల బాలికలు, 15ఏళ్ల లోపు గల 4.6 మిలియన్ల బాలికల వివాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు ఎక్కువగా బలవంతపు వివాహాలకు గురవుతున్నారు.

యూరోపియన్ యూనియన్ తన మానవ హక్కుల బాధ్యతలను తప్పించుకుంది, శరణార్థులను ఇతర దేశాలకు వెనక్కి నెట్టింది. శరణార్థులను దూరంగా ఉంచడానికి లిబియా, టర్కీ వంటి హక్కుల దుర్వినియోగ ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. జపాన్, దక్షిణ కొరియా, ఆ[illegible]యాతో సహా ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాల సైనిక పొత్తులు, వాణిజ్య హామీల ఒప్పందాలు మానవ హక్కులకు ఘాతుకంగా మారుతున్నాయి. అమెరికాలో ఆర్థిక, జాతిపరమైన అసమానతలు కొనసాగుతున్నాయి. పేదరికం పెరుగుదలకు దారితీస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక ఖైదీల రేటును అమెరికా కలిగివుంది. ముఖ్యంగా నల్ల జాతీయులు అసమానంగా ఖైదు చేయబడుతున్నారు. 2023లో పోలీసులు చంపిన 800 మందిలో శ్వేత జాతీయుల కంటే మూడు రెట్లు ఎక్కువ నల్ల జాతీయులు ఉన్నారు. అబార్షన్ హక్కులు, LGBTQ+ హక్కులను పరిమితం చేస్తూ రాష్ట్రాలు చట్టాలను ఆమోదించడంతో వారి హక్కులు మరింత క్షీణిస్తున్నాయని నివేదిక పేర్కొన్నది.

నివేదికలో కొన్ని ఆశల సంకేతాలు కూడా ఉన్నాయి. గత నవంబర్‌లో, హింస, ఇతర దుర్వినియోగాలను నిరోధించాలని అంతర్జాతీయ న్యాయస్థానం సిరియా ప్రభుత్వాన్ని ఆదేశించింది. లెస్బియన్, గే, ద్విలింగ, లింగమార్పిడి వ్యక్తులను 'అన్యాయమైన వివక్ష నుంచి రక్షించడానికి జపాన్ పార్లమెంట్ తన మొదటి చట్టాన్ని ఆమోదించింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు గత మార్చిలో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు, ఆ దేశ బాలల హక్కుల కమీషనర్‌కు ఉక్రెయిన్ ఆక్రమిత భూభాగాల నుంచి రష్యాకు పిల్లలను బలవంతంగా తరలిస్తున్న యుద్ధ నేరాలపై అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఈ కొన్ని సంఘటనలు వదిలి, మొత్తంగా చూస్తే, అత్యధిక ప్రభుత్వాలు అంతర్జాతీయ రంగంలో మానవ హక్కుల సమస్యలను విస్మరించడాన్ని సులభతరం చేశాయి. ఎందుకంటే స్వదేశంలో వారి మానవ హక్కుల ఉల్లంఘనలు అంతర్జాతీయ సమాజం సవాలు చేయడం లేదు.

● చెన్న బసవయ్య మఠపతి
విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఇదెక్కడి రామరాజ్యం?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించినపుడు రామరాజ్య పాలన ప్రేరణతోనే తమ పాలన కొనసాగుతున్నట్టు, రామరాజ్యంలో మాదిరిగానే దేశంలో పన్నుల వ్యవస్థ అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల సంపాదనే పరమావధిగా అయోధ్య రామాలయాన్ని కేంద్రంగా చేసుకొని మూడోసారి అధికారంలోకి రావాలనుకొంటున్న నేతలు శ్రీరాముని సుపరిపాలనే తమకు ఆదర్శమని, రాముడి మాటే తమ మాట అని ప్రకటించడం విడ్డూరంగా ఉంది. శ్రీరాముడు తండ్రికి ఇచ్చిన మాట కోసం పన్నెండేళ్లు అడవులకు వెళ్లాడు. మోదీ మాత్రం ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తానని, తిరుపతి వేంకటేశుని సాక్షిగా ప్రకటించి 12 నెలలు కూడా కాకుండానే మాట తప్పి రాష్ట్రానికి మొండిచేయి చూపించారు. పోలవరం నిర్మాణానికి మాత్రమే నిధులు ఇస్తాం, పునరావాసానికి నిధుల ఇవ్వమంటూ మడత పేచీలు పెడుతున్నారు. రెవెన్యూ లోటు, కరవు జిల్లాలకు ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి అంశాల ఊసు లేకుండా పోయింది.

ఒకటే దేశం–ఒకటే పన్ను విధానం అంటూ దేశంలో జీఎస్‌టి (గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్) ప్రారంభిస్తూ పెట్రోలియం ఉత్పత్తులపై రికార్డు స్థాయిలో పన్ను విధించారు. ప్రస్తుతం ఒక లీటరు పెట్రోల్‌పై కేంద్రప్రభుత్వం రూ.19.90లు, డీజిల్‌పై రూ.15.80లు వంతున ఎక్సై[illegible] టాక్స్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరో 27 శాతం పన్ను విధిస్తున్నారు. అంతేకాకుండా అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరల ఆధారంగా పెరగడం, తగ్గడం ఉంటుందని ప్రకటించారు. వాస్తవంలో అందుకు విరుద్ధంగా ధరలు పెరిగినప్పుడు పెంచుతూ, తగ్గినప్పుడు మాత్రం ఆ ఫలితం ప్రజలకు అందకుండా సెస్‌ల రూపంలో అదనంగా పన్నులను విధిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ప్రతి లీటరు పెట్రోల్‌పై రూ.32.9లు, డీసెల్‌పై రూ.31.8లు వంతున సెస్ రూపంలో అదనంగా ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. సహజంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్నులలో రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా లభిస్తుంది. కానీ సెస్‌ల ద్వారా లభించే ఆదాయం మొత్తం కేంద్రానికే చెందుతుంది.

2022–23 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వానికి పెట్రోలియం ఉత్పత్తుల జీఎస్‌టి ద్వారా 3,70,365.2 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. ఈ మొత్తంలో సెస్‌ల ద్వారా వచ్చినది 21,444.7 కోట్ల రూపాయలు, ఇంటిగ్రేటెట్ జీఎస్‌టి ద్వారా 22,235.8 కోట్ల రూపాయలు, సెంట్రల్ జీఎస్‌టి ద్వారా 13,011.6 కోట్ల రూపాయల ఆదాయం పొందింది. ప్రభుత్వంలోని పెద్దలు చెప్పిన మాటకు విరుద్ధంగా ప్రజలపై వేల కోట్ల రూపాయల మేరకు అధిక భారాన్ని మోపడం రామరాజ్యం ఎలా అవుతుందో ఏలినవారికే తెలియాలి.

ఇక సర్వీస్ టాక్స్ పేరిట హోటల్ భోజనం చేయడం మొదలుకొని ఇల్లు కొనుగోలు వరకు ఏ రంగాన్ని వదలకుండా విచ్చలవిడిగా పన్నులు విధిస్తున్నారు. ట్రావన్‌కోర్ సంస్థానంలో తల్లిపాలపై పన్నులు విధించినట్టుగా తల్లిదండ్రులు పిల్లలకు చేసే సేవలకు, పిల్లలు తల్లిదండ్రులకు చేసే సేవలకు సర్వీస్ టాక్స్ విధించడమే ఇక మిగిలిందనే భావన ప్రజలలో వ్యక్తం అవుతోంది. కేంద్రం స్వయంగా ఇబ్బడిముబ్బడిగా పన్నులు విధించడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా పన్నులు పెంచాలి, ఆదాయం పెంచుకోవాలని సూచిస్తోంది. గతంలో గృహాలకు ఇంటి పన్ను మాత్రమే ఉండేది. ఇప్పుడు చెత్తపన్ను పేరిట రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ప్రజల నుంచి వసూలు చేస్తోంది. అంతేకాకుండా గతంలో ఇంటి పన్నులు పెంచాలంటే అయిదేళ్లకు ఒకసారి అసెస్‌మెంట్ చేసి, ప్రజల ఆమోదంతో పన్నులు పెంచేవారు. ప్రస్తుతం ఈ విధానానికి స్వస్తి చెప్పి ప్రతి ఏడాది 12 శాతం పన్ను పెంచుతున్నారు. ఈ విధంగా చెప్పుకొంటూపోతే ఎన్ని రంగాలలో సర్వీస్ టాక్స్ పేరుతో ప్రజలపై భారం పడుతోందో చెప్పడం సాధ్యం కాదు.

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి చేసే కేటాయింపులు నానాటికీ తగ్గిపోతున్నాయి. ఉదాహరణకి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి 2022–23లో 73 వేల కోట్ల రూపాయలు కేటాయించగా, 2023–24లో 60 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. బడాబాబులకు ఎగుమతులు, దిగుమతులలో లక్షల కోట్ల రూపాయల రాయితీ ఇవ్వడమే కాకుండా లక్షల కోట్ల రూపాయల బకాయిలు కూడా రద్దు చేస్తున్నారు. 2023, మార్చి నాటికి 2,09,144 కోట్ల రూపాయల రుణాలను రద్దు చేసినట్టు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. పాలకుల మాటలకు, చేతలకు ఏ మాత్రం పొంతన లేదు. పాలకులు అందిస్తున్నది రామరాజ్య పాలన లేక రాక్షస పాలనా అని తెలుసుకోలేని అమాయకులు కాదు ప్రజలు. ఈ విషయం పాలకులు తెలుసుకోవడం మంచిది.





'నాపై కొందరు కుట్రపూరితంగా చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి జగన్ నమ్మారు. నన్ను అవమానకరంగా మాట్లాడారు. ఇద్దరు కమ్మ వ్యక్తులను పక్కన పెట్టుకుని మట్టి, బూడిదను దోచుకుంటున్నావా.. అని సీఎం నిలదీశారు. నేను చెప్పే సమాధానం కూడా వినిపించుకోలేదు. నా ప్రమేయం లేకుండానే ఆ వ్యక్తులు కొత్తూరు తాడేపల్లి నుంచి లక్షలాది లారీల మట్టిని రవాణా చేశారు. ఇవేమీ వినకుండా నన్ను అవమానించిన పార్టీలో నేను ఉండకూడదని నిర్ణయించుకున్నా. ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తా.'

- వసంత కృష్ణప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, సమావేశానికి హాజరైన మైలవరం వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

వైసీపీలో ఉండలేను!

దోచుకుంది పెడన నాయకుడు.. పేరేమో నాకు

- బూడిద, మట్టి మొత్తం దోచేసింది ఆయనే..
- జోగి రమేశ్‌పై పరోక్షంగా నిప్పులు చెరిగిన వసంత

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/నందిగామ) : మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వైసీపీని వీడుతున్నట్టు ప్రకటించారు. నందిగామ మండలం ఐతవరంలో మైలవరం నియోజకవర్గ పార్టీ నేతలతో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ పాలనపైనా, పార్టీలో తనకు జరిగిన అవమానాలపైనా ఆయన తన అనుచరులతో సుదీర్ఘంగా మాట్లాడారు. మంత్రి జోగి రమేశ్ పేరు ప్రస్తావించకుండా ఆయనపై నిప్పులు చెరిగారు. ఆయన చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే.. మైలవరం ఎమ్మెల్యేగా నన్ను పని చేయనీయకుండా పెడన నాయకుడు, ఆయన మనుషులు పెత్తనం చేశారు. ఆ వ్యక్తులు ప్రతిపక్ష పార్టీకి చెందిన వారితో చేతులు కలిపి నాపై కుట్రలు చేశారు. వీటీపీఎస్ బూడిద, కొత్తూరు తాడేపల్లి మట్టిని పెడన నుంచి గెలిచిన నాయకుడు, ఆయన మనుషులు దోచుకున్నారు. ఆ నేరాన్ని నాపై మోపే ప్రయత్నం చేశారు.

బూడిదను డబ్బుకు అమ్ముకున్నారు..

యాష్ పాండ్ నుంచి బూడిదను డబ్బుకు అమ్ముకుని సొమ్ము చేసుకుంది కూడా వాళ్లే. అటువంటి వ్యక్తులను అధిష్ఠానం ప్రోత్సహిస్తూ నన్ను ఇబ్బంది పెట్టడాన్ని సహించలేక వైసీపీలో ఇమడలేనని నిర్ణయించుకున్నా. ఎమ్మెల్యేగా నాకు ప్రభుత్వం సహకరించకపోయినా అభివృద్ధి చేశా. పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వని సమయంలో ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు మైలవరానికి నిధులు ఇచ్చారు. నేను వైసీపీని వీడుతున్నాను. త్వరలో రాజీనామా ఇస్తా. ఏ పార్టీలో చేరేది త్వరలో చెబుతా.. అన్నారు.

టీడీపీ, జనసేన, కాంగ్రెస్ నుంచి ఆహ్వానం

నన్ను నమ్ముకుని ఉన్నవారు ఇష్టం ఉంటే నా వెంట నడవాలి. టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి నాకు ఆహ్వానం ఉంది. మంచి పాలన కోసం త్వరలో నా నిర్ణయాన్ని వెల్లడిస్తా. నాపై తప్పుడు ఆరోపణలు చేసేందుకు వైసీపీ సోషల్ మీడియా సిద్ధంగా ఉంది. సొంత తల్లిని, చెల్లిని వదలని వారు నన్ను వదులుతారని అనుకోవడం లేదు. అన్నింటికీ సిద్ధంగా ఉన్నా అని మైలవరం ఎమ్మెల్యే వసంత తెలిపారు. ఈ సమావేశానికి మైలవరం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పెద్దఎత్తున నేతలు తరలివచ్చారు. పలు మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, మండల వైసీపీ అధ్యక్షులు హాజరయ్యారు.

8 తర్వాత టీడీపీలోకి..

వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈనెల 8వ తేదీ తర్వాత ఆయన టీడీపీ కండువా కప్పుకోనున్నారని సమాచారం. మైలవరం లేదా పెనమలూరు స్థానాల్లో ఏదో ఒకదాని నుంచి పోటీ చేస్తారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ఫిట్‌నెస్ టెస్టులు ఇక ప్రైవేటుకు..

వాహనాదారులకు భారీగా ఫీజుల మోత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాహనాల ఫిట్‌నెస్ టెస్టుల పేరిట వాహనదారుల జేబులు గుల్ల చేసేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. ఎన్టీఆర్ జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్ టెస్టుల నిర్వహణను ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు అధికారులు టెండర్లు పిలిచారు. ఆదాయం వచ్చే మార్గాలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. ధనార్జనే ధ్యేయంగా వాహనదారులపై భారం మోపే పరిస్థితి ఏర్పడుతుంది. ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల (ఏటీసీ) పేరుతో ప్రైవేటీకరణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానాన్ని అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తుండగా, మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అమల్లోకి తీసుకొచ్చింది. ఏకంగా ఏటీసీల నిర్వహణకు టెండర్లు కూడా పిలిచేసింది. ఈ టెండర్లలో ఎన్టీఆర్ జిల్లా పేరు కూడా ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించి ఫిట్‌నెస్ టెస్టుల నిర్వహణ మొత్తాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకే ఈ టెండర్లు పిలిచారు. టెండర్లలో ఇప్పటికే రెండు సంస్థలు పాల్గొన్నాయి. దీనిని బట్టి చూస్తే కొద్దిరోజుల్లోనే ప్రైవేటుకు అప్పగించటం ఖాయంగా కనిపిస్తోంది.

అధికార పార్టీకి చెందిన వారి బంధువులే..

ఏటీసీల ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో అధికార పార్టీ నేతల బంధువులే ఉండటం గమనార్హం. బినామీ పేర్లతో వైసీపీ నాయకులే ఈ టెండర్లు వేయించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఆసక్తి చూపిన వాటిలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి చెవిరెడ్డి భాస్కరరెడ్డి బంధువుల పేరుతో ఒకరు టెండర్ వేశారు. చెవిరెడ్డి మునిరెడ్డి రోశమ్మ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఈ టెండర్

రవాణాతో పాటు రవాణాయేతర వాహనాలకు కూడా..

» టెండర్లలో అధికార పార్టీకి చెందినవారు

పడింది. హరిత్‌రెడ్డి అనే వ్యక్తి డైరెక్టర్‌గా పేర్కొన్నారు. మరో టెండర్ బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. ఇది కూడా అధికార పార్టీకి బాగా కావాల్సిన సంస్థ. కడపలో పలు రోడ్డు ప్రాజెక్టులను పొందుపరిచింది. రాజకీయ నేపథ్యం కలిగిన ఈ సంస్థలు టెండర్లలో పాల్గొనటం గమనార్హం.

ఇక రవాణాయేతర వాహనాలకూ..

ఇప్పటి వరకు ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ అంటే రవాణా వాహనాలైన లారీలు, ట్యాక్సీలు, క్యాబ్‌లు, వ్యాన్‌లు, ట్రాలీలు, ట్యాంకర్లు, జేసీబీలు వంటివే. వీటికే ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించేవారు. తాజాగా ప్రవేశపెడుతున్న ఏటీసీ వ్యవస్థలో ద్విచక్రవాహనాలు, సొంతంగా ఉపయోగించే కార్లకు కూడా ఫిట్‌నెస్ టెస్టులు చేయించాల్సి ఉంటుంది. అలాగే, నూతన విధానంలో వాహనదారులపై పెనుభారం పడనుంది. ఏటీఎస్ ఆపరేటర్లకు కూడా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. 15 ఏళ్ల లోపు రవాణా వాహనాలకు, 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలకు మాన్యువల్, ఆటోమేటిక్ టెస్టింగ్ కేటగిరీలకు సంబంధించిన టారిఫ్‌ను కూడా ఇప్పటికే నిర్ణయించారు. ఫీజులు కాకుండా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయటానికి ఇంకొంత ఫీజు వసూలు చేస్తారు. గతంలో వసూలు చేసే ఫీజుల కంటే ఎక్కువగా నిర్దేశించారు. వీటిపై ఇప్పటికే లారీ యజమానులు, కార్ల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నా కుమారుడికివ్వండి
సీఎంను కోరిన అవనిగడ్డ అభ్యర్థి చంద్రశేఖర్‌రావు -4లో..

బండిపోటు

రైళ్లలో ప్రయాణికులను దోచేస్తున్న ఓ అధికారి



వెనకటికి బందిపోట్లు రైళ్లను అడ్డగించి ప్రయాణికులను అందినకాడికి దోచుకుపోయేవారు. ఇప్పుడు అలాంటి బందిపోటు ఉదంతాలు లేకపోయినా కొందరు రైల్వే సిబ్బందే ఆ అవతారమెత్తి కదులుతున్న రైళ్లలోనే ప్రయాణికులను దోచుకుంటూ కొత్త రకంగా దోపిడీ చేస్తున్నారు. రాష్ట్రం కాని వారిని నిలువునా దోచేస్తున్నారు. విజయవాడ డివిజన్‌కు చెందిన ఓ రైల్వే స్క్వాడ్ ఇన్‌చార్జి బందిపోటు అవతారమెత్తినా ఉన్నతాధికారులు ఉపేక్షిస్తూ కూర్చుంటున్నారు.

- స్క్వాడ్ ఇన్‌చార్జిగా ఇష్టానుసారంగా తనిఖీలు
- ఈశాన్య రాష్ట్రాల ప్రయాణికులే టార్గెట్
- టికెట్ ఉన్నా.. దబాయించి మరీ దందా
- ఇంతకుముందు పలు రైళ్లలో ఇదే పరిస్థితి
- అనేకమార్లు సస్పెన్షన్.. అయినా మారని తీరు
- ఉపేక్షిస్తున్న ఉన్నతాధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పశ్చిమ బెంగాల్, అసోం, బిహార్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ వంటి ఈశాన్య రాష్ట్రాల ప్రయాణికులను అవినీతి రుచి మరిగిన విజయవాడ డివిజన్‌కు చెందిన ఓ రైల్వే స్క్వాడ్ ఇన్‌చార్జి దోచుకుతింటున్నాడు. బతుకుతెరువు కోసం మన రాష్ట్రానికి వస్తున్న వారిని పిండేస్తున్నాడు. సాధారణంగా టికెట్లు తీసుకోని వారికి జరిమానాలు విధించాల్సి ఉండగా, టికెట్ తీసుకున్న వారి వద్ద కూడా బెదిరించి డబ్బు వసూలు చేయడం ఈయన నైజం. గతంలోనూ ఇతనిపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఇతని దోపిడీకి మూడు గంటల పాటు ఓ రైలు ఆగిపోయిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండుసార్లు సస్పెండ్ వేటుపడినా అధికారులను పట్టుకుని మళ్లీ అదే పోస్ట్ దక్కించుకున్నాడు. ఇతనిపై ప్రయాణికులెవరైనా ఫిర్యాదు చేయాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఏ ప్రయాణికుడైనా రైల్లో ఎదురుతిరిగితే పిడిగుద్దులు కురిపించటం, దందాగిరీ చేయటం వెన్నతో పెట్టిన విద్య

దోపిడీ ఇలా..

ఈయన ఏ రైలు పడితే ఆ రైలెక్కడు. పశ్చిమ బెంగాల్, అసోం, బిహార్, జార్ఖండ్ ప్రాంతాలు వెళ్లే రైళ్లలోనే డ్యూటీ చేస్తాడు. కొన్నేళ్లుగా అలెప్పీ-ధన్‌బాద్‌ల మధ్య నడిచే బొకారో ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్-త్రివేండ్రం మధ్య నడిచే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం-పాట్నా మధ్య నడిచే రైళ్లలోనే చెకింగ్ డ్యూటీలు నిర్వహిస్తాడు. ఇందుకు అంతని ఈఎఫ్‌టీలే సాక్ష్యం. తన వెంట ఉండే జీఆర్పీ పోలీసులతో ఈయన హడావుడిగా రైలెక్కుతాడు. టికెట్లు తనిఖీ చేస్తాడు. టికెట్ లేని వారిని తనిఖీ చేసి జరిమానాలు విధించాల్సిన ఈ అధికారి టికెట్లు ఉన్నవారిని కూడా హడల్ కొడతాడు. టికెట్ ఉందని చెప్పినా, చూపించినా చెల్లదంటాడు. అది ఆ రైలు టికెట్ కాదంటాడు. జీఆర్పీ పోలీసులు కూడా ఈ బందిపోటు బాస్ చెప్పిందే నిజమంటారు. దీంతో తాము ఏ టికెట్ తీసుకున్నారో తెలియక ప్రయాణికులు కంగారు పడతారు. ఈ కంగారులోనే డబ్బు తీయమని డిమాండ్ చేస్తాడు. ఎలా మాట్లాడో కూడా తెలియక భాష రాని ప్రయాణికులు తమ అమాయకత్వంతో డబ్బు ముట్టజెబుతారు.

రెండుసార్లు సస్పెండ్ అయినా..

ఈ బందిపోటు బాస్ రెండుసార్లు పట్టుబడ్డాడు. రైల్వే అధికారులు సస్పెండ్ వేటు కూడా వేశారు. 2014-15లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేసి పారిపోయాడు. ఈ ఘటనతో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషన్‌లో మూడు గంటల పాటు ఆగిపోయింది. రైల్వే ఉన్నతాధికారులు రంగంలోకి దిగితే కానీ రైలు కదల్లేదు. ఈ వ్యవహారంలో బందిపోటు బాస్‌పై సస్పెండ్ వేటు పడింది. మళ్లీ కొన్నాళ్లకు ఇదే పోస్టులోకి వచ్చాడు. మళ్లీ మామూలే. 2021లో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తనను బెదిరించి మరీ డబ్బు వసూలు చేయటంపై ఓ ప్రయాణికుడు నేరుగా రైల్వే బోర్డుకే ఫిర్యాదు చేయటంతో మళ్లీ సస్పెండ్ అయ్యాడు. ఉన్నతాధికారులను పట్టుకుని మళ్లీ అదే పోస్టులోకి వచ్చాడు. కొన్నేళ్లుగా ఇలా తనపై కేసులున్నా, సస్పెండ్ అయినా ఒకే పోస్టులో కొనసాగటం గమనార్హం.

అవినీతి అంచెలంచెలుగా..

రైల్వేలో క్లాస్-4 పోస్టు నుంచి ఈ బందిపోటు బాస్ అంచెలంచెలుగా తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. ఒక ఆఫీసర్ దగ్గర బంగ్లా ప్యూన్‌గా మొదలై టీఐగా, సీటీఐగా ప్రస్తుతం స్క్వాడ్ ఇన్‌చార్జిగా దోపిడీ చేస్తున్నాడు. ఏబీసీడీలు కూడా సరిగ్గా రాని ఇతను అంటే రైల్వే ఉన్నతాధికారులకు ఎందుకంత ప్రేమో అర్థం కాదు. ఇటీవలే ముగ్గురు ఉద్యోగులు ఆయన దగ్గర పనిచేయలేమంటూ వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. ఈ బాస్ అక్రమ సంపాదనతో కావలి నుంచి సింగరాయకొండ వరకు భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నాడు. ఈ విషయంపై విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం.



గుడివాడలో ఘోరం

ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు కిందపడి ముగ్గురు యువకుల దుర్మరణం

మృతులు



సోహెల్



హర్ష



సాయి

గుడివాడ, ఫిబ్రవరి 5 : గుడివాడలోని బస్టాండ్ సమీపంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. సేకరించిన వివరాల ప్రకారం.. సోహెల్ (24), సాయి (23), హర్ష.. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి కోతిబొమ్మ సెంటర్ వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. స్థానిక ఈవీఆర్ ఆసుపత్రి వద్ద డివైడర్ నుంచి తిరిగి బస్టాండ్ వైపునకు బండిని తిప్పారు. అయితే, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించలేదు. దీంతో ఏపీ 03 జెడ్ 5091 నెంబరు కలిగిన బస్సు వారిని బలంగా ఢీకొంది. సుమారు 100 అడుగుల మేర ఈడ్చుకెళ్లింది. దీంతో ఘటనాస్థలంలోనే యువకులు మృతిచెందారు. మృతులు ఇద్దరు స్థానిక ముబారక్ సెంటర్‌కు చెందిన వారు కాగా, మరొకరు కాకర్ల వీధికి చెందినవారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృత్యువులోనూ కలిసే..

మృతులు ముగ్గురూ మంచి స్నేహితులు. మృత్యువు కూడా వీరి స్నేహాన్ని విడదీయలేకపోయింది. సోహెల్ స్థానికంగా ఒక వాటర్ ప్లాంట్‌లో ఆటోడ్రైవర్ కం డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. హర్ష బైక్ మెకానిక్‌గా ఉంటూ 17 ఏళ్ల వయసులో కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. సాయి స్థానిక 9వ వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తమకు అండగా ఉంటారనుకున్న కుమారులు కంటి ముందు అచేతనంగా పడి ఉండటంతో వారి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

నవ్య
కుటుంబ కదంబం

డాక్టర్



బ్రెయిన్ ట్యూమర్స్

మెదడు, వెన్నుపాములో ట్యూమర్ల లక్షణాలు వ్యాధి నిర్ధారణను తప్పు దారి పట్టిస్తాయి. దాంతో మొదట్లోనే వాటిని కచ్చితంగా గుర్తించి, చికిత్స అందించడం ఆలస్యమవుతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ ట్యూమర్ల లక్షణాల పట్ల లోతైన అవగాహన పెంచుకోవాలి.

మెదడు కణితులకు సమర్థమైన చికిత్సలు

వెన్నుపాములో ట్యూమరు వల్ల మూత్రవిసర్జన క్రమం తప్పవచ్చు. మెదడులో కణితుల వల్ల చేతులు, కాళ్లలో నిస్సత్తువ తగ్గవచ్చు. కానీ మనం ఈ లక్షణాలు తలెత్తే అవయవాల్లోనే సమస్య ఉందని భావిస్తాం. సదరు వైద్యులను సంప్రతిస్తూ ఉంటాం. కానీ నిజానికి మెదడు, వెన్నుపాము, ఇతరత్రా నాడీసంబంధ సమస్యలన్నీ ఇతరత్రా శారీరక వ్యవస్థలతో ముడిపడి ఉంటాయి. మెదడు సంబంధ ట్యూమర్లలో మెనింజియోమా, మెటాస్టాసిస్ అనే రెండు రకాల ట్యూమర్లు ప్రధానంగా కనిపిస్తూ ఉంటాయి. ఈ ట్యూమర్లను కేన్సర్ వైద్యులు చికిత్స చేయరు. ఎమ్మారైలో గడ్డ ఉందని కనిపెట్టినప్పుడు న్యూరాలజిస్టుల దగ్గరకే పంపిస్తూ ఉంటారు. అయితే మెదడు లేదా వెన్నుపాములో పెరిగే గడ్డలన్నీ కేన్సర్ గడ్డలే అయి ఉండవలసిన అవసరం లేదు. 12 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో లేదా 55 నుంచి 60 ఏళ్ల పెద్దల్లో బ్రెయిన్ ట్యూమర్లు తలెత్తవచ్చు. పిల్లల్లో పుట్టుకతోనే మెదడు కణాల్లో సమస్యల కారణంగా ట్యూమర్లు తలెత్తితే, పెద్దల్లో మెటాస్టాసిస్‌లు, మెనింజియోమాల తరహా ట్యూమర్లు తలెత్తుతూ ఉంటాయి. మెనింజియోమా బినైన్ ట్యూమరు. అప్పుడప్పుడూ తలనొప్పితో వేధించే ఈ ట్యూమర్లతో ప్రమాదం ఉండదు. అరుదుగా కొందర్లో 70 ఏళ్ల వయసుకు అవే ట్యూమర్లు పెరిగి ఫిట్స్ రావడం, మాట పడిపోవడం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. అప్పుడు సర్జరీతో సమస్యను పూర్తిగా సరిదిద్దవచ్చు. ట్యూమర్లలో నాలుగు గ్రేడ్లు ఉంటాయి. మొదటి, రెండవ గ్రేడ్‌కు చెందిన ట్యూమర్లను సర్జరీతో తొలగిస్తే, సమస్య సమసిపోతుంది. కానీ మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

> మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

ఈ లక్షణాల పట్ల అప్రమత్తం

మెదడు ట్యూమర్ల ప్రధాన లక్షణం తలనొప్పి. దీంతో పాటు గడ్డ తలెత్తిన ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతూ ఉంటాయి. తలనొప్పి, ఫిట్స్, కాళ్లూ చేతులు మొద్దుబారడం, స్పర్శ కోల్పోవడం ప్రధాన లక్షణాలు. అలాగే...

- **మెదడులోని ఇన్సులార్ ప్రాంతం:** తలనొప్పి, కడుపులో తిప్పడం
- **మెదడు ముందు లేదా మధ్య ప్రాంతం:** జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు, చూపు మందగించడం
- **మెదడు వెనక భాగం:** రుచి, వాసన, స్పర్శలో సమస్యలు తలనొప్పితో పాటు ఇతరత్రా లక్షణాలు కూడా వేధిస్తూ ఉంటే ఆలస్యం చేయకుండా నాడీసంబంధ వైద్యులను కలవాలి.

ఈ పరీక్షలతో...

ఎమ్మారై స్కాన్‌తో నాడీసంబంధ ట్యూమర్లను కచ్చితంగా కనిపెట్టవచ్చు. ఈ స్కాన్‌లోనే యాంజియోగ్రామ్, వీనోగ్రామ్, కాంట్రాస్ట్ స్టడీలను చేపట్టి, ట్యూమర్‌ను కచ్చితంగా అంచనా వేసి, చికిత్సను నిర్ధారించడం జరుగుతుంది.

చికిత్స ఇలా...

క్లిష్టమైన ప్రాంతంలో లేని, రెండు సెంటీమీటర్ల కంటే చిన్న గడ్డలకు సర్జరీ అవసరం ఉండదు. ఫాలోఅప్‌లో గమనించుకుంటూ పెరుగుతుందనుకున్నప్పుడు రేడియేషన్‌తో చికిత్స చేయవచ్చు. క్లిష్టమైన ప్రాంతంలో ఉన్న గడ్డలకు రేడియేషన్‌తో హాని ఎక్కువ కాబట్టి వాటిని సర్జరీ చేసి తొలగించవలసి వస్తుంది. సర్జరీ తర్వాత గడ్డను అనాలసిస్ చేసి, గ్రేడ్‌ను బట్టి రేడియేషన్ లేదా కీమోథెరపీని వైద్యులు సూచిస్తారు. మొదటి రెండు దశల ట్యూమర్లకు, ప్రతి మూడు, ఆరు, 12 నెలలకోసారి ఎమ్మారై చేసుకుంటూ గడ్డను గమనిస్తూ ఉండాలి. పెరుగుతూ ఉంటే సర్జరీ చేయక తప్పదు. మూడు, నాలుగు దశల్లోని ట్యూమర్లను సర్జరీతో తొలగించిన తర్వాత, రేడియేషన్ కూడా అవసరమవుతుంది. తర్వాత కూడా వైద్యులను తరచూ కలుస్తూ ఉండాలి.

> మెదడు సర్జరీపరంగా అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి. వీటితో 80 నుంచి 90% మేరకు విజయవంతమైన ఫలితాలను రాబట్టుకోవచ్చు. ప్రస్తుతం మైక్రోస్కోపిక్ సర్జరీలో భాగంగా ఇమ్యునోఫ్లోరసెంట్ విధానాన్ని అనుసరిస్తూ, రక్తనాళం ద్వారా రంగు పదార్థాన్ని మెదడులోకి పంపించి, ట్యూమర్‌ను స్పష్టంగా చూడగలిగే చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. న్యూరో మానిటరింగ్ ద్వారా క్లిష్టమైన ప్రదేశాల్లోని గడ్డలను కూడా జాగ్రత్తగా తొలగించే వీలుంది. అలాగే చిన్న ట్యూమర్లను తొలగించే క్యూసా మిషన్లు కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఇలాంటి ఆధునిక చికిత్సలతో మెదడులోని ఇతర ప్రాంతాలు దెబ్బతినకుండా ట్యూమర్‌ను సమర్థంగా తొలగించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.





డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.

మీకు తెలుసా?



బ్రేక్‌ఫాస్ట్ మానేయడం మంచిదే!

రోజు మొత్తంలో అత్యంత ముఖ్యమైన భోజనం, బ్రేక్‌ఫాస్ట్ అని మనం చిన్నప్పటి నుంచీ వింటూ ఉన్నాం. కానీ బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తాజా అధ్యయనాలు చెప్తున్నాయి.

రాత్రి భోజనం తినడానికీ ఉదయం నిద్ర లేవడానికీ మధ్య ఉండే విరామ సమయంలో మన శరీరం రాత్రి తిన్న భోజనం ద్వారా అందిన క్యాలరీలను ఖర్చు చేసుకుంటుంది. అయితే అదే విరామ సమయాన్ని మరికొంత పొడిగిస్తే, ఖర్చు చేయడానికి సరిపడా క్యాలరీలు లేక మన శరీరం కొవ్వును కరిగించుకోవడం మొదలు పెడుతుంది. అయితే ఆ విరామ సమయంలో ఆకలితో కలిగే పదార్థ వ్యామోహాలు, ఎమోషనల్ ఈటింగ్‌లకు చెక్ పెడుతూ ఉండాలి. దీర్ఘ సమయాల పాటు శరీరానికి ఆహారం అందించకపోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే!

- **వ్యాధుల నుంచి రక్ష:** టైప్2 మధుమేహం, గుండె జబ్బులు, వయసుతో సంబంధం ఉన్న న్యూరోడీజెనరేటివ్ డిజార్డర్లు, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్, పలు రకాల కేన్సర్ల నుంచి రక్షణ పొందవచ్చు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో అధిక రక్తపోటు అదుపులోకొస్తుంది. విరామ సమయంలో గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది.
- **బరువు తగ్గొచ్చు:** మెటబాలిజంను పెంచడం ద్వారా బరువు తగ్గడం మీ లక్ష్యమైతే, దీనికీ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తినకపోడానికీ ఎటువంటి సంబంధం ఉండదు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో మెటబాలిజం కిక్‌స్టార్ట్ అవుతుందనేది అపోహ మాత్రమే!
- **శక్తి పెరుగుతుంది:** బ్రేక్‌ఫాస్ట్‌తో అందే క్యాలరీల మీద కోత విధిస్తే, నీరసం బదులుగా శక్తి సమకూరుతుంది. ఇందుకు కారణం శరీరం సురక్షితమైన కీటోజెనిక్ స్థితిలోకి ప్రవేశించడమే!
- **ఆటోఫజీ:** కణాల వ్యర్థాలను శుభ్రం చేసే ప్రక్రియ ఆటోఫజీ. ఈ ప్రక్రియ జరగనప్పుడు పైబడే వయసుతో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. ఆహారం తీసుకోనప్పుడు, ఆటోఫజీ వల్ల కణ శుభ్రత పెరుగుతుంది.
- **అప్రమత్తత:** ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల మానసిక అప్రమత్తత, ఏకాగ్రతలు పెరుగుతాయి.
- **ఇన్సులిన్ సెన్సిటివిటీ:** ఫాస్టింగ్ గ్లూకోజ్, ఫాస్టింగ్ ఇన్సులిన్, లెప్టిన్‌లు తగ్గి ఫలితంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ కూడా తగ్గుతుంది.
- **ఇన్‌ఫ్లమేషన్:** మధుమేహం, మల్టిపుల్ స్క్లెరోసిస్, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ సిండ్రోమ్‌లతో ముడిపడి ఉండే ఇన్‌ఫ్లమేషన్ ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో తగ్గుతుంది.

ఈ వ్యాయామంతో గుండె పదిలం

ఫిట్‌నెస్



గుండె వేగం పెంచే వ్యాయామాలతోపాటు గుండెకు విశ్రాంతినిచ్చే వ్యాయామాలు చేయడమూ అవసరమే! నిత్యం శరీరమంతా రక్తాన్ని పంప్ చేస్తూ అలసిపోయే గుండెకు నిద్రలో తప్ప విశ్రాంతి దొరకదు. ఆ భంగిమలో కూడా గుండె మీద అంతో కొంత ఒత్తిడి ఉంటూనే ఉంటుంది. అయితే రక్తప్రసార వేగాన్ని తగ్గించి గుండెకు సాధ్యమైనంత ఎక్కువ విశ్రాంతినిచ్చే భంగిమలూ ఉన్నాయి. వాటితో గుండెకు ఉపశమనం కలుగుతుంది. కాబట్టి ఇదిగో ఈ వ్యాయామం కోసం రోజు మొత్తంలో కనీసం ఐదు నిమిషాలు కేటాయించండి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే?

- గోడకు దగ్గరగా మ్యాట్ వేసుకుని వెల్లకిలా పడుకోవాలి.
- ఇలా పడుకున్నప్పుడు మోకాళ్లను మడిచి, పైకి లేపి, పిరుదులు గోడకు తగిలేలా దగ్గరగా జరగాలి.
- చేతులను వెనక్కి వాల్చేసి, కాళ్లను నెమ్మదిగా నిటారుగా పైకి లేపాలి.
- పైకి లేపిన కాళ్లను గోడకు ఆనించి, బరువును గోడ మీదే వేయాలి.
- ఈ భంగిమలో ఉన్నప్పుడు మనసు ప్రశాంతంగా ఉంచుకుని, ఊపిరి పీల్చుకోవాలి.
- ఆ సమయంలో గుండె వేగం తగ్గడం స్పష్టంగా తెలుస్తుంది.
- ఇలా 5 నిమిషాలపాటు ఉండి నెమ్మదిగా కాళ్లను కిందకి దించి, చేతులు నేల మీద ఉంచి, లేచి నిలబడాలి.

ఆయుర్వేదం

అశ్వగంధతో ఆరోగ్యం

అశ్వగంధ వేరు చూర్ణంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయి. అవేంటంటే...

- **ఒత్తిడి, ఆందోళన దూరం:** ఈ చూర్ణం పాలతో కలిపి తీసుకుంటే ఒత్తిడి తగ్గి చక్కటి నిద్ర పడుతుంది. అంతేకాదు. ఒత్తిడి, ఆందోళనల ప్రభావం మూలంగా తలెత్తే ఆరోగ్య ఇబ్బందులను అధిగమించే శక్తిని సమకూరుస్తుంది.
- **బరువు తగ్గిస్తుంది:** ఇతర బరువు తగ్గించే మందులతో కలిపి ఈ చూర్ణాన్ని వాడితే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. స్ట్రెస్ మూలంగా హెచ్చుతగ్గులకు గురయ్యే మెటబాలిజంను సరిచేసే శక్తి ఈ చూర్ణానికి ఉంటుంది. కాబట్టి బరువు తగ్గే వేగం పెరుగుతుంది.



- **మధుమేహం అదుపు:** నోటి మాత్రలకంటే ప్రభావవంతంగా ఈ చూర్ణం రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను తగిస్తుంది. రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను సమం చేసి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది.
- **కేన్సర్ నుంచి రక్షణ:** పెద్దపేగు, రొమ్ములు, ఊపిరితిత్తుల కేన్సర్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.
- **బొల్లి:** అశ్వగంధ చూర్ణానికి బొల్లి మచ్చలు చక్కగా స్పందిస్తాయి. కెరటోసిస్ అనే చర్మ చికిత్సకు అశ్వగంధ చూర్ణంతో తయారుచేసిన పేస్ట్ వాడతారు. అశ్వగంధ అద్భుతమైన స్కిన్ టోనర్‌గా కూడా పని చేస్తుంది.

వెజైనల్ హెల్త్‌ను పరిరక్షించుకోవడమనేది మహిళల పూర్తి ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. వెజైనా సమస్యలు మహిళలను మానసికంగా శారీరకంగా కుంగదీయడమే కాకుండా, వైవాహిక జీవితంలో ఒత్తిడి, ఆందోళనలకూ లోను చేస్తాయి. కాబట్టి వెజైనల్ హెల్త్ గురించి ప్రతి మహిళా అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం.

ఆ ఇబ్బందులు తొలగాలంటే...

విమెన్స్ హెల్త్

వెజైనాకు సంబంధించి స్వల్ప సమస్యలు మొదలు తీవ్రమైన సమస్యల వరకూ ఉంటాయి.

వెజినైటిస్

వెజైనా ఇన్‌ఫ్లమేషన్‌కు గురి కావడమే వెజినైటిస్. సాధారణంగా వెజైనాలో బ్యాక్టీరియా, ఈస్ట్‌ల మధ్య ఆరోగ్యకరమైన సంతులనం ఉంటుంది. ఈ సహజసిద్ధ సంతులనం దెబ్బతిన్నప్పుడు, మహిళలు అసౌకర్యాన్ని ఎదుర్కొంటారు. అలాగే అసాధారణమైన వాసన కూడా మొదలవుతుంది. ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా వెజినైటిస్ రావచ్చు. లేదా కొత్త రకాల సబ్బులు, పలు రకాల ఫ్యాబ్రిక్స్‌తో తయారైన లోదుస్తుల వాడకం వల్ల కూడా ఈ సమస్య తలెత్తవచ్చు. నెలసరి తర్వాత కొందర్లో అట్రోపిక్ వెజినైటిస్ వస్తూ ఉంటుంది. ఈ సమస్యలో వెజైనా పొడిబారడం, ఇన్‌ఫ్లమేషన్‌లు ఉంటాయి.

బ్యాక్టీరియల్ వెజినోసిస్

వెజైనాలో బ్యాక్టీరియా గ్రోత్ పెరిగిపోయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. దురద, అసౌకర్యం, దుర్వాసన ఈ సమస్య ప్రధాన లక్షణాలు. ఈ సమస్య లైంగిక వ్యాధులు, హెచ్ఐవి సోకే ముప్పును కూడా పెంచుతుంది.

ట్రైకోమోనియాసిస్

ఇదొక లైంగిక వ్యాధి. పరాన్నజీవుల ద్వారా సంక్రమిస్తుంది. వెజైనా ఎర్రబారడం, దురద, మూత్రవిసర్జన సమయంలో అసౌకర్యం, యోని నుంచి స్రావం, దుర్వాసనలు ఉంటాయి.

వల్వోడైనియా

యోని ప్రవేశద్వారం దగ్గర నొప్పి ఈ సమస్య ప్రధాన లక్షణం. మంట, గుచ్చినట్టు అనిపించడం, కందిపోవడం, వాపు లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, లైంగిక కలయిక ఇబ్బందిగా మారి అనవసరపు సమస్యలకు దారి తీస్తుంది.

ఎస్‌టిఐ

లైంగిక వ్యాధులన్నీ యోని ఆరోగ్యాన్ని దెబ్బ తీసేవే! క్లమీడియా, గొనొరియా, జెనైటల్ హెర్పిస్ ప్రధాన లైంగిక వ్యాధులు. జెనైటల్ హెర్పిస్‌లో యోని నుంచి స్రావం, రక్తస్రావం, నొప్పి ఉంటాయి.

పొడిబారడం

యోని పొడిబారడానికి పలు కారణాలుంటాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ లోపం, ఒత్తిడి ప్రధాన కారణాలు. అయితే శారీరకంగా కలిసే సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

యోని ఆరోగ్యం కోసం...

- యోని ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్లు, ఘాటైన వాసనలు వెదజల్లని సబ్బును ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి.
- శరీరానికి సౌకర్యంగా ఉండే లోదుస్తులు, శానిటరీ న్యాప్కిన్స్ ఎంచుకోవాలి. ధరించే ప్యాంటీ తడిని పీల్చేదై ఉండాలి. రాత్రివేళ ప్యాంటీ ధరించకపోవడమే మేలు. నెలసరి సమయంలో సెంటెడ్ ట్యాంపూన్లు, ప్యాడ్స్, లైనర్స్ వాడకూడదు.
- బిగుతైన దుస్తులు ధరించకూడదు. బిగుతుగా ఉండే జీన్స్, షేప్‌వేర్‌లను ఎక్కువ సమయం పాటు ధరించడం వల్ల వెజైనల్ ఇన్‌ఫెక్షన్స్ పెరుగుతాయి.
- తడిచిన స్విమ్‌వేర్, అండర్‌ప్యాంట్స్ ఎక్కువ సమయం పాటు ధరించి ఉండిపోకూడదు. ఇలా చేస్తే ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు పెరుగుతాయి.
- వాష్‌రూమ్‌ను ఉపయోగించిన ప్రతిసారీ వెజైనల్ ఏరియాను పొడిగా తుడుచుకోవాలి. వాష్‌రూమ్ ఉపయోగించిన తర్వాత యోని, మూత్రనాళం, పురీష నాళాల్లో సూక్ష్మజీవులు, ఈస్ట్ పెరిగిపోకుండా ఉండాలంటే యోనిని ముందు నుంచి వెనకకు శుభ్రం చేసుకోవాలి.

చికిత్సలు ఉన్నాయి



తక్కువ పొటెన్సీని కలిగి ఉండే పైపూత స్టిరాయిడ్లు, నోటి ద్వారా వాడుకునే యాంటీబయాటిక్స్, యాంటీ ఫంగల్స్, యాంటీబ్యాక్టీరియల్ లోషన్లు ఉంటాయి. యోని సమస్యలకు సాధారణంగా వైద్యులు క్లోట్రిమజోల్, బ్యూటోకోనజోల్ మందులనే సూచిస్తూ ఉంటారు. క్లిండామైసిన్ లేదా మెట్రోనిడజోల్‌లను బ్యాక్టీరియల్ వెజినైటిస్‌కూ సూచిస్తూ ఉంటారు. అయితే సమస్యను కచ్చితంగా కనిపెట్టి, ప్రభావవంతమైన మందులను వైద్యులే సూచించగలుగుతారు కాబట్టి యోనిలో ఎటువంటి సమస్య తలెత్తినా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.

భూ కబ్జా చేసి నాపై నిందలా..!

» వెలంపల్లిపై బొండా ఉమా ఫైర్


ఆధారాలు చూపుతున్న బొండా ఉమా

పాయకాపురం, ఫిబ్రవరి 5 : మంత్రి పదవిలో ఉండగా దేవదాయ శాఖ భూములు అనుచరుల పేర కైంకర్యం చేసిన వెలంపల్లి శ్రీనివాస్ తిరిగి కబ్జా పేరుతో నిందలు తనపై వేయాలని చూస్తే సహించేది లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యనారాయణపురంలోని ఆలయ భూమి కబ్జాకు ప్రయత్నించినట్టు వెలంపల్లి చేసిన ఆరోపణలను ఉమా తీవ్రంగా ఖండించారు. ఆయన నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఉమా మాట్లాడుతూ, సత్యనారాయణపురంలోని భూమిని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత శాఖకు 2020వ సంవత్సరంలో కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే స్థలాన్ని దేవదాయ శాఖకు స్వాధీనం చేయకుండా అప్పటి మంత్రిగా ఉన్న వెలంపల్లి తన అనుచరుడు భువనేశ్వరి పీఠం ధర్మకర్త దుమ్మలపాటి చంద్రశేఖర్‌కు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ విషయాన్ని మరుగునపెడుతూ తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల లబ్ధి కోసం తనపై అవాకులు చవాకులు పేలితే ప్రజల సమక్షంలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. తనపై వెలంపల్లి కబ్జా ఆరోపణ అవాస్తవమని నిరూపించానని, అలాగే వెలంపల్లి అనుచరులకు దేవదాయశాఖ భూమిని కట్టబెట్టారన్న విషయాన్ని అబద్ధమని నిరూపించాలన్నారు. వెలంపల్లి రెచ్చగొట్టే వ్యాఖ్యలపై స్పందనలో నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో నవనీతం సాంబశివరావు, గార్లపాటి విజయ్‌కుమార్, దాసరి కనకారావు తదితరులు పాల్గొన్నారు.


స్పందనలో అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ

స్పందన అర్జీదారుల సంతృప్తే ప్రధానం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 5 : జిల్లాలో జగనన్నకు చెబుదాం-స్పందనలో అందిన ప్రతి అర్జీని అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీకుమారి తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 160 అర్జీలు రాగా, వీటిలో రెవెన్యూ 80, పోలీస్ 29, పౌరసరఫరాలు 7, ఎంఏయూడీ 5, హౌసింగ్ 5, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 4, డీఆర్‌డీఏ 4, పంచాయితీరాజ్ 4, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 3, ఏపీసీపీడీసీఎల్ 3 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నందున ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో పటిష్ట సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు హెల్త్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కె. బాబ్జి, రాధికారెడ్డి

మాచవరం, ఫిబ్రవరి 5: హెల్త్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవం మంగళవారం నగరంలో యూనివర్సిటీ సమీపంలోని వెన్యూ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తామని వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి తెలిపారు. యూనివర్సిటీలోని వీసీ చాంబర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్నాతకోత్సవ బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. స్నాతకోత్సవానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంట్ హెల్త్ అండ్ న్యూరో సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమమూర్తి హాజరవుతారని తెలిపారు. 60 మంది విద్యార్థులకు పతకాలు అందజేస్తారని పేర్కొన్నారు.


ధర్నాలో పాల్గొన్న రిసోర్స్‌పర్సన్లు

అవినీతిమయంగా మెప్మా రాష్ట్ర కార్యాలయం

» ఏపీ మెప్మా ఆర్పీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 5: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) రాష్ట్ర కార్యాలయంలో భారీ అవినీతి జరుగుతోందని, కిందిస్థాయి నుంచి మామూళ్లు వసూలు చేసే సంస్థగా మారిందని నియంతృత్వానికి అడ్డాగా మారిందని ఆర్పీలపై అనేక ఆంక్షలు పెడుతూ అధికారులు వేధింపులు, హింసలకు పాల్పడుతున్నారని ఏపీ మెప్మా ఆర్పీ(రిసోర్స్ పర్సన్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ఆరోపించారు. ఈ విధానాలను విడనాడాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేస్తామని ఆమె హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని సంఘం ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో ఆర్పీలు సోమవారం ధర్నా చేశారు. ఆర్పీలకు 2019లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఏ కారణంతోనైనా మృతి చెందిన ఆర్పీలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్‌చేశారు. మహిళా మార్టుల ద్వారా పట్టణ ప్రాంతాల్లో వస్తువులు కొనుగోలు చేయించేలా టార్గెట్లు పెట్టడం మానుకోవాలన్నారు. పొదుపు సంఘాలకు రూ.20లక్షల వరకు జీరో వడ్డీ వర్తింపజేయాలన్నారు. ఇరవై ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్పీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెర్ఫార్మెన్స్ ఆధారంగా జీతాలు తగ్గిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రూ.26 వేలు కనీస వేతనం నేరుగా బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాలన్నారు. రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వివిధ జిల్లాల నుంచి సంఘం ప్రతినిధులు, అధిక సంఖ్యలో ఆర్పీలు పాల్గొన్నారు.

రూ.10 వేల వేతనమివ్వాలి


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 5: సీఎం జగన్ గతంలో పాదయాత్ర సందర్భంగా తమకిచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల విలీనంతో ఉపాధి కోల్పోతున్న వర్కర్లకు ఉపాధిభద్రత కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంట చేసే సమయంలో అగ్నిప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం, ఉచితంగా పూర్తి వైద్యం అందించాలని కోరారు. కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, అంత్యక్రియలకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సీఐటీయూ నాయకులు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వరరావు, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.పార్వతి, ఎన్‌సీహెచ్ సుప్రజ పాల్గొన్నారు.

కొత్త పోలీసు అధికారుల బాధ్యతల స్వీకరణ

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు ఇటీవల బదిలీ అయిన పోలీసు అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా ఆర్.హరిబాబు, లా అండ్ ఆర్డర్-2 ఏడీసీపీగా టి.కనకరాజు, పశ్చిమ డివిజన్ ఏసీపీగా పడాల మురళీకృష్ణారెడ్డి వారి కార్యాలయాల్లో బాధ్యతలు తీసుకున్నారు. హరిబాబు కృష్ణాజిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. కనకరాజు డీజీపీ ప్రధాన కార్యాలయం నుంచి బదిలీ అయ్యారు. లోగడ ఆయన ఇక్కడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా వ్యవహరించారు. మురళీకృష్ణారెడ్డి కాకినాడ డీఎస్పీగా ఉంటూ ఇక్కడికి వచ్చారు. ఆయన అక్కడ వన్‌టౌన్ ఎస్‌ఐగా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. పదోన్నతి వచ్చిన తర్వాత అక్కడే డీఎస్పీగా పనిచేస్తూ తాజాగా విజయవాడకు బదిలీ అయ్యారు.

బుసక తవ్వకాలు.. అడ్డుకున్న రైతులు

» తరలి వచ్చిన పాగోలు లే అవుట్ లబ్ధిదారులు
» రైతుల అభ్యంతరం.. ఇరుపక్షాల వాగ్వాదం
» నడకుదురు రేవులో ఉద్రిక్త వాతావరణం


తహసీల్దార్ సుమతితో మాట్లాడుతున్న ఇరుపక్షాల పెద్దలు

చల్లపల్లి, ఫిబ్రవరి 5 : చల్లపల్లి మండలం నడకుదురు రేవులో బుసక తవ్వకాల వివాదం సోమవారం ఉద్రిక్తతలకు దారితీసింది. పాగోలు లేఅవుట్ మెరక పేరుతో రాత్రి వేళ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి బయటకు విక్రయిస్తున్నారంటూ రైతులు శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలను అడ్డుకున్న విషయం తెలిసిందే. లేఅవుట్‌కు బుసక రవాణా నిలిచిపోవటంతో పాగోలు లబ్ధిదారులు సోమవారం ఉదయం నడకుదురు రేవుకు తరలివచ్చారు. గ్రామ సర్పంచ్ తోటశ్రీనివాసరావు లబ్ధిదారులకు మద్దతుగా అక్కడకు వచ్చారు. స్థానిక రైతాంగం, నాయకులతో తొలుత చర్చలు జరపగా, తవ్వకాలను ఒప్పుకోబోమని వారు తెగేసి చెప్పారు. మధ్యాహ్నం ఎండలో లబ్ధిదారులు రేవులోనే ఉండటంతో వారికి భోజనాలు అక్కడికే తీసుకువచ్చారు. మధ్యాహ్నం సమయంలో బుసక కోసం టిప్పర్‌ను పిలిపించటంతో తవ్వకాలను అడ్డుకునేందుకు రైతులు, స్థానిక నేతలు రేవులోకి వచ్చారు.

ఇరుపక్షాల వాగ్వాదం

టిప్పర్‌తో తవ్వకాలకు సిద్ధమవుతుండగా రైతులు నిలదీశారు. లే అవుట్ పేరుచెప్పి బుసక బయటకు విక్రయిస్తున్నారనీ, ఉప్పునీటి చొరబాటును ఆపే దిబ్బలు తవ్వటం పంట పొలాలకు తీవ్ర నష్టమని తెలిపారు. లేఅవుట్‌కు వచ్చే మెరకను అడ్డుకోవటం సరికాదని మహిళలు తెలిపారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

అధికారుల రంగప్రవేశం

సమాచారం అందుకున్న చల్లపల్లి ఇన్‌చార్జి ఎస్‌ఐ ప్రతాపరెడ్డి సంఘటనా ప్రదేశానికి వచ్చి ఇరుపక్షాలతో మాట్లాడారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు, తహసీల్దార్‌కు తెలియజేయటంతో తహసీల్దార్ బి.సుమతి అక్కడకు వచ్చారు. లే అవుట్‌కు బుసక తోలకంపై అభ్యంతరాలు తెలుసుకున్నారు. సీఆర్‌జడ్ పరిధిగా కోర్టు సూచించిన కారణంగా ఎప్పటినుంచో తవ్వకాలు నిలుపుదల చేశారనీ, గతంలో క్వారీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ కోర్టు ఆదేశాల ప్రకారం డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి ఇచ్చేయటం జరిగిందని పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్‌బాబు తెలిపారు. సీఆర్‌జడ్ పరిధిలో ఉన్నట్టు గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఆర్టీఐ సమాచారాన్ని ఫోన్‌లో న్యాయవాది కొర్రపాటి వీరసింహుడు తహసీల్దార్‌కు చూపించారు. లే అవుట్ కోసమని తవ్వకాలు చేపట్టి బయటకు విక్రయిస్తున్నారనీ, లే అవుట్ మెరక కోసం అనుమతి ఇస్తే ఇష్టానుసారం తవ్వుతారని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని తహసీల్దార్‌కు చూపి ఉప్పునీటి చొరబాటు గురించి వివరించారు. బుసక కోసం ఉదయం నుంచీ ఇక్కడే ఉన్నామనీ, తమ లే అవుట్‌కు మెరక తోలేందుకు చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఇరుపక్షాల్లో ముఖ్యులను మంగళవారం ఉదయం కార్యాలయానికి రావాలనీ, సీఆర్‌జెడ్ పరిధిని పేర్కొంటూ ఉన్న ఉత్తర్వులను గానీ, కోర్టు డాక్యుమెంట్స్‌ను గానీ తీసుకురావాలని తహసీల్దార్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ మాతంగి వేణు, రైతు ప్రముఖులు నాదెళ్ల వెంకట నరసయ్య, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇసుక దొంగలపై చర్యలు తీసుకోండి

» పోలీసులకు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే బోడె, జనసేన నేత తాతపూడి గణేష్

పెనమలూరు, ఫిబ్రవరి 5 : గత రెండు నెలలుగా చోడవరం ఇసుక రేవులో అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతూ కోట్లలో ప్రజాధనాన్ని దోచుకుంటున్న వైసీపీ మూకలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్‌లు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్వారీ అప్పగించామని మైనింగ్ శాఖ చెబుతోందని, పర్యావరణ అనుమతులు, కలెక్టరు ప్రొసీడింగ్స్, సర్వే నంబర్లు, మైనింగ్ చెయ్యాల్సిన వైశాల్యం లేకుండా ఆ సంస్థ పేరుతో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ సంస్థకు మైనింగ్ అనుమతులు ఇస్తే మంత్రి జోగి రమేశ్ అనుచరులకు రీచ్‌లలో పనేమిటని ప్రశ్నించారు. నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్న మరుక్షణమే ఇసుక క్వారీలను స్వాధీనం చేసుకొని అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. రెండు వందల టిప్పర్లలో ఇసుకను తరలిస్తూ రోజుకు కనీసం పాతిక లక్షలు పోగేసుకుంటున్నాడని ఆరోపించారు. లోకేశ్ రెడ్‌బుక్ లాగా తాను కూడా వైసీపీ తొత్తులైన అధికారుల వివరాలను నమోదు చేస్తున్నానని, అధికారంలోకి వచ్చిన మరుక్షణం ప్రభుత్వ కొమ్ముకాసే అధికారులపై విచారణ జరిపించి తగు చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. తాతపూడి గణేశ్ మాట్లాడుతూ, ఒకే బిల్లు మీద పది నుంచి పదిహేను టిప్పర్లను తోలడంతో ఎంత అక్రమ సొమ్ము వైసీపీ నేతల జేబుల్లోకి వెళుతుందో ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

9న జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 5: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 9న జిల్లాలో 1-19 ఏళ్ల వయస్సు వారందరికీ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్లను, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. 1-2 ఏళ్ల చిన్నారులకు సగం మాత్ర(200 మి.గ్రా.) ఆపైన 19 ఏళ్ల వరకు మాత్ర(400 మి.గ్రా) తీసుకోవాలన్నారు. మాత్రలు తీసుకోకుండా మిగిలిపోయిన వారికి ఫిబ్రవరి 16న మాత్రలు ఇస్తారని తెలిపారు. పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యా సంస్థల్లో అవగాహన కల్పించి, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీహెచ్‌ఎస్ బీసీకే నాయక్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ మాధవి, స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'టీబీ ముక్త్ పంచాయత్'ను సమర్థవంతంగా నిర్వహించండి

కృష్ణలంక: క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ టీబీ ముక్త్ పంచాయత్ కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఎన్టీఆర్‌జిల్లాలో ఆ కార్యక్రమాలను మరింత సమర్థ వంతంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. టీబీ ముక్త్ పంచాయత్‌లో గ్రామస్థాయిలో క్షయ వ్యాధి నిర్మూలనకు అమలు చేస్తున్న కార్యక్రమాలపై సోమవారం వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కమిటీ సమావేశాన్ని కలెక్టర్ వర్చువల్‌గా నిర్వహించారు. పంచాయతీ అధికారులతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయం చేసుకుని క్షయ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో క్షయ బాధితులను గుర్తించామన్నారు. వారిని బ్లాక్‌లుగా విభజించి, తుది పరిశీలన అనంతరం జాబితా రూపొందిస్తామన్నారు.

పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ తప్పనిసరి

కృష్ణలంక: ప్రతి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ గైడ్స్ కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. సోమవారం డీఈవో కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. సమావేశంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. జిల్లాకు నూతన సెక్రటరీగా పొట్లూరి మురళిని నియమించారు. డీఈవో తాహెరా సుల్తానా, ఏడీ-1 జి.రాజేశ్వరి, ఏడీ-2, డీవైఈవో కె.వి.ఎస్.కుమార్, సూపరింటెండెంట్లు రమణ, నాగరాజు, స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్లు, ఉమ్మడి కృష్ణాజిల్లా సెక్రటరీ పి.లలితామోహన్, ఏఎస్ఓసీ భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లా అధికారులు అభినందనీయులు

కృష్ణలంక: మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి-2022కి రూ.41.22 లక్షలను సమకూర్చి, దక్షిణ భారతదేశంలోనే ఎన్టీఆర్ జిల్లాను అగ్రస్థానంలో నిలపడంలో భాగస్వాములైన జిల్లా అధికారులు అభినందనీయులని, విరాళాలు సమకూర్చడంలో వారి పనితీరు భేష్ అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రశంసించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఆర్‌డీఏ ద్వారా రూ.11.80 లక్షలు, డ్వామా పీడీ ద్వారా రూ.2 లక్షలు, మెప్మా పీడీ ద్వారా రూ.2.25 లక్షలు, యూసీడీపీవో ద్వారా రూ.10 లక్షలు, పౌరసంబంధాల జిల్లా అధికారి ద్వారా రూ.1.28 లక్షలు, పౌర సరఫరాల జిల్లా అధికారి ద్వారా రూ.1.28 లక్షలు నిధికి సమకూర్చి జిల్లాను మొదటి స్థానంలో నిలపడంలో భాగస్వాములైన డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, మెప్మా ఏఓ డీవీపీఎస్ఎన్ రాజు, పౌరసరఫరాల జిల్లా అధికారి జి.మోహన్‌బాబును కలెక్టర్ అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు. జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ కె.కల్యాణవీణ హాజరయ్యారు.


కొండపైకి దివ్యసత్ప్రసాదంతో వెళుతున్న గురువులు

మహాసాధ్వి మరియమాత

» ఆమెను గౌరవిస్తే దేవుడి అనుగ్రహం
» ఆరో రోజు నవదిన ప్రార్థనల్లో ఫాదర్ బవిరి సురేష్

గుణదల, ఫిబ్రవరి 5: స్త్రీలందరిలో ధన్యురాలు, మహాసాధ్వి అయిన మరియమాతను గౌరవిస్తే దేవుడి అనుగ్రహం లభిస్తుందని ఎంఎస్ఎఫ్ ప్రావిన్షియల్ ఫాదర్ బవిరి సురేష్ అన్నారు. గుణదలమాత నూరు వసంతాల మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నవదినప్రార్థనలు సోమవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బవిరి సురేష్ భక్తులకు సందేశమిచ్చారు. మరో నాలుగు రోజుల్లో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తెలిపారు. అంతకముందు దివ్యసత్ప్రసాద వదనంతో గురువులు కొండపైకి చేరుకున్నారు. ఫాదర్ బి.సురేష్, కొలకాని మరియన్న, తోట సునీల్‌రాజు, జాన్‌పీటర్ గురువులు కొండ మధ్య మరియమాత గుహ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై దివ్యపూజాబలి సమర్పించారు. జోజినగర్, పెజ్జోనిపేట, గన్నవరం విచారణల నుంచి భక్తులు హాజరయ్యారు.

మావుళ్లమ్మకు దుర్గగుడి సారె


సారె సమర్పిస్తున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన బృందం

వన్‌టౌన్, ఫిబ్రవరి 5: భీమవరంలోని మావుళ్లమ్మ ఆలయం 60వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం తరఫున సారె సమర్పించారు. వైదిక సిబ్బంది ఉండి శ్రీనివాస్ శాస్త్రి, కుందుర్తి శేఖర్‌శర్మ, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు వెంకటరాజు, దేవస్థానం ఉత్సవాల విభాగం నుంచి కె.శ్రీనివాసరెడ్డి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గమ్మకు 3 బంగారు కాయిన్లు

కనకదుర్గమ్మకు విశాఖపట్నంలోని స్కైపార్క్‌కు చెందిన సాగి శ్రీకాంత్‌వర్మ కుటుంబ సభ్యులు సోమవారం 3 బంగారు కాయిన్లను(25 గ్రాములు) ఏఈవో రమేష్ ద్వారా దేవస్థానానికి అందించారు.

తహసీల్దార్ రమణయ్య హత్య కేసు
నిందితులను కఠినంగా శిక్షించాలి

» మంత్రి ధర్మాన ప్రసాదరావుకు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వినతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 5: తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సోమవారం రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రమిచ్చారు. భూమి విలువ అత్యధికంగా పెరిగిన ప్రాంతాలలో అధికారులు, ఉద్యోగులకు తక్షణమే భద్రత కల్పించాలన్నారు. అధికారులు, ఉద్యోగులు నివాసం ఉండడానికి సమీకృత రెవెన్యూ క్వార్టర్లు నియమించాలని, తగిన భద్రత ఏర్పాటు చేయాలని ప్రతిజిల్లాలో భూ రికార్డులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఆక్రమణల తొలగింపులో ఐఏఎస్, ఐపీఎస్‌లతో ప్రత్యేక విభాగాలను జిల్లాలో నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో స్వయం ప్రతిపత్తి కలిగిన న్యాయవిభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. భూ వివాదాలు ఎక్కువగా ఉన్న పట్టణ ప్రాంత సెన్సిటివ్‌గా గుర్తించిన మండలాల్లో తగినంత సిబ్బందిని నియవించాలన్నారు. రమణయ్య కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కుటుంబసభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

స్టాక్ వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలి

» రైస్ మిల్లర్లు, వ్యాపారులకు జేసీ సంపత్‌కుమార్ ఆదేశం

కృష్ణలంక, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధాన్యం, బియ్యం వ్యాపారులు, రిటైలర్లు, చిల్లర వ్యాపారులు, పెద్ద రిటైలర్లు, ప్రాసెసర్లు/మిల్లర్లు తమ బియ్యం లేదా వడ్ల స్టాక్ వివరాలను అందరికీ అందుబాటులో ఉండేలా హెచ్‌టీటీపీఎస్://ఈవీఈజీఎల్ఎల్ఎస్.ఎన్ఐసీ.ఇన్.రైస్.లాగిన్.హెచ్‌టీఎంఎల్‌లో పొందుపరచాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ సూచించారు. సోమవారం రైస్‌మిల్లర్లు, రైస్‌మర్చంట్ అసోసియేషన్, ధాన్యం, బియ్యం వ్యాపారులతో జేసీ సమావేశం నిర్వహించారు. స్టాక్ వివరాలను కేటగిరీల వారీగా ప్రభుత్వ పోర్టల్‌లో ప్రతి శుక్రవారం పొందుపరచాలని, నిర్లక్ష్యం వహించిన, ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజన సరుకుల కమీషన్ ఇస్తాం

» వివరాలివ్వండి..డీలర్లకు పౌరసరఫరాల జిల్లా అధికారి జి.మోహన్‌బాబు అదేశం

మధురానగర్, ఫిబ్రవరి 5: 2015 డిసెంబరు నుంచి 2023 అక్టోబరు వరకు అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకానికి సరుకుల కమీషన్‌ను డీలర్లకు జమ చేస్తామని, ప్రతి డీలర్ వివరాలను వెంటనే పీడీఎస్ డీటీల ద్వారా అందించాలని పౌర సరఫరాల జిల్లా అధికారి జి.మోహన్‌బాబు అదేశించారు. సోమవారం గాంధీనగర్ కార్యాలయంలో జిల్లా, నగర రేషన్ డీలర్ సంఘ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఏఎస్వో ధనుంజయరెడ్డి, సర్కిల్ 1- సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, డీలర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి జగన్‌తో డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, రామ్‌చరణ్

నా కుమారుడికివ్వండి

» ముఖ్యమంత్రిని కోరిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు

అవనిగడ్డ, ఫిబ్రవరి 5 : అవనిగడ్డ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఇటీవల నియమితులైన ప్రముఖ కేన్సర్ వైద్యుడు, దివంగత మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు తనయుడు డాక్టర్ చంద్రశేఖర్‌రావు సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే వయస్సు రీత్యా తాను ఎన్నికల్లో పోటీ చేయలేనని, బదులుగా తన కుమారుడు సింహాద్రి రామ్‌చరణ్‌కు అవనిగడ్డ సీటు ఇవ్వాలని సీఎంను కోరినట్టు తెలుస్తోంది. తన కుమారుడు రామ్‌చరణ్ అయితే ఉత్సాహంగా పనిచేస్తాడని, అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వైసీపీ గెలుపుకోసం ప్రయత్నిస్తాడని చంద్రశేఖర్ సీఎంకు చెప్పినట్టుగా సమాచారం. మూడుతరాలుగా తమ కుటుంబం రాజకీయాల్లో ఉంటూ అవనిగడ్డకు సేవలందించిందని, సింహాద్రి రామ్‌చరణ్‌ను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరుతున్నట్టు చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. దీంతో కొద్దిరోజులుగా సింహాద్రి చంద్రశేఖర్‌రావు ఎన్నికల బరిలో నిలబడతారా? లేదా? అన్న విషయమై అవనిగడ్డ నియోజకవర్గంలో జరుగుతున్న చర్చకు ఎట్టకేలకు తెర పడింది.

గాంధీ బ్యాంకుపై ఆరోపణల్లో నిజం లేదు

» బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకట్రావు
» విచారణ జరుగుతుండగా ఎలా చెబుతారు..
» బ్యాంకు డైరెక్టర్లు సుబ్బారావు, నాగేశ్వరరావు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

వేలాది మంది ఖాతాదారులతో గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకమండలి చెలగాటమాడుతోంది. పాలకమండలి సభ్యులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు.. ఆరోపణలతో బ్యాంకు భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. చైర్మన్‌పై పాలకమండలి సభ్యులు ఏడుగురు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించడంతో పాలకమండలి నడుమ విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకట్రావు (చిన్ని) మొదటిసారి తన వాదన వినిపించారు. విలేకరులతో మాట్లాడుతూ.. తమపై చేసిన ఫిర్యాదులన్నీ ఫోర్జరీ సంతకాలతో చేసినవని, ఇద్దరు డైరెక్టర్లు తాము సంతకాలు పెట్టలేదని చెబుతున్నారంటూ ఆరోపించారు. బ్యాంకుపై వస్తున్న ఆరోపణలు నిజం కావన్నారు. కొత్త శాఖ ఏర్పాటుకు విశాఖపట్నంలో స్థల పరిశీలన పాలకమండలి ఆమోదం మేరకే జరిగిందని చిన్ని తెలిపారు. అంతా నిబంధనల ప్రకారమే చేశామని చెప్పిన ఆయన.. భవన యజమానికి ఒప్పందానికి ముందే డబ్బులు ఎందుకు చెల్లించాల్సి వచ్చిందన్న దానిపై స్పందించలేదు. విశాఖపట్నంలో కొత్త శాఖకు పాలకవర్గం ఆమోదం తెలిపిన తీర్మానం కాపీని ఇవ్వడానికీ నిరాకరించారు. కొత్త శాఖ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి ఉందా అన్న ప్రశ్నకు సమాధానం దాటవేశారు. కాగా చైర్మన్‌పై అవిశ్వాసం ప్రతిపాదించిన బ్యాంక్ డైరెక్టర్లు తల్లాప్రగడ సుబ్బారావు, కళ్లే నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. బ్యాంకులో జరుగుతున్న అవకతవకలపై చైర్మన్ వక్రభాష్యం చెబుతున్నారన్నారు. ఆర్‌బీఐ అనుమతి లేకుండా కొత్త శాఖ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పాలకమండలి సమావేశంలో కొత్త శాఖ ఏర్పాటుకు సంబంధించిన అజెండా అంశం లేదని, అలాంటప్పుడు దానికి ఆమోదం ఎలా ఉందని చెబుతారని నిలదీశారు. బ్యాంకు అక్రమాలపై తాము చేసిన ఫిర్యాదులపై కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ విచారణ చేస్తుండగా, ఎటువంటి అవకతవకలు జరగలేదని చైర్మన్ ఎలా చెబుతారని ప్రశ్నించారు.

దళిత బాలికపై అత్యాచారం

» పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 5 : తొమ్మిదో తరగతి చదువుతున్న దళిత బాలికపై ఒక యువకుడు, మరో మైనర్ (17) కలిసి అత్యాచారానికి పాల్పడిన ఘటన యాకమూరులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకమూరుకు చెందిన బాలిక(14) కూచిపూడి బాలికల హాస్టల్లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈమెకు యాకమూరుకు చెందిన బోలెం దిలీప్(21)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కొన్నిరోజులుగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టుకుంటు సన్నిహితం అయ్యారు. ఆదివారం కూచిపూడి హాస్టల్ నుంచి యాకమూరు ఇంటికి వచ్చింది. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో సదరు బాలిక దిలీప్‌తో మాట్లాడేందుకు బయటకు వచ్చింది. దిలీప్, మైనర్ బాలుడితో కలిసి బాలికను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని యాకమూరు శివారు తోట్లవల్లూరు రోడ్డులోని రియల్ ఎస్టేట్ ప్లాట్లలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ నిర్వహించారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులిద్దరిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద కేసులు నమోదు చేశారు. డీఎస్పీ వెంట సీఐ ఎం.కిషోర్‌బాబు, ఎస్సై పి.విశ్వనాథ్ ఉన్నారు.

మా ఆందోళనకు మద్దతివ్వండి

» పీసీసీకి వరికపూడిశెల ప్రాజెక్టు రైతుల వినతి

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే ఆందోళనకు మద్దతు ఇవ్వాలని సమితి ప్రతినిధులు పీసీసీ నేతలను కోరారు. వారు ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీకి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పనులను సీఎం జగన్ గడచిన ఏడాది నవంబరు 15న మాచర్లలో వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. ఇప్పటి వరకు రూపాయి నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం జరిగే ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

నేటి నుంచి డ్రామా ఫెస్టివల్

విజయవాడ కల్చరల్, జనవరి 5: భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త అధ్వర్యంలో 23వ భారత్‌రంగ్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అధ్యాపకుడు వివేక్ ఇమ్మనేని పేర్కొన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటర్నేషనల్ థియేటర్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల, విదేశాల నుంచి ఆహ్వానించిన వంద నాటకాలను ఎంపిక చేసి దేశవ్యాప్తంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	238
చికెన్ స్కిన్‌లెస్	248

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.43

ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 4వేల డ్రైవర్ పోస్టులను భర్తీ చేయండి

ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్ పిన్నెంటి మహేష్

బస్టేషన్,ఫిబ్రవరి 5: ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 4000 డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని, ఇంకా పలు సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్ పిన్నెంటి మహేష్ సోమవారం సమాచార మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ప్రిన్సిపల్ సెక్రటరీ, టీఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్, ఓఎస్‌డీ డీ.వెంకటరావు తదితరులను కలిసి విన్నవించారు. సంస్థలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో కలపాలని, నాలుగువేల డ్రైవర్ల పోస్టులను భర్తీ చేయాలని, మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈమేరకు వినతి పత్రం సమర్పించారు.

టీడీపీ విజయం ఖాయం

విద్యాధరపురం, ఫిబ్రవరి 5: రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని పార్టీ సీనియర్ నాయకుడు, విజయవాడ లోక్‌సభ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. సోమవారం భవానీపురం 42వ డివిజన్‌లో టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, టీడీపీ బీసీ, మైనారిటీ నాయకుడు, అధికార ప్రతినిధి నాగుల్‌మీరా , జనసేన పశ్చిమ నాయకుడు బాడిత శంకర్ తదితరులతో కలిసి చిన్ని కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయ్యేంతవరకు కూడా టీడీపీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం విజయం తథ్యమని పేర్కొన్నారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ చంద్రబాబును సీఎం చేయడానికి కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బుద్దా వెంకన్న కేశినేని చిన్ని, నాగుల్‌మీరా తదితరులు

42వ డివిజన్ టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో కేశినేని శివనాథ్

కేశినేని చిన్నిని గెలిపించాలన్న ఉత్సాహం ప్రజల్లో కనిపిస్తుందని, భారీ మెజారిటీతో చిన్ని విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేశినేని శ్రీనివాస్ (నాని)ను పశ్చిమలో తిరగనిచ్చేది లేదని చెప్పారు. నాగుల్‌మీరా మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కార్యకర్తలు ఉత్సాహంతో పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. పి.వి చిన్నసుబ్బయ్య, పెద్ది సతీష్, పెద్ది శ్రీను, కాళిదాసు సుబ్రహ్మణ్యం, గణపతి, మొవ్వ విజయ, టీడీపీ- జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పాయకాపురం, ఫిబ్రవరి 5 : నున్న మ్యాంగో మార్కెట్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన దొంతుబోయిన వెంకటేశ్వరరావు(65) స్థానిక కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్తగా ఉంటున్నాడు. అతను ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై నున్న గ్రామానికి బయలుదేరాడు. తిరిగి ప్రకాష్‌నగర్ వస్తుండగా నున్న మ్యాంగో మార్కెట్ వద్దకు వచ్చే సరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. వెంకటేశ్వరరావును బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో యువకుడు..

అజిత్‌సింగ్‌నగర్ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన కె. నాగవెంకటేష్(30) చికెన్ షాపు నడుపుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గత నెల 28న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి

చిట్టినగర్, ఫిబ్రవరి 5: ఆటో డ్రైవర్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన ఆదివారం రాత్రి కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కొత్తపేట కొండప్రాంతంలో ఆటో డ్రైవర్ జగదీష్ కుటుంబంతో నివాసం ఉంటాడు. ఆదివారం రాత్రి ఇంటికి వస్తున్న జగదీష్ తన ఆటోను నెహ్రూబొమ్మసెంటర్ సమీపంలోని సుధా బార్ వద్ద పార్కింగ్ చేసి పరిచయం ఉన్న రవితో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఓ గుర్తు తెలియని వ్యక్తి జగదీష్ వద్దకు వచ్చి కత్తితో దాడి చేశాడు. దాడిలో జగదీష్ రెండు చేతులకు గాయాలయ్యాయి. బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 5: ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బి.వి.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్‌కేవీ లైన్లు మరమ్మతుల కారణంగా లోటస్‌ల్యాండ్ మార్క్ సెక్టార్ 3, 4, సీకె రెడ్డి రోడ్డు, ఇందిరాటవర్స్, రిలయన్స్ మార్ట్, అయోధ్యనగర్ మెయిన్‌రోడ్డు, పలగాని ప్రభాకర్ వీధి, అయోధ్యనగర్ ఒకట రోడ్డు నుంచి మూడవ రోడ్డు వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు

మాచవరం, ఫిబ్రవరి 5 : చెస్‌లో మహిళల విభాగంలో ప్రథమ బహుమతి పొందిన సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థిని మేకల సాయిదివ్యను కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు సోమవారం అభినందించి ఘనంగా సత్కరించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వడ్లమూడి ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 3 వరకు విజ్ఞాన్ నేషనల్ లెవల్ మహోత్సవాల్లో సాయిదివ్య బహుమతి సాధించింది.





బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యం : బోండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 5 : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా మహేశ్వరరావు విమర్శించారు. అజిత్‌సింగ్ నగర్ టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో సోమ వారం 33వ డివిజన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా స్కాలర్ షిప్స్, పించన్లు, మహిళ స్వయం ఉపాధి కింద రుణాలు అందించామని గుర్తు చేశారు. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న బొండా ఉమా

టీడీపీలో 100 మంది చేరిక

పాయకాపురం: తెలుగువారి కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసిన తమ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలోని 100 మంది సోమవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పైడి శ్రీను, నవనీతం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ హాస్య నాటికగా పక్కింటి మొగుడు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 5 : సుమధుర కళానికేతన్ నిర్వహించిన తెలుగు హాస్య నాటికల పోటీల్లో పందు క్రియేషన్స్, కొప్పోలు వారి పక్కింటి మొగుడు ఉత్తమ హాస్య నాటికగా గెలుపొందింది. ముమ్మనేని సుబ్బారావు కళాపీఠం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో సిద్ధార్థ కళాపీఠం సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన నాటిక పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్, హైదరాబాద్ వారి బూడిద, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా ది అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్, చిలకలూరిపేట వారి ఏడున్నాడో...ఎక్కడున్నాడో బహుమతులు పొందాయి. హర్ష క్రియేషన్స్, విజయవాడ ట్రీట్‌మెంట్, మాతృశ్రీ కళానికేతన్, విశాఖపట్నం చూపులు కలవని శుభవేళ నాటికలు ప్రోత్సాహక బహుమతులు పొందాయి. ఉత్తమ దర్శకుడిగా బాలినేని నాగేశ్వరరావు (పక్కింటి మొగుడు), ఉత్తమ రచయితగా గోవిందరాజుల నాగేశ్వరరావు (పక్కింటి మొగుడు), ఉత్తమ నటి జాహ్నవి (రంగుపడుద్ది), ఉత్తమ నటుడుగా ఉన్నం వెంకట శేషయ్య (పక్కింటి మొగుడు), ఉత్తమ రంగాలంకరణకు నాగేశ్వర్ (ఏడున్నాడో...ఎక్కడున్నాడో), ఉత్తమ సంగీతం సాయితేజ్ (ఏడున్నాడో...ఎక్కడున్నాడో), ఉత్తమ ఆహార్యం కుమారి (కలిసుంటే), న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన సినీనటులు ఎస్కే విశ్రో, సుబ్బరాయశర్మ, కోట శంకరరావు, సుమధుర ఛైర్మన్ మండా చిరంజీవి దాస్, అధ్యక్షులు సామంతపూడి నరసరాజు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి విజయభాస్కరశర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి పిండిప్రోలు సూర్యనారాయణమూర్తి, డాక్టర్ దావులూరి కైలాసరావు, బోడి ఆంజనేయరాజులు నగదు, జ్ఞాపికలతో సత్కరించారు.

మరుపిళ్ల చిట్టి విగ్రహానికి టీడీపీ, జనసేన నాయకుల నివాళి



చిట్టినగర్, ఫిబ్రవరి 5: చిట్టినగర్‌లో ఆదివారం ప్రారంభించిన వెస్ట్ మాజీ ఎమ్మెల్యే సర్దార్ మరుపిళ్ల చిట్టి విగ్రహానికి సోమవారం టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని), టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, బీసీ, మైనార్టీ నాయకుడు, అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ తదితరులు చిట్టి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. బెవర జోగేశ్వరరావు, గుర్రం కొండ, నాగోతి రామారావు, పేరాబత్తుల రమణ, భోగవల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి

● మేయర్ రాయన భాగ్యలక్ష్మి

చిట్టినగర్, ఫిబ్రవరి 5: స్పందనలో వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్పందన నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా మేయర్, కమిషనర్‌లకు అందజేశారు. మొత్తం 13 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ అధికారులకు సూచించారు. అదనపు కమిషనర్‌లు కె. శకుంతల, కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రోహిణి, ఏడీహెచ్ రత్నకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

విద్యాధరపురం, ఫిబ్రవరి 5: రామరాజ్యనగర్‌లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ముస్తాబాద్‌కు చెందిన గుర్రం నరసింహరావు (31)ను భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. గత కొన్ని రోజులుగా నిందితుడు ఇతర ప్రాంతాల నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చి నిబంధనలకు విరుద్ధంగా విద్యాధరపురం, రామరాజ్యనగర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. దీంతో సోమవారం రామరాజ్యనగర్‌లో మద్యం విక్రయిస్తున్న నరసింహరావు వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

హాఫ్ శారీ అండ్ వెడ్డింగ్ జ్యుయలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం

లబ్బీపేట, ఫిబ్రవరి 5: మనదేశ, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టే బ్రాండ్‌గా పీఎంజే జ్యూయల్స్ నిలిచిందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. బందర్‌రోడ్డులోని వివంత హోటల్‌లో పీఎంజే జ్యూయల్స్ ఆధ్వర్యంలో హాఫ్ శారీ అండ్ వెడ్డింగ్ జ్యుయలరీ ఎగ్జిబిషన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శన కళాత్మక ఆభరణాల రూపకల్పనలో మన వారసత్వాన్ని నిలబెట్టే విధంగా నిలిచిందని, ఇలాంటి వినూత్నమైన సేకరణతో ప్రదర్శన నిర్వహించడం హర్షణీయం అన్నారు. అనంతరం జ్యూయల్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధిపతి హైదర్ అలీ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఆభరణాల నాణ్యత, వైవిధ్యం తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 7 వరకు జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



ఆభరణాలను తిలకిస్తున్న గద్దె అనురాధ

దుర్గగుడి తలనీలాల వేలం పాటలో కాంట్రాక్టర్ల రింగ్

● వేలం పాటను వాయిదా వేసిన అధికారులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 5: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించిన తలనీలాల వేలం పాటలో కాంట్రాక్టర్లు రింగయ్యారు. సోమవారం దేవస్థానం అధికారులు ఏఈవో జంగం శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డీవీవీ సత్యనారాయణ, ఇతర సిబ్బంది వేలంపాట నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన మొత్తం 15 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అధికారులు దేవస్థానం తరపున రూ.7 కోట్లతో వేలం పాటను ప్రారంభించారు. కాంట్రాక్టర్లు ముందుగానే రింగవడంతో పాట పాడేందుకు విముఖత చూపించారు. దీంతో మళ్లీ రూ. 5.04 కోట్లకు తగ్గించి పాటను ప్రారంభించారు. అయితే ఒకరిద్దరు మరో రూ. 26 లక్షలు అంటూ 5.30 కోట్లకు పెంచారు. కానీ ఆతరువాత ముందుకు సాగకపోవడంతో వాయిదా వేశారు. గత ఏడాది ఏడుకోట్ల రూపాయలకు పైగా పాట పోయింది. ఈ కారణంగానే దేవస్థానం అధికారులు తొలుత ఇదే మొత్తంతో పాట పెట్టారు. ఇంతకూడా రాకుండా మరీ తక్కువ రావడంతో వాయిదా వేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష జనాదరణ

ఆటోనగర్(పెనమలూరు),ఫిబ్రవరి 5: లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆటోనగర్ జెమ్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష జనాదరణ లభించింది. మోహన్ డయాబెటిక్ సెంటరు, దుహిత మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి, వాసన్ ఐకేర్ ఆసుపత్రి వైద్యులు, బెజవాడ గుండె పరీక్షల శిబిరం, అమెరికన్ అంకాలజీ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎంవీఎల్ కాంతారావు, బెవర నాగేశ్వరరావు, మాజీ జిల్లా గవర్నర్ దామర్ల శ్రీశాంతి, ఐలా సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్, సర్నాల గంగారత్నం, నరసింహరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్, కార్యదర్శి కేవీఎస్ఎన్ ప్రసాద్, కోశాధికారి బీ కిరణ్ కుమార్‌లు పర్యవేక్షించారు.



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

లబ్బీపేట, ఫిబ్రవరి 5: కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవడంతో పాటు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకోవాలని మణిపాల్ హాస్పటల్ డాక్టర్ ఆర్.దినేష్ రెడ్డి పేర్కొన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీ, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ విజయవాడ ఇంపాక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కేన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ శరీరంలో అసాధారణ లక్షణాలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ కేన్సర్లు సంభవిస్తాయని, వాటిపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా రొమ్ము కేన్సర్‌ను గుర్తించవచ్చని, పెల్విక్ పరీక్ష, అల్ట్రాసౌండ్, బయాప్సీ, ఇమేజింగ్ పరీక్షల ద్వారా గర్భాశయ కేన్సర్‌ను నిర్ధారించవచ్చని తెలిపారు. కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి. ప్రిన్సిపాల్ ఎస్.కల్పన పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు, డాక్టర్లు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్

చిట్టినగర్, ఫిబ్రవరి 5: శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస్థ నూతన భవనంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సమస్యలను నగర కమిషనర్ అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరి శుభ్రంగా ఉంచడంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కీలకమని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎటువంటి సహాయ సహకారం కావాలన్నా అందిస్తామన్నారు. అవసరమైతే పూడికలు తీయడానికి డివిజన్‌కు రెండు ట్రాక్టర్‌లు, పుష్‌కార్టులు సమకూరుస్తామన్నారు. మరీ అవసరమైతే కార్మికుల సంఖ్యను పెంచి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సమస్యలు తెలుసుకుంటున్న నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్

వెస్ట్ ఏసీపీగా మురళీ కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకారం

వన్‌టౌన్, ఫిబ్రవరి 5: విజయవాడ వెస్ట్ పోలీసు విభాగానికి ఏసీపీగా కాకినాడ నుంచి బదిలీ అయిన పీ మురళీకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీలలో వెస్ట్ ఏసీపీ డాక్టర్ కే హనుమంతరావు కాకినాడకు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న మురళీకృష్ణారెడ్డి ఆయన స్థానంలో వచ్చారు. బాధ్యతలు తీసుకున్న ఆయన పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. పోలీసు కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

కార్మిక సంఘాలను ఏకతాటిపై నడిపిన గొప్ప వ్యక్తి మరుపిళ్ల చిట్టి : మేయర్

చిట్టినగర్, ఫిబ్రవరి 5: సర్దార్ మరుపిళ్ల చిట్టి నగరానికి ఎన్నో సేవలు అందించారని, నగరాల కులస్తుల అభివృద్ధికి కృషి చేశారని మేయర్ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం 46వ డివిజన్ మేయర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 16 కార్మిక సంఘాలను ఏకతాటిపై నడిపించిన గొప్పవ్యక్తి మరుపిళ్ల చిట్టి అని, మద్యపాన నిషేధం తదితర ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన విగ్రహ ఆవిష్కరణలో జనసేన పార్టీ చెందిన పోతిన మహేశ్ తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. చిట్టి విగ్రహం ప్రపోజల్ ఎమ్మెల్యే కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం తీసుకున్నారు. చిట్టి మీద మహేష్‌కు గౌరవం ఉందా అని మేయర్ ప్రశ్నించారు.



ఇప్పుడెందుకు ఉద్యమం..?

- ఐఆర్ కూడా అడగొద్దులే..!
- ఇప్పటి వరకు ఏమీ ఇవ్వని ఈ ప్రభుత్వానికి..
- ఎన్నికల ముందు క్రెడిట్ ఇవ్వొద్దంటున్న ఉద్యోగులు
- ప్రధాన జేఏసీ సమావేశాల్లో జిల్లా నేతలకు వెల్లడి

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికలకు ముందు హామీలు గుప్పించి.. గెలిచిన తర్వాత నిలువునా మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి గట్టి షాక్ ఇచ్చేందుకు ఉద్యోగులు 'సిద్ధం' అయ్యారు. ఉద్యోగుల సమస్యల పట్ల నాలుగున్నరేళ్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన ఈ ప్రభుత్వాన్ని.. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఇక ఏమీ అడగొద్దని.. ఉద్యోగ సంఘాల నేతల మీద ఉద్యోగులు ఒత్తిడి తెస్తున్నారు. జగన్ ప్రభుత్వం ఏమీ చేయదని ఫిక్స్ అయిపోయిన ఉద్యోగులు.. ఎన్నికల ముందు విదిల్చే మెతుకుల కోసం ఈ ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వకూడదని భావిస్తున్నారు. విజయవాడ వేదికగా 2 రోజుపాటు అటు ఏపీజేఏసీ అమరావతి, ఇటు ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలతో పాటు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ), ఏపీఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో ఉద్యోగుల నుంచి వస్తున్న అభిప్రాయాలను ఆయా సంఘాల జిల్లాల నేతలు అగ్రనేతల దృష్టికి తీసుకురావడం చర్చనీయాంశంగా మారుతోంది. మొన్నటి వరకు తమ నుంచి మద్దతు ఉన్నా.. అగ్రనాయకులు ఉద్యమాన్ని సరిగా నడిపించలేదన్నది ఉద్యోగుల అభిప్రాయం. అయితే ఇప్పుడు సడెన్‌గా ప్రభుత్వాన్ని ఏమీ అడగవద్దు అనే దిశగా ఉద్యోగులు ఎందుకు వెళ్లారన్నది చర్చనీయాంశమైంది. ఎన్నికల కొద్ది రోజుల ముందు ఆందోళన చేసి అరాకొర సాధించుకుందామన్న అగ్రనేతల ఆలోచనకు కూడా ఉద్యోగులు సహకరించడం లేదు. ఈ నెలలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఇలాంటపుడు ఉద్యోగుల మెప్పు కోసం, ప్రభుత్వం ఏదో చేసేసిందన్న భావన కల్పించడం కోసం ప్రధాన జేఏసీల అగ్ర నాయకత్వాలు డ్రామాలు ఆడుతున్నాయన్న భావనకు ఉద్యోగులు వచ్చారు. రెండు రోజులుగా జరుగుతున్న జేఏసీ సమావేశాలే దీనికి నిదర్శనం. ఆయా జిల్లాల నేతలు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఏమీ ఇవ్వదనేది ఉద్యోగులలో బలంగా నాటుకుపోయిందని, ఇప్పుడేం అడిగినా ప్రయోజనం లేదని తమతో చెబుతున్నట్టుగా అగ్రనేతల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అగ్రనేతలు సైతం కంగుతిన్నారు. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వానికి ఎన్నికల ముందు ఒకటి, రెండు క్రెడిట్స్ కూడా ఇవ్వవద్దనేది జిల్లా నేతల అభిప్రాయంగా వ్యక్తమైంది.

లోపాయకారీ ఒప్పందం..?

ప్రధాన జేఏసీ నాయకులిద్దరితో ప్రభుత్వం లోపాయికారీ 3 అంశాలపై హామీ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఐఆర్ 7 శాతం, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 10 శాతం పెంపుదల, ఒక్క డీఏ ఇచ్చేలా హామీ ఇచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో జేఏసీల అగ్రనాయకత్వాలు ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా.. ఉద్యమం పేరుతో నాటకానికి తెరలేపుతున్నారని ఉద్యోగులకు సమాచారం ఉంది. ఉద్యమం పేరుతో కార్యాచరణ ప్రకటిస్తే.. ప్రభుత్వం లోపాయికారీగా ఇచ్చిన హామీలను తమ ఘనతగా చెప్పుకోవచ్చని, అదే సమయంలో సర్కారు పట్ల కొంత సానుకూల స్పందన తెచ్చే ప్రయత్నాలు చేయవచ్చన్నది అగ్రనేతల ఆలోచనగా ఉందని ఉద్యోగులే జిల్లాల నేతల దగ్గర ప్రస్తావిస్తున్నారు. వారు అదే విషయాన్ని అగ్రనేతలకు వివరించటంతో వారు ఖంగు తింటున్నారు.

ఇక మా వల్లకాదు.. సమ్మెకైనా సిద్ధం!

- ఏపీజేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'నాలుగున్నరేళ్ల ఎదురు చూశాం. ఇక మా వల్ల కాదు. ఉద్యమం దిశగా వెళ్లాలని నిర్ణయించాం.. సమ్మెకై నా సిద్ధం' అని ఏపీజేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 11న నిర్వహించే వి స్తృత స్థాయి సమావేశంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, ఆ మరుసటి రోజే సీఎస్‌కు నోటీసు అందజేస్తామని, సమ్మెకైనా వెళతామని హెచ్చరించారు. విజయవాడలోని ఏపీఎన్జీవో భవన్‌లో ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలు, వారికి చెల్లించాల్సిన బకాయిలపై అలసత్వం చూపుతోందన్నారు. ఉద్యోగుల జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవులు, మెడికల్ బిల్స్ వంటివి నయా పైసా చెల్లించడం లేదన్నారు. 11వ పీఆర్సీ బకాయిలతో పాటు, పదవీ విరమణ చెల్లింపులు చేయలేదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలును 10, 20, 30 శాతం చొప్పున వాయిదాల పద్ధతిలో ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. 11వ పీఆర్సీలో 27 శాతం ఐఆర్ అని చెప్పి.. తర్వాత 23 శాతానికి తగ్గించిందని మండిపడ్డారు. 12వ పీఆర్సీ నివేదిక వచ్చేలోపు ఐఆర్ ప్రకటించే విషయంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామన్న హామీ నెరవేరలేదని, అవుట్‌సోర్సింగ్ పరిస్థితి దయనీయంగా ఉందన్నా రు. సోమవారం ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఉద్యమం దిశగా కదలబోతున్నామని చెప్పారు. 11న విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

18న సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

- ఓట్ ఫర్ ఓపీఎస్ పేరిట ఆందోళన కార్యక్రమం

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) అమలు చేస్తామని సీపీఎస్ ఉద్యోగులను నమ్మించి మోసం చేసిన వైనాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసు కు వెళ్లేందుకు ఈ నెల 18న 'ఓట్ ఫర్ ఓపీఎస్ చలో విజయవాడ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్ సోమవారం తెలిపారు. పాత పెన్షన్ అమలు చేస్తామ ని చె ప్పిన నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం జగన్ సీపీఎస్ ఉద్యోగులను దారుణంగా మోసం చేశారన్నారు. సీఎం జగన్ తమను ఏ విధంగా మోసం చేశారో రాష్ట్రంలోని ప్రతి గడప కూ తీసుకువెళ్లాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 4న విశాఖలో సాగర సంగ్రామ దీక్ష నిర్వహించామని చెప్పారు. ఈ నెల 11న విజయవాడలో జరగాల్సిన పాత పెన్షన్ కోసం ఐక్యతా ఓటు కార్యక్రమాన్ని ఈ నెల 18న 'ఓట్ ఫర్ ఓపీఎస్ చలో విజయవాడ' కార్యక్రమంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ఉద్యోగులకూ సక్రమంగా జీతాల్లేవు: రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా వైసీపీ ప్రభుత్వం సరిగ్గా చెల్లించట్లేదని శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల కోసం రూపాయి కూడా ఖర్చు పెట్టట్లేదని ఆరోపించారు. సోమవారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన జగన్ సర్కారు తీరును తూర్పారబట్టారు. కేంద్రం నిధులను దారి మళ్లిస్తోందని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఆంధ్రప్రదేశ్ గత నాలుగేళ్లుగా అప్పుల ఊబిలోకి కూరకపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించట్లేదని అన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధిని మించి అప్పులు తీసుకుంటోందని అన్నారు.



స్వామీజీలు, టీటీడీ ఈవోతో కలిసి మీడియాకు వివరాలు తెలియజేస్తున్న చైర్మన్ కరుణాకరరెడ్డి

స్వచ్ఛందంగా హిందూమతంలోకి వచ్చేవారికి పవిత్రజల సంప్రోక్షణ

- దీనికోసం తిరుమలలో ప్రత్యేక ప్రాంగణం ఏర్పాటు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి
- ముగిసిన ధార్మిక సదస్సు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇతర మతస్తులు ఎవరైనా స్వచ్ఛందంగా హిందూ మతంలోకి మారడానికి ముందుకు వస్తే వారి కోసం తిరుమలలో ప్రత్యేక ప్రాంగణం ఏర్పాటు చేసి పవిత్రజల ప్రోక్షణం చేసి స్వాగతించాలని ధార్మిక సదస్సులో పీఠాధిపతులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో సోమవారం జరిగిన ధార్మిక సదస్సు ముగింపు కార్యక్రమంలో పీఠాధిపతులు, ఈవో ధర్మారెడ్డితో కలిసి స్వామీజీలు చేసిన 19 తీర్మానాలను చైర్మన్ మీడియాకు వివరించారు. ఇతర మతాలకు చెందిన వారిని విధిపూర్వకంగా స్వాగతించాలని, ఒకసారి శ్రీవారి దర్శనం కల్పించాలని సదస్సు తీర్మానించినట్టు వివరించారు.

కేంద్రబడ్జెట్‌లో బీసీలకు అన్యాయం: ఆర్.కృష్ణయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు మోదీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని రాజ్యసభ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహా ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి రూ.2,150 కోట్లు కేటాయించారని, వీటితో దేశంలోని 75 కోట్ల బీసీ జనాభాకు చాకెట్లు, బిస్కెట్లు కూడా రావని ఆయన ఎద్దేవా చేశారు. మోదీ సర్కారు బీసీ వ్యతిరేక వైఖరిని వీడనాడాలన్నారు.

ఎన్ఎస్ఎస్ కాంపిటేషన్‌లో.. ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని నాసా నేషనల్ స్పేస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా 12 నుంచి 18 ఏళ్ల విద్యార్థుల కు నిర్వహించిన 'లివ్ ఇన్ ఎ హెల్తీ స్పేస్ డిజైన్' కాంపిటేషన్‌లో తమ సంస్థ ప్రపంచ చాంపియన్‌గా నిలిచిందని శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సీమ ప్రకటించారు. నేషనల్ స్పేస్ సొసైటీ ఫలితాల్లో ప్రపంచవ్యాప్తంగా 47 ప్రాజెక్టులు ఎంపిక కాగా, ఇందులో 28 ప్రాజెక్టులు తమ సంస్థ నుంచే ఎంపికయ్యాయని తెలిపారు. తమ సంస్థ బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలికిందని, కాన్సెప్ఛువల్ మెథడాలజీ, యాక్టివిటీస్, ప్రాక్టికల్‌ఓరియంటెడ్ టీచింగ్‌తో ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

మోకీలు మార్పిడిలో రోబోటిక్ విప్లవం

- నూరు శాతం కచ్చితత్వం.. ఇన్‌ఫెక్షన్ రేట్ జీరో
- ఏపీలో తొలిసారిగా గుంటూరు 'సాయిభాస్కర్'లో

జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడి



రోబోటిక్ సర్జరీ విధానం వివరిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 5: సమీప భవిష్యత్తులో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సల్లో రోబోటిక్ పాత్ర కీలకం కానుందని, దీని ద్వారా చేసే సర్జరీల్లో నూరుశాతం కచ్చితత్వం సాధించవచ్చని సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రము ఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని సాయిభాస్కర్ హాస్పిటల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో కీళ్ల మార్పిడిలో రోబో పనితీరును ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఫుల్లీ ఆటోమ్యాటిక్ రోబోలు 50 వరకు ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి పూర్తిస్థాయి రోబోటిక్ మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలను గుంటూరు సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రారంభించినట్లు నరేంద్రరెడ్డి తెలిపారు. రోబోల సాయంతో ఇప్పటి వరకు 150కిపైగా సర్జరీలు నిర్వహించగా, నూరుశాతం ఫలితాలు సాధించినట్లు చెప్పారు. రోబోటిక్ సర్జరీల్లో ఇంప్లాంట్ అమరిక కచ్చితంగా ఉంటుందని, ఎముక కోత తగ్గి రోగి త్వరగా కోలుకుంటాడని, ఇన్‌ఫెక్షన్ దాదాపు ఉండదని వెల్లడించారు. సమావేశంలో డాక్టర్ మర్రెడ్డి శివారెడ్డి, డాక్టర్ కొనకళ్ల శ్రీనివాస్, డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ యరగూటి సాంబశివారెడ్డి, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

స్కానర్ల బిల్లులపై మాట్లాడతాం

- బేవరేజెస్ కార్పొరేషన్ వివరణ

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్కానర్లకు సంబంధించి డిస్టిలరీలకు ఇవ్వాల్సిన ఇన్వాయిస్‌లపై సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌తో చర్చిస్తామని బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి తెలిపారు. 'ఎక్సైజ్‌లో నిధులు గోల్‌మాల్' పేరుతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ సర్వీసు ప్రొవైడర్‌ను మార్చిన అనంతరం డిస్టిలరీల్లో కొత్త స్కానర్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ స్కానర్ల కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలూ జరగలేదని చెప్పారు. గత డిసెంబరులో సర్వర్ సమస్య తలెత్తిందని, వెంటనే దాన్ని పరిష్కరించి, మద్యం అమ్మకాల లెక్కలన్నీ సరిచేశామని వివరించారు. 2022లో కొనుగోలు చేసిన స్కానర్లకు ఇప్పటికీ బిల్లులు ఇవ్వకపోవడానికి కారణం వివరించలేదు.

గ్రామీ అవార్డుల్లో మనోళ్ల 'శక్తి'



అవార్డును అందుకున్న శంకర్ మహదేవన్, గణేశ్ రాజగోపాలన్, జాకీర్‌హుస్సేన్, సెల్వ గణేశ్

ఐదు పురస్కారాలు సాధించిన భారతీయులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: సంగీత రంగంలో ఆస్కార్లుగా భావించే గ్రామీ అవార్డుల్లో మనోళ్ల సత్తా చాటారు! అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో అంగరంగ వైభోగంగా జరిగిన 2024 గ్రామీ వేడుకల్లో.. ఐదుగురు భారతీయులు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకున్నారు. ఆ ఐదుగురూ.. తబలా మ్యాస్ట్రో జాకీర్‌హుస్సేన్, ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్, వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియా, వాయులీన విద్వాంసుడు గణేశ్ రాజగోపాలన్, పెర్క్యూషనిస్ట్ సెల్వగణేశ్ వినాయక్‌రామ్ ఉన్నారు. వీరిలో జాకీర్ హుస్సేన్ ఏకంగా మూడు గ్రామీలు సాధించగా.. రాకేశ్ చౌరాసియా రెండు పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ విభాగంలో మనదేశానికి చెందిన ప్రముఖ ఫ్యూజన్ బ్యాండ్ శక్తి రూపొందించిన 'దిస్ మూమెంట్'.. పురస్కారాన్ని గెలుచుకుంది. బ్రిటిషర్ జాన్ మెక్‌లాఫ్లిన్ నేతృత్వంలోని ఈ బ్యాండ్‌లో జాకీర్ హుస్సేన్, శంకర్‌మహదేవన్, సెల్వగణేశ్, గణేశ్ రాజగోపాలన్ ఉన్నారు. జాకీర్‌హుస్సేన్‌కు ఈ పురస్కారంతోపాటు.. బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ (పష్తో), బెస్ట్ కాంటెంపరరీ ఇన్‌స్ట్రుమెంటల్ ఆల్బమ్ (యాజ్ వియ్ స్పీక్) విభాగాల్లో మరో రెండు గ్రామీలు వచ్చాయి. కాగా.. గ్రామీ అవార్డు సాధించిన ఐదుగురినీ ప్రధాని మోదీ ట్విటర్ ద్వారా అభినందించారు. తమ అత్యద్భుతమైన ప్రతిభతో, సంగీతం పట్ల అంకితభావంతో వారు గ్రామీ వేదికపై భారతదేశానికి గర్వకారణంగా నిలిచారని, ప్రపంచప్రజల హృదయాలను గెలుచుకున్నారని కొనియాడారు. ఈ అవార్డులు వారి శ్రమకు ఒక గుర్తింపు అని.. సంగీత రంగంలో ఎంతో సాధించాలనే కలలతో వచ్చే భవిష్యత్తు కళాకారులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తారని ప్రశంసించారు. కాగా.. జాకీర్‌హుస్సేన్ 1991, 1996, 2008 సంవత్సరాల్లో కూడా గ్రామీ అవార్డులు గెలుచుకున్నారు. ఇక, 2008లో స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్రానికి అందించిన సంగీతానికిగాను రెండు గ్రామీలు అందుకు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రహ్మాన్.. జాకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్, సెల్వగణేశ్‌తో తీసుకున్న గ్రూప్ సెల్ఫీని ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. గ్రామీ విజేతలను ఆయన అభినందించారు.

ఇండియా కూటమి గెలిస్తే.. రిజర్వేషన్లపై 50% పరిమితి ఎత్తేస్తాం

» దేశవ్యాప్తంగా కులగణన చేపడతాం: రాహుల్



రాంచీ, ఫిబ్రవరి 5: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తే.. కేంద్రంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తుందని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. దళితులు, ఆదివాసీల రిజర్వేషన్లను తగ్గించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయన చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ఝార్ఖండ్ రాజధాని రాంచీలో కొనసాగుతోంది. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్‌ను రాహుల్ సోమవారం పరామర్శించారు. అనంతరం రాంచీలోని షహీద్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. ఝార్ఖండ్ ముఖ్యమంత్రి గిరిజనుడు కావడం వల్లే జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ ప్రయత్నించిందని మండిపడ్డారు.

పేపర్ లీక్‌కు కోటి జరిమానా.. లోక్‌సభలో బిల్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రభుత్వ నియామక పోటీ పరీక్షల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రశ్నపత్రం లేదా జవాబులు లీక్ చేయడం, అభ్యర్థులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడం, నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి మోసగించడం వంటి నేరాలకు పాల్పడిన వారికి కనీసం మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. కోటి వరకూ జరిమానా విధించేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు-2024ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

లఖ్‌నవూ జైలులో 63 మంది ఖైదీలకు హెచ్ఐవీ

లఖ్‌నవూ, ఫిబ్రవరి 5: ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూ జిల్లా జైలులో 63 మంది ఖైదీలకు హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ కావడం కలకలం రేపుతోంది. డిసెంబరులో వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు దాదాపు 36 మందికి సోకినట్లు తేలగా.. తాజాగా ఆ సంఖ్య మరింత పెరిగింది. వీరిలో చాలా మంది ఖైదీలకు డ్రగ్స్ అలవాటుందని, సిరంజీలను ఎక్కించుకునే క్రమంలోనే మహమ్మారి బారిన పడ్డారని అధికారులు తెలిపారు.

వ్యాపారవేత్తలపై ప్రతీకార చర్యలు పెరిగిపోతున్నాయ్: గల్లా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే వ్యాపారవేత్తలపై ప్రతీకార చర్యలు పెరిగిపోతున్నాయని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపార ప్రారంభానికి 70 కంటే ఎక్కువ ఏజెన్సీల నుంచి అనుమతులు తీసుకోవలసి ఉంటుందని, అయితే, ఆ ఏజెన్సీలన్నింటినీ ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకొని వ్యాపారవేత్తలపై ఆయుధాలుగా మలచుకుంటోందని ఆక్షేపించారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. 'ప్రజాప్రతినిధిగా, వ్యాపారవేత్తగా ఒకేసారి రెండు పడవల్లో ప్రయాణించడం సులభం కాదు. అందువల్ల నా రాజకీయ జీవితానికి విరామం ప్రకటిస్తున్నా. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ వ్యాపారవేత్తగా దేశాభివృద్ధికి దోహదపడాలనే దృఢ సంకల్పంతో ఉన్నాను. 14 ఏళ్ల వనవాసం తర్వాత రాముడు తిరిగి వచ్చినట్లే నేను కూడా ప్రజల కోసం తిరిగొస్తాను. 14వ ఆర్థిక సంఘం సిఫారసులను చూపడం ద్వారా మోదీ ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా నుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తోంది. పదేళ్ల హోదా ఇస్తామని మోదీ, వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారు. విశాఖలో రైల్వే జోన్, మెట్రోలైన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రైల్వే జోన్ భూమి విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు భిన్న వాదనలు చెబుతున్నాయి. వీరిలో ఎవరి మాట నమ్మాలి? 2019లో టీడీపీ ప్రభుత్వం గద్దె దిగినప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 75శాతం పూర్తయింది. అయితే, ఇప్పటికీ ఆ ప్రాజెక్టు అలానే ఉంది. పార్లమెంటులో ఇది నా చివరి ప్రసంగం. నాకు ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశమిచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు. క్లిష్ట సమయాలలో ఆయన అండగా నిలిచారు' అని చెప్పారు.

ఈసీలో దొంగలు పడ్డారు!

(మొదటి పేజీ తరువాయి)

ఐ-ప్యాక్ టీమ్‌తో అత్యంత దగ్గర సంబంధాలున్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన వ్యక్తి ఈసీలో ఐటీ ప్రాజెక్టు మేనేజర్‌గా విధులు నిర్వహించారు. కానీ, డేటా సేకరణనే ఆ ఇద్దరూ పనిగా పెట్టుకున్నారు. తమకు సంబంధం లేని విభాగాల్లో కూర్చోవడం, అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవడం వంటివి చేశారు. ఉద్యోగంలో చేరిన తొలి రోజు నుంచే ఏ విభాగంలో ఏం జరుగుతుంది. ఈసీలో ఏఏ విభాగాలు కీలకం అన్న వివరాలన్నీ సేకరించారు. ఈసీలోని కీలక విభాగాల నుంచి డేటా మొత్తం సేకరించారు. మహబూబ్‌నగర్ వ్యక్తి ఈసీలో ఐటీ ప్రాజెక్టు మేనేజర్ కావడంతో డేటా మొత్తం సదరు ఉద్యోగి వద్దనే ఉండేది. ఉన్నతాధికారులు కూడా సదరు వ్యక్తిని పూర్తిగా నమ్మి ఈసీకి సంబంధించిన కీలక వ్యవహారాలు మొత్తం ఆయనకు అప్పగించేశారు. ఈఆర్వోల లాగిన్‌లు,. ఈఈఆర్వోల లాగిన్‌లతో పాటు ఈసీ డేటా మొత్తం తన చేతుల్లో ఆయన తీసుకున్నారు. డేటా మొత్తం చేతుల్లోకి వచ్చిన తర్వాత అకస్మాత్తుగా అతడు ఉద్యోగం మానేశాడు. కేవలం నవంబరు, డిసెంబర్ నెలల్లో మాత్రమే ఈసీలో సదరు వ్యక్తి విధులు నిర్వహించారు. ఈ రెండు నెలల వ్యవధిలోనే ఈసీ సర్వర్‌లో ఉన్న డేటా, హార్డ్‌డిస్క్‌ల్లో ఉన్న డేటా మొత్తం కాపీ చేసుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం ఈసీలో చర్చనీయాంశంగా మారింది. రెండు నెలల వ్యవధిలోనే ఈసీలోని సమాచారాన్నంతా చాప చుట్టేశాడు. అయితే, ఆయన సేకరించిన డేటా ఎక్కడికి తీసుకువెళ్లారు..? ఎవరికి అప్పగించారన్నది వెయ్యి డాలర్ల ప్రశ్నగా మారింది.

డేటా మాయం..: రాష్ట్ర ఈసీ కార్యాలయంలో అసలు ఏం జరుగుతుందో ఎవ్వరికీ అర్థం కావడం లేదు. ఒకవైపు తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టింది. వెంటనే దర్యాప్తు రిపోర్టులు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని గట్టిగానే ఆదేశించింది. సీఈసీ ఆదేశాల మేరకు తిరుపతి ఉప ఎన్నికలకు సంబంధించి దొంగ ఓట్ల వ్యవహారంలో తిరుపతిలో ఏం జరిగింది..? తిరుపతి కలెక్టరేట్‌కు ఈసీకి జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు ఏమిటన్న దానిపై ఈసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. కానీ సీఈసీ అడిగిన డేటా ఏదీ ఇప్పుడు రాష్ట్ర ఈసీలో కనిపించడం లేదు. ఈ డేటా మొత్తం అప్పటి ఉన్నతాధికారులు మాయం చేసినట్లు తెలుస్తోంది. దీనికి ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సహకరించినట్లు తెలుస్తోంది. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రభుత్వంలోని కీలకమైన ఉన్నతాధికారులతో టచ్‌లో ఉంటూ, తిరుపతి ఉప ఎన్నికల్లో చేయాల్సిన అరాచకాలు చేశారు. ఈ విషయాలు మొత్తం బయటకు వస్తాయన్న ఉద్దేశంతో ఈసీ ప్రధాన కార్యాలయంలోకి దూరి డేటా మొత్తం మాయం చేసినట్లు తెలుస్తోంది. 2021, 2022 ఏడాదికి సంబంధించిన డేటా ప్రస్తుతం కనిపించడం లేదు. కంప్యూటర్ హార్డ్‌డిస్కులు, సీఈసీ నుంచి వచ్చిన మెయిల్స్ ఏవీ లేవు. దీంతో సీఈసీ అడిగిన సమాచారం ఏదీ ఈసీ ఇవ్వలేని పరిస్థితి. ఫలితంగా ఈసీ దొంగ ఓట్ల వ్యవహారంపై దర్యాప్తు టీమ్ నుంచి వచ్చిన రిపోర్టు మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఉప ఎన్నికల సమయంలో ఈసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సహాయం తీసుకున్న వైసీపీ, ఇప్పుడు ఐ - ప్యాక్ టీమ్‌తో మరింత డేటా సేకరించింది. ఈ రెండు అంశాలు ఈసీకి తలనొప్పిగా మారాయి.

సోరెన్ సర్కారు ఘన విజయం

47-29 ఓట్లతో నెగ్గిన విశ్వాస పరీక్ష.. దర్యాప్తు సంస్థల దుర్వినియోగం ప్రజాస్వామ్యానికి ముప్పు

» నియంత అహంకారాన్ని ఝార్ఖండ్ బద్దలు కొట్టింది: కాంగ్రెస్

» అవినీతిని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా: హేమంత్



సీఎంగా ఎన్నికైన చంపయి సోరెన్‌ను అభినందిస్తున్న మాజీ సీఎం హేమంత్ సోరెన్

రాంచీ, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఝార్ఖండ్‌లో సీఎం చంపయి సోరెన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో ఘన విజయం సాధించింది. అసెంబ్లీలో 81మంది సభ్యులు ఉండగా సోమవారం నిర్వహించిన బలపరీక్షకు 77మంది హాజరయ్యారు. వారిలో జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతుగా 47మంది, వ్యతిరేకంగా 29మంది ఓటు వేశారు. స్వతంత్ర అభ్యర్థి సరయు రాయ్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. సంకీర్ణ కూటమిలో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ భాగస్వామ్య పార్టీలు కాగా, సీపీఐఎంఎల్(ఎల్) పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే బయటి నుంచి ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేశారు. ప్రతిపక్ష బీజేపీకి చెందిన 26మంది, ఏజేఎస్‌యూ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. జేఎంఎం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను జనవరి 31న మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయడంతో ఆ పార్టీ సీనియర్ నేత చంపయి సోరెన్ ఈనెల 2న సీఎంగా ప్రమాణం చేశారు. బల నిరూపణకు 10 రోజులు గడువిచ్చినా ప్రభుత్వం సోమవారమే బల పరీక్షను ఎదుర్కొంది. విశ్వాస పరీక్ష సందర్భంగా సీఎం చంపయి సోరెన్ మాట్లాడుతూ ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బీజేపీ ప్రయత్నించిందని, హేమంత్ సోరెన్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుందని మండిపడ్డారు. ఈడీ, సీబీఐలను కేంద్రం దుర్వినియోగంచేయడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా ఆయన అభివర్ణించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గంలో ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కాగా అరెస్టయిన మాజీ సీఎం హేమంత్ సోరెన్ కూడా కోర్టు అనుమతితో బలపరీక్షకు హాజరై ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. తనపై మోపిన అవినీతి ఆరోపణలను నిరూపించాలని హేమంత్ బీజేపీకి సవాల్ విసిరారు. అవినీతి ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలగుతానని ప్రకటించారు. తనపై బీజేపీ పన్నిన కుట్రలో రాజ్‌భవన్ పాత్ర ఉందని ఆరోపించారు. 'దేశ చరిత్రలోనే జనవరి31 ఒక చీకటి అధ్యాయం. రాజ్‌భవన్ ఆదేశంతో ఒక సీఎంను అరెస్టు చేశారు. ఝార్ఖండ్‌లో ఒక గిరిజన సీఎం ఐదేళ్లు పాలించడం బీజేపీకి ఇష్టంలేదు. గిరిజనులను బీజేపీ అంటరానివారిలా చూస్తోంది. కేంద్రంలోని బీజేపీ పాలనలో గిరిజనులు, దళితులకు రక్షణ లేదు'అని హేమంత్ సోరెన్ అన్నారు. కాగా ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలుచేస్తూ హేమంత్ సోరెన్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను ఝార్ఖండ్‌హైకోర్టు ఈనెల12కు వాయిదా వేసింది

విశ్వాస పరీక్షలో చంపయి సోరెన్ ప్రభుత్వం ఘన విజయం సాధించడంపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. 'నియంత అహంకారాన్ని ఝార్ఖండ్ బద్దలు కొట్టింది. ఇది ప్రజల గెలుపు. ఇండియా సంకీర్ణ కూటమి ఈరోజు అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గింది' అని ఆ పార్టీ ట్వీట్ చేసింది. ఝార్ఖండ్‌లో ఆపరేషన్ లోటస్ విఫలమైందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు.

సీఎం అరెస్టు సరికాదు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఝార్ఖండ్‌లో సీఎంగా ఉన్న హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయడాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తప్పుబట్టారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. మద్యం విధానం కేసులో ఈడీ విచారణకు కేజ్రీ గైర్హాజరవుతున్న సంగతి తెలిసిందే. మనీలాండరింగ్ ఆరోపణలపై ఇదే తరహాలో పలుమార్లు విచారణకు హాజరవని సోరెన్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఢిల్లీలో సోమవారం ఓ కార్యక్రమానికి హాజరైన కేజ్రీ.. దేశంలో ప్రభుత్వాలను కూల్చుతున్నది, పార్టీలను చీల్చుతున్నది ఎవరో అందరికీ తెలుసని పరోక్షంగా బీజేపీని ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఝార్ఖండ్‌లో ప్రభుత్వం పడిపోతుందేమోనని రెండు రోజుల పాటు వేచి చూశారని.. జేఎంఎం ఎమ్మెల్యేలు చెక్కుచెదరకుండా ఉండడంతో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. మరోవైపు ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న ఆరోపణలపై ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు తనకు జారీ చేసిన నోటీసులను కేజ్రీవాల్ తప్పుబట్టారు. వాటిలో ఎఫ్ఐఆర్ ప్రస్తావనే లేదన్నారు. తమను తాము అవమానించుకుంటూ రాజకీయ నేతలు చెప్పినట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని కేజ్రీ ఆరోపించారు.

లోకం తీరు



హామీలు నెరవేర్చకపోతే ఏంటి? రాముడున్నాడుగా పదండి సార్!

ఆ తహసీల్దార్‌కు ఎమ్మెల్యే సీటు కావాలట!

రూ.100 కోట్లయినా ఖర్చు పెట్టడానికి సిద్ధం

నందిగామలో పోటీకి లైన్ క్లియర్ చేయాలట!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

"నందిగామ ఎమ్మెల్యే సీటు ఇప్పించండి. రూ. 100 కోట్లు దాకా ఖర్చు పెట్టుకుంటాను"..ఓ తహసీల్దారు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి వద్ద తన మనసులోని మాట వెల్లడించిన తీరు ఇది. ఓ ప్రభుత్వ ఉద్యోగి కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధమైన వైనం రాష్ట్ర రెవెన్యూ వర్గాల్లో అతిపెద్ద సంచలనంగా మారింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంపై కన్నేసి ఆయన బలంగానే పావులు కదుపుతున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే అంటే ప్రస్తుత పరిస్థితుల్లో రూ. 50 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాంటిది ఓ సాధారణ తహసీల్దార్ ఎన్నికల బరిలోకి దిగాలనుకోవటం చర్చనీయాంశంగా మారింది. తనకు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ ప్రజా ప్రతినిధి దగ్గర తన మనసులో మాట చెప్పడంగా అది విని ఆ ప్రజా ప్రతినిధి కార్యాలయం నివ్వెరపోయింది. అయితే, సదరు తహసీల్దారు పెద్ద అవినీతి తిమింగలమని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి. తనకున్న పలుకుబడితో ఆ విచారణలను నీరు గార్చుతున్నట్టు సమాచారం. సీసీఎల్ఏ కార్యాలయంలో కూడా ఒకప్పటి తన బాసే ఉండటం కూడా ఆయనకు కలిసివచ్చినట్టు చెబుతున్నారు. ఏకంగా ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేయడానికీ సిద్ధమేనని ఆయన చెబుతుండటంతో రెవెన్యూ వర్గాలే ఆయన బాగోతాన్ని వెల్లడిస్తున్నాయి. సదరు తహసీల్దారు అక్రమాస్తులను తవ్వితీస్తే కట్టల అన కొండలు కనిపించే అవకాశాలున్నాయని చర్చించుకుంటున్నాయి.

ప్రజాస్వామ్య ఖూనీని సహించబోం

» అపహాస్యంగా చండీగఢ్ మేయర్ ఎన్నిక

» ఆర్వోను ప్రాసిక్యూట్ చేయాలి: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: చండీగఢ్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక నిర్వహించిన తీరుపై సోమవారం సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించింది. గత నెల 30న జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికకు ఓటింగ్ హక్కు లేని నామినేటెడ్ సభ్యుడు అనిల్ మాసీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా, ఆప్-కాంగ్రెస్ కూటమికి 20 మంది సభ్యుల బలం ఉంది. ఆ కూటమిదే విజయమని అంతా భావించారు. కానీ, గుర్తులు సక్రమంగా లేకపోవడంతో ఆప్-కాంగ్రెస్ కూటమికి చెందిన ఎనిమిది ఓట్లు చెల్లవని రిట్నరింగ్ అధికారి ప్రకటించారు. దాంతో ఆ కూటమికి చెందిన కులదీప్‌సింగ్‌కు 12 ఓట్లు, బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్‌కు 16 ఓట్లు వచ్చినట్టు తెలిపారు. బీజేపీ అభ్యర్థి విజయం సాధించినట్టు వెల్లడించారు. ఓట్లు చెల్లవని ప్రకటించి రిటర్నింగ్ అధికారి అక్రమాలకు పాల్పడ్డారని, అందువల్ల ఆ ఎన్నికను రద్దు చేయాలని ఓడిపోయిన ఆప్ కౌన్సిలర్ కులదీప్ సింగ్ తొలుత పంజాబ్-హరియాణా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ తిరస్కరణ ఎదురుకావడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఎనిమిది ఓట్లను రద్దు చేసే విషయంలో రిటర్నింగ్ అధికారి ప్రవర్తించిన తీరును తప్పుపట్టింది. బ్యాలెట్ పేపర్లలో ఆయన మార్పులు చేసినట్టు కనిపిస్తోందని, ఆయనను ప్రాసిక్యూట్ చేయాల్సి ఉందని అభిప్రాయపడింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వీడియోను చూసిన ధర్మాసనం, బ్యాలెట్ పేపర్లపైన ఉన్న గుర్తులను ఆయన చెరిపివేస్తున్నట్టు గమనించింది. ఈ ఎన్నికలకు సంబంధించిన మొత్తం రికార్డులు, బ్యాలెట్ పేపర్లు, వీడియోగ్రఫీ, ఇతర పత్రాలన్నింటినీ అందజేయాలని అందజేయాలని పంజాబ్-హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది.

భారత బలగాలు వెళ్లాల్సిందే

» మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 : తమ దేశ సార్వభౌమత్వం విషయంలో రాజీ లేదని, అందులో జోక్యం చేసుకొనేందుకు ఏ దేశాన్ని అనుమతించేది లేదని మాల్దీవుల అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు ఆ దేశ పార్లమెంటులో సోమవారం స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు దేశాలు.. భారత బలగాలు మే 10నాటికి మాల్దీవులను వీడేందుకు అంగీకారానికి వచ్చాయని చెప్పారు. ఈ విషయంలో భారత్‌తో ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముయిజ్జు ప్రసంగాన్ని అక్కడి ప్రధాన ప్రతిపక్షాలయిన ఎండీపీ, డెమొక్రాట్స్.. రెండూ బహిష్కరించాయి. కాగా, 87 మంది భారత సైనికులు మాత్రమే ఆ దేశంలో ఉన్నారు. మానవతా సాయం, అత్యవసర వైద్య చికిత్సకు బాధితుల తరలింపులో సహకరించడమే వీరి పని. ముయిజ్జు అధ్యక్షుడు అయినప్పటి నుంచి భారత బలగాలను పంపించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

హెచ్-4 వీసా ఉంటే.. ఆటోమేటిక్‌గా వర్క్ ఆథరైజేషన్

» హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు, పిల్లలకు అవకాశాలు

» ఏటా సుమారు లక్ష మందికి లబ్ధి

» ఐ1, ఐ2, ఐ3 వీసాలున్నవారికీ చాన్స్

» కీలక బిల్లును ఆమోదించనున్న సెనేట్



వాషింగ్టన్, ఫిబ్రవరి5: అమెరికాలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న హెచ్-1బీ వీసాదారులకు శుభవార్త..! హెచ్-1బీ వీసాదారులపై ఆధారపడే వారికి (భాగస్వామి, పిల్లలు) అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అడ్డంకులు తీరిపోనున్నాయి. హెచ్-4 వీసా ఉన్న డిపెండెంట్లకు ఆటోమేటిక్‌గా 'వర్క్ ఆథరైజేషన్' వర్తించేలా కీలక బిల్లు 'జాతీయ భద్రత ఒప్పందం'ను ఆదివారం అమెరికా సెనేట్లో ప్రవేశపెట్టారు. రిపబ్లికన్లు, డెమోక్రాట్ల మధ్య సుదీర్ఘంగా జరిగిన చర్చల్లో ఈ బిల్లు ఆమోదానికి ఇరువర్గాలు అంగీకరించాయి. దీంతో ఈ బిల్లు ఆమోదం పొందడం లాంఛనమే..! ఈ బిల్లు వల్ల సుమారు లక్ష మందికి లబ్ధి చేకూరుతుందని అంచనా. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వృత్తి నిపుణులకు హెచ్-1బీ వీసాలివ్వడం తెలిసిందే. వారిపై ఆధారపడే భాగస్వాములు, పిల్లల కు హెచ్-4 వీసాలను జారీ చేస్తారు. 21ఏళ్లు దాటాక హెచ్-4 వీసా లేకుంటే అలాంటి పిల్లలు డీపోర్ట్ (తిరిగి స్వదేశానికి పంపడం) అయ్యే ప్రమాదముంటుంది. అలాంటి వారు ఎనిమిదేళ్లకు పైగా డిపెండెంట్‌గా అమెరికాలోనే ఉంటే హెచ్-4 జారీకి మార్గం సుగమమవుతుంది. ఒకవేళ హెచ్-4 వీసా జారీ అయినా అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ నిబంధనల ప్రకారం ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్(ఈఏడీ), ఐ-765 కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తై.. ఆథరైజేషన్ వస్తే తప్ప హెచ్-4 వీసాదారులు ఉద్యోగాలు చేసుకోవడానికి వీల్లేదు. ఈఏడీ రావడానికి కనీసం ఆర్నెల్ల పాటు నిరీక్షించాల్సిందే..! "హెచ్-4 వీసాదారుల ఇబ్బందులను దూరం చేస్తూ ఆటోమేటిక్‌గా ఈఏడీ లభించేలా రూపొందించిన బిల్లుకు ఆమోదముద్ర పడనుంది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఏటా 18 వేల మందికి ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డులు జారీ అవుతాయి. ఇప్పటికే ఉన్న దరఖాస్తులకు ఇవి తోడైతే ఐదేళ్లలో 1.58 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది. పర్యాటకం, వైద్యం, వ్యాపారం వంటి తాత్కాలిక పనుల నిమిత్తం అమెరికాకు వచ్చేవారికి జారీచేసే వలసేతర వీసా (ఐ1, ఐ2, ఐ3)ఉన్న వారిలో ఏడాదికి 25వేల మందికి కూడా తాజా బిల్లుతో ఉద్యోగం చేసుకోవడంలో అడ్డంకులు తొలగిపోతాయి" అని వైట్‌హౌస్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా స్పందించారు. "కొత్తగా తీసుకొస్తున్న బిల్లు వలసదారుల భాగస్వాములు, పిల్లలకు అవకాశాలను మెరుగుపరుస్తుంది. ఈ నిర్ణయం మన దేశాన్ని బలోపేతం చేస్తుంది. సరిహద్దులను సురక్షితం చేస్తుంది. చట్టబద్ధంగా వలసలకు అవకాశం కల్పిస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. 2015లోనే ఒబామా సర్కారు ఈ తరహా నిర్ణయం తీసుకుంది. దాంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో నైపుణ్యం ఉన్న భారతీయులకు కొంతఊరట కలిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన ట్రంప్ ఈ నిర్ణయంపై ఆంక్షలు విధించారు. ఇప్పుడు హెచ్-4 వీసాదారులకు అవకాశాలు కల్పించేందుకు బైడెన్ సర్కారు సిద్ధమవుతుండడం పట్ల హెచ్-4వీసాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాకు 370 సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతల ప్రసంగాలు విన్నప్పుడల్లా వారు చాలా కాలం ప్రతిపక్షంలోనే ఉంటారన్న తన విశ్వాసం మరింత బలపడిందని ఎద్దేవా చేశారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. ఇకపై దశాబ్దాల పాటు ప్రతిపక్షంలో ఉండాలని నిశ్చయించుకున్నట్లుందని ఎద్దేవా చేశారు. దేశానికి బలమైన, ఆరోగ్యవంతమైన ప్రతిపక్షం అవసరమని మోదీ చెప్పారు. కానీ, మంచి ప్రతిపక్షంగా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కాంగ్రెస్ కోల్పోయిందని, ఆ పార్టీ పని చేయదు, ఇతరులను పనిచేయనివ్వదని ఆరోపించారు. పలువురు యువనేతలతోపాటు ఎంతో మంది నాయకులు ఉన్నప్పటికీ, వారు ఎక్కడ తమను మించిపోతారో అన్న భయంతో వారికి అవకాశాలు దక్కకుండా కాంగ్రెస్ అడ్డుకుందని ఆరోపించారు. ఆ పార్టీ.. రాచ కుటుంబాన్ని వింంచి చూడదంటూ గాంధీ కుటుంబంపై విమర్శలు సంధించారు. ఒకే ఉత్పత్తిని మాటిమాటికీ మార్కెట్‌లో ప్రవేశపెడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలతో యావత్ దేశం నష్టపోయిందన్నారు. కాంగ్రెస్ యూపీఏ పదేళ్ల హయాంలో చోటు చేసుకున్న అనేక అవకతవకలను తన తొలి దఫా ప్రభుత్వంలో అరికట్టామని, రెండో దఫాలో నూతన భారత్‌కు పునాది వేశామని మోదీ చెప్పారు. మూడో దఫాలో వచ్చే వెయ్యేళ్లకు అవసరమైన పటిష్ఠమైన పునాది వేస్తామని తెలిపారు. ఈసారి బీజేపీ 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకొందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలను మోదీ ప్రస్తావిస్తూ.. బీజేపీ 370 సీట్లను, ఎన్‌డీఏ 400కిపైగా సీట్లను గెల్చుకుంటుందన్నారు.

నెహ్రూపై విమర్శలు

భారతీయులు సోమరులని, తెలివితక్కువ వారని, వారికి కష్టపడే తత్వం లేదని దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బహిరంగంగా ఎర్రకోట మీది నుంచే చెప్పారని, ఇందిరాగాంధీ కూడా ఆయన కంటే భిన్నమైన నేత ఏమీ కారని మోదీ చెప్పారు. ఇది రాచకుటుంబాల మనస్తత్వమని, నెహ్రూ చేసిన తప్పులకు కశ్మీర్ ప్రజలు మూల్యం చెల్లించారని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు ఓబీసీల ప్రాతినిధ్యం గురించి ప్రస్తావిస్తున్నాయని పేర్కొంటూ, వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఓబీసీలు ఎంతమంది ఉన్నారని అడుగుతారేగానీ, అతిపెద్ద ఓబీసీని చూడరేమిటి? అంటూ ప్రధానినైన తానే స్వయంగా ఓబీసీనని పరోక్షంగా చెప్పుకొన్నారు. నెహ్రూ, ఇందిరలను మోదీ విమర్శించిన సమయంలో కాంగ్రెస్ సభ్యులు ప్రధాని ప్రసంగానికి అడ్డు తగిలారు. పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లు కట్టించామని, ఈ పని చేయటానికి కాంగ్రెస్‌కు వందేళ్లు పట్టేదని మోదీ విమర్శించారు. తన హయాంలో భారత్ ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 11వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరుకుందని, మూడోసారిఅధికారంలోకి వచ్చినతర్వాత, మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారుతుందని పేర్కొన్నారు.

వైసీపీ మళ్లీ వస్తే భయంకరమే!

» మాట తప్పడం ఆయనకే సాధ్యం

» 3 రాజధానులపై అభ్యంతరం తెలిపా

» కొడాలి, అంబటి బెదిరించేలా మాట్లాడారు

» చంద్రబాబు, నారా లోకేశ్‌ను తిట్టకపోతే ఎలా నమ్ముతానని సీఎం జగన్ అన్నారు

» మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత వ్యాఖ్యలు



నందిగామ, ఫిబ్రవరి 5: "మాట తప్పడం, మడమ తిప్పడం సీఎం జగన్‌కే సాధ్యం" అని మైలవరం ఎమ్మెల్యే, వైసీపీ నేత వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. "నేను వైసీపీలో చేరిన రోజే అమరావతిని రాజధానిగా కొనసాగిస్తారా అని జగన్‌ను అడిగా. తన ఇల్లు, ఆఫీసు కూడా ఇక్కడే కట్టానని నమ్మబలికారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పాట మొదలు పెట్టారు. ఇది మాట తప్పడం, మడమ తిప్పడం కాదా?" అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సోమవారం ఆయన పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. జగన్ పాలన ఇంకా కొనసాగితే రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లుతుందని, అందువల్లే తాను పార్టీని వీడాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మూడు రాజధానులను తాను వ్యతిరేకిస్తే.. కొడాలి నాని, అంబటి రాంబాబు బెదిరింపు ధోరణితో మాట్లాడారని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేశ్‌ను దూషించాలని పార్టీ పెద్దలు పలుమార్లు తనపై ఒత్తిడి తెచ్చినట్లు చెప్పారు. ఆ పని చేయకపోవడం వల్ల తనను ఇబ్బందులకు గురి చేశారన్నారు. "ప్రతిపక్షనేతలను తిట్టని నిన్ను ఎలా నమ్మాలి అని.. సాక్షాత్తు జగనే వ్యాఖ్యానించారు" అని వసంత చెప్పారు.



వైసీపీ ఎమ్మెల్యేల్లో కనిపించని జోష్!

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల రూపంలో తమ భవిష్యత్ ఏమిటో అంచనావేస్తున్నందునో ఏమో అధికారపక్ష వైసీపీలో జోష్ కనిపించలేదు. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ఆద్యంతం జగన్మోహన్‌రెడ్డి పాలనను ప్రశంసిస్తూ సాగింది. కానీ అధికార సభ్యుల్లో జోష్ మాత్రం కనిపించలేదు. ఆనందంగా చప్పట్లు కొట్టిన, బల్లలు చరిచిన మోతా వినిపించలేదు. ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించడం, స్థానాలను మార్చేయడం వంటి కారణాల నేపథ్యంలో వీరంతా ముభావంగా సభలో కూర్చున్నారు. ఎమ్మెల్యేలు చెన్నకేశరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, తిప్పేస్వామి తదితరులు అంటీముట్టనట్లు వ్యవహరించారు.



ప్లకార్డులతో అసెంబ్లీకి ర్యాలీగా వెళుతున్న టీడీపీ ప్రజాప్రతినిధులను అడ్డుకున్న పోలీసులు

టీడీపీ సభ్యులను అడ్డుకున్న పోలీసులు

- నినాదాలు, ప్లకార్డులు లేకుండా వెళ్లాలంటూ హుకుం
- ఖాకీల తీరుపై తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మండిపాటు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల తొలిరోజు సభకు ప్రదర్శనగా బయలుదేరిన టీడీపీ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. నినాదాలు చేయకుండా, ప్లకార్డులు లేకుండా వెళ్లాలంటూ బ్యారికేడ్లు అడ్డుపెట్టడంపై తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మండిపడ్డారు. సోమవారం రాజధానిలోని వెంకటపాలెం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేసి, నివాళులర్పించిన టీడీపీ సభ్యులంతా కలసికట్టుగా అసెంబ్లీకి బయలుదేరారు. వెలగపూడిలోని ఫైర్ స్టేషన్ దగ్గర నుంచి 'ధరలు ఆకాశంలో... పేదలు పాతాళంలో..!' అనే బ్యానర్, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ పలు ప్లకార్డులను పట్టుకుని, బై బై జగన్ అంటూ నినాదాలు చేస్తూ టీడీపీ సభ్యులు అసెంబ్లీకి బయలుదేరారు. ఆ మార్గంలో బ్యారికేడ్లు అడ్డు పెట్టిన పోలీసులు వారిని నిలువరించారు. ఆ క్రమంలో పోలీసులకు... ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. టీడీపీ నేతల ప్రదర్శనను కవర్ చేస్తున్న మీడియానూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసుల తీరుపై టీడీపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వస్తుంటే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలనే అడ్డుకుంటారా? అంటూ మండిపడ్డారు. ప్లకార్డులు తీసేయాలని, నినాదాలు చేయకుండా వెళ్లాలని ఓ పోలీస్ అధికారి ఆదేశించడంపై టీడీపీ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యమేనా? ప్రజాప్రతినిధుల హక్కులనూ కలరాస్తారా? అంటూ మండిపడ్డారు. గొడవ పెద్దది అవుతుండడంతో పోలీస్ ఉన్నతాధికారుల సూచన మేరకు టీడీపీ సభ్యులను వదిలారు. ఎమ్మెల్యేలు రాకపోకలు సాగించే అసెంబ్లీ గేటు వద్ద మరో పోలీస్ బృందం వారిని మళ్లీ అడ్డుకుంది. దీంతో పోలీసులపై టీడీపీ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో మీడియాను అడ్డుకొని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోపలికి వెళ్లాలని పోలీస్ అధికారులు కోరారు.

గవర్నర్‌తో అసత్యాలు పలికించారు: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రసంగమంతా అబద్ధాలు, అర్ధ సత్యాలు, అభూత కల్పనలు, అంకెల గారడీనే అంటూ టీడీపీ సభ్యులు మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగ సారాంశాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన వారు సభ నుంచి వాకౌట్ చేసి వెళ్లిపోయారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై మంగళవారం అసెంబ్లీ, మండలి వేదికగా ప్రజలకు వాస్తవాలు చెప్పి, ఆయన ప్రసంగంలోని తప్పులని ఎత్తిచూపుతామని స్పష్టం చేశారు. సభ నుంచి వాకౌట్ చేసిన తర్వాత అసెంబ్లీ బయట టీడీపీ సభ్యులు మీడియాతో మాట్లాడారు. టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ... 'శాసన సభలో గవర్నర్ ప్రసంగమంతా నిస్సారంగా, నిస్తేజంగా ఉంది. లేనిది ఉన్నట్లుగా భూతద్దంలో చూపే ప్రయత్నం చేశారు. 36 పేజీల ప్రసంగపాఠంలో వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుంచడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది' అని అన్నారు.

అవే అబద్ధాలు..

గవర్నరు నోట అసత్యాలు పలికించిన సర్కార్

బడ్జెట్ ప్రసంగం నిండా అంకెల ఆర్భాటమే నవరత్నాల డబ్బాతో నిండిన ప్రసంగ ప్రతి

- విద్యాకానుక, వసతిదీవెనపై తప్పుడు లెక్కలు
- సీఎం సొంత జిల్లాలోనే తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు
- కానీ, కోటలుదాటిన జల్‌జీవన్ మిషన్ లెక్కలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం చేసిన బడ్జెట్ ప్రసంగంలో అంకెల ఆర్భాటాలు, అబద్ధాలు తప్ప వాస్తవాలు లేవని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 34 పేజీల పుస్తకాన్ని గవర్నర్‌తో చదివించిన ప్రభుత్వం, అందులో చెప్పినవన్నీ లెక్కల ఆడంబరాలనీ, క్షేత్రస్థాయిలో జగన్ ప్రభుత్వం తీరుపై జనాలు సంతృప్తిగా లేరని చెబుతున్నారు. ప్రతి బడ్జెట్ ప్రసంగంలోనూ నవరత్నాల డప్పు మోగిస్తూనే ఉన్నారు. పైగా ఈసారి మానవవనరుల అభివృద్ధి, విద్యాభివృద్ధి నినాదం తెచ్చినట్టు గవర్నర్ నోట చెప్పించడం గమనార్హం. అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్కపైసా కేటాయించకుండా మానవాభివృద్ధి సాధించామంటూ సర్కారు వల్లించడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. అమ్మఒడి ద్వారా తల్లుల ఖాతాల్లో జమ చేసేది రూ. 13 వేలు. పాఠశాల నిర్వహణ వ్యయం కోసమని రెండు వేలు కోత పెడుతున్నారు. కానీ, ప్రభుత్వం తన బడ్జెట్ ప్రసంగంలో మాత్రం రూ.15 వేలు అమ్మల ఖాతాల్లో వేస్తున్నట్టు చెప్పుకొంది. జగనన్న విద్యాకానుక ద్వారా లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చామని చెప్పుకొన్నారు. కానీ, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టిన విషయం, ఇప్పటికే ఇంజనీరింగ్ విద్యార్థులకు నాలుగు విడతలు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకుండా మొండిచేయి చూపిన విషయం బడ్జెట్ ప్రసంగంలోకి రాకుండా జాగ్రత్తపడ్డారు. జగనన్న వసతి దీవెన పథకం అమల్లోకి తెచ్చిన సర్కారు, నాలుగన్నరేళ్లుగా విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.90 వేలు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.30 వేలు మాత్రమే మూడు దఫాలు చెల్లించి చేతులు దులుపుకొన్న వైనమూ దాచేశారు. దీనికి భిన్నంగా విద్యాదీవెన అంశాన్ని బడ్జెట్ ప్రసంగంలో గొప్పగా చెప్పుకొన్నారు. ఏపీలో ఇంగ్లీషు మీడియం గతంలో ఎన్నడూ లేనట్టు, జగన్ సర్కార్ వచ్చిన తర్వాత అమల్లోకి తెచ్చినట్టు బడ్జెట్ ప్రసంగంలో సర్కారు డబ్బాలు కొట్టుకుంది. అయితే, సర్కార్ రాష్ట్రంలో ఏ పాఠశాలలో అయినా ఇంగ్లీషు బోధించే వాతావరణాన్ని కల్పించిందా అని పలువురు నిలదీస్తున్నారు. నాయీ బ్రాహ్మణులకు స్వయం ఉపాధి రుణాలు ఎగ్గొట్టి 'చేదోడు'ను జగన్ ప్రభుత్వం తెచ్చింది. వాహన మిత్ర ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ప్రభుత్వం ఇస్తోంది. అదే సమయంలో చలానాలు, జరిమానాల రూపంలో అంతకంటే ఎక్కువగా వారిని బాదేస్తోంది. 'జగనన్న తోడు పథకం'లో ఎడాపెడా పేర్లు చేర్చినా.. అసలు లబ్ధిదారులకు ఈ ఫలాలు అందడం లేదు. ఇప్పటికే రుణాలు పొందుతున్న డ్వాక్రా గ్రూపులే ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారేతప్ప వీధి వ్యాపారులకు ఈ పథకం అమలు కావడం లేదని సర్వత్రా ఆరోపణలున్నాయి. వైఎస్‌ఆర్ కల్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీ తోఫా పథకాలు మూడేళ్ల తర్వాత అమల్లోకి తెచ్చి లబ్ధిదారుల సంఖ్యను అమాంతం తగ్గించేందుకు నిబంధనలు అమల్లోకి తెచ్చారు. గతంలో ఉన్న విదేశీ విద్యను రద్దు చేసి కొత్తగా మూడేళ్ల తర్వాత అమల్లోకి తెచ్చిన సర్కారు, రకరకాల నిబంధనలతో లబ్ధిదారుల సంఖ్యను కుదించింది. ఇప్పుడు ఆ ఊసే బడ్జెట్‌లో పేర్కొనలేకపోయింది. కేంద్ర పథకం జల్‌జీవన్ మిషన్ పథకాన్ని వినియోగించుకోవాల్సిన సర్కార్, రాష్ట్ర వాటా అందించకపోవడంతో ఆ నిధులు మురిగిపోయిన విషయం బడ్జెట్ ప్రసంగంలో కనిపించకుండా దాచేశారు. తాగునీటి ఇక్కట్లతో దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న రాయలసీమ జిల్లాల్లో తాగునీటి సరఫరా కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోవడంతో ధర్నాలు కూడా చేశారు. అయినా జల్‌జీవన్ మిషన్ పనుల లెక్కలు మాత్రం కోటలు దాటాయి. తాగునీటి ప్రాజెక్టులను గురించి గొప్పలు చెప్పించిన సర్కార్, ముఖ్యమంత్రి సొంత జిల్లా అన్నమయ్య ప్రాజెక్టు పరిస్థితిని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం.



మానవాభివృద్ధికి మెరుగులు

ప్రమాణాలు పెంచడానికి నవరత్నాలు

- పాఠశాలల్లో మౌలికవసతులకు నాడు-నేడు
- వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు చర్యలు
- సామాజిక భద్రతలో భాగమే దిశ చట్టం
- శాసనసభలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మానవాభివృద్ధి సూచిక ప్రమాణాలను పెంచడానికి తమ ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. సోమవారం అమరావతి శాసనసభలో ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ప్రభుత్వం మానవాభివృద్ధి సూచిక ప్రమాణాలను పెంచడానికి నవరత్నాలను ప్రారంభించిందన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా సాధికారితపై దృష్టి సారించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ అసాధారణ పనితీరు, పేదల అనుకూల పథకాలు, విధానాల ద్వారా అందించిన సానుకూల, స్పష్టమైన ఫలితాలు కంటి ముందు కనిపిస్తున్నాయని తెలిపారు. విద్యపై పెట్టుబడి ఎప్పుడూ అత్యధిక రాబడిని ఇస్తుందని నమ్మిన తమ ప్రభుత్వం, ప్రత్యేకంగా ఇప్పటి వరకు రూ.73,417 కోట్లు ఈ రంగంపై ఖర్చు చేసిందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు మన బడి, నాడు-నేడు కార్యక్రమాల ద్వారా రూ.7163 కోట్లు వ్యయం చేశామని తెలిపారు. విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థుల ఆకాంక్షలకు మద్దతిస్తూ గత పది నెలల్లో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద రూ.107.08 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేశామన్నారు. సామాజిక భద్రతలో భాగంగానే దిశా చట్టం రూపొందించామన్నారు. "సమాజ పురోగతి అత్యంత దుర్బలమైన, బలహీనుల స్థితిని బట్టి నిర్ణయించబడాలి. అభివృద్ధి అంచులకు దూరంగా ఉన్న వారిని నిజమైన అభివృద్ధి కోసం ఇతరుల స్థాయికి తీసుకురావాల్సి ఉంది" అన్న గాంధీజీ పలుకులతో గవర్నర్ తన బడ్జెట్ ప్రసంగం ముగించారు.

ప్రశ్నోత్తరాలు ఎలాగూ ఉండవ్..

ఓటాన్ అకౌంట్‌కు 4 రోజులు చాలవా?

- బీఏసీలో సీఎం జగన్ ప్రశ్న.. చాలన్న మంత్రులు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ప్రశ్నోత్తరాలు ఎలాగూ ఉండవు.. పూర్తి బడ్జెట్ సమావేశాలు కావు.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్టేగా.. నాలుగు రోజులు చాలవా..? మనం ముందు మూడు రోజులనుకున్నాం. ఒక రోజు అదనంగా ఎనిమిదో తేదీ దాకా పెడతాం. సమయం సరిపోతుందిగా' అని సీఎం వైఎస్ జగన్ మంత్రులను అడిగారు. వారు కూడా చాలని ముక్తాయించడంతో గురువారం (8వ తేదీ) వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం ఉభయసభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించాక.. సభాపతి తమ్మినేని సీతారాం అధ్యక్షతన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశమైంది. సభానాయకుడు జగన్, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, వైసీపీ అసెంబ్లీ సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ప్రతిపక్షం సీటు వైపు జగన్ చూసినప్పుడు.. బీఏసీ భేటీని టీడీపీ బాయ్‌కాట్ చేసిందని మంత్రులు చెప్పారు. ఆ సందర్భంగా ఆయన పై వ్యాఖ్యలు చేశారు. దీంతో రెండే నిమిషాల్లో బీఏసీ భేటీ ముగిసింది. ఆమోదించిన ఎజెండా ప్రకారం.. మంగళవారం ఉదయం సభలో సంతాప తీర్మానాలు ఉంటాయి. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ప్రవేశపెడతారు. చర్చ తర్వాత మధ్యాహ్నం సీఎం సమాధానమిస్తారు. ఇక బుధవారం ఉదయం 11 గంటలకు మంత్రి బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడుతుంది. గురువారం బడ్జెట్‌పై చర్చ జరుగుతుంది. బుగ్గన సమాధానం ఇస్తారు. అనుబంధ పద్దులపై ఓటింగ్ జరుగుతుంది. తర్వాత 2024-25 ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెడతారు. మూజువాణి ఓటుతో దానిని సభ ఆమోదిస్తుంది.

నిరసనల నడుమే గవర్నర్ ప్రసంగం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో సభ ప్రారంభమయింది. ఆయన ఉదయం 10.15 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను ఆయన ప్రస్తావిస్తున్నంత సేపూ టీడీపీ సభ్యులు... 'మెగా డీఎస్సీ ఏది..?, నాడు - నేడు ఎక్కడ..?, మద్యపాన నిషేధం ఎక్కడ...?, రైతు భరోసా కేంద్రాలు దగా...' అంటూ వ్యాఖ్యానాలు చేస్తూనే ఉన్నారు. అయినా గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. 11 గంటలకు సభలో లేచి నిలబడిన టీడీపీ సభ్యులు మూడు నిమిషాలపాటు ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. బై.. బై.. జగన్ అంటూ ప్లకార్డులు చూపిస్తూ ఇవే జగన్‌కు చివరి అసెంబ్లీ సమావేశాలంటూ సభ నుంచి బయటకు వచ్చేశారు. అదే సమయంలో వైసీపీ సభ్యులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఇరుపక్షాల నినాదాల మధ్యనే గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.



ఒంగోలు లోక్‌సభ పరిధిలోని వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులతో విజయవాడలో సమావేశమైన చెవిరెడ్డి

ఒంగోలు ఎంపీ పరిధిలో ఒక్క తాటిపై నడుస్తాం: చెవిరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులంతా ఒక్క తాటిపై నడుస్తామని పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఎంపీ స్థానంలో ఆయనే పోటీ చేయనున్న సంగతి తెలిసిందే. సోమవారం విజయవాడలో ఒంగోలు లోక్‌సభ పరిధిలోని వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి (ఒంగోలు), మంత్రి ఆదిమూలపు సురేశ్ (కొండపి), ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు (మార్కాపురం), కుందూరు నాగార్జునరెడ్డి (గిద్దలూరు), మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి (దర్శి), తాటిపర్తి చంద్రశేఖర్ (యర్రగొండపాలెం), దద్దాల నారాయణ (కనిగిరి)తో ఆయన సమావేశమయ్యారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా జరిగిన ఈ భేటీలో.. అంతా ఒక్కటిగా నిలిచి విజయం సాధించాలన్న నిర్ణయానికి వచ్చారు. మొన్నటి వరకూ చెవిరెడ్డిని వ్యతిరేకిస్తూ వచ్చిన బాలినేని ఈ భేటీకి హాజరయ్యారు. అనంతరం చెవిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. తామంతా ఒక్కటేనని చెప్పారు.

ఆ అభియోగాలు మాకు వర్తించవు

- స్పీకర్‌కు నలుగురు వైసీపీ ఎమ్మెల్యేల జవాబు
- మరోసారి ఫిర్యాదు చేసిన ప్రభుత్వ చీఫ్ విప్
- ఎల్లుండి హాజరు కావాలని తమ్మినేని నోటీసులు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): "పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డామంటూ మీరు మోపిన అభియోగాలు మాకు వర్తించవు" అని వైసీపీ నుంచి సస్పెండ్ అయిన నలుగురు ఎమ్మెల్యేలు స్పీకర్ తమ్మినేని సీతారాంకు తేల్చిచెప్పారు. "మీ షోకాజ్ నోటీసులో పేర్కొన్న వాటితో మాకు సంబంధం లేదు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద మాపై అనర్హత వేటు వేసేంత తప్పేమీ మేం చేయలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ సూచించిన అభ్యర్థికే మేం ఓటేశాం. పార్టీ ఎందుకు సస్పెండ్ చేసిందో మాకు తెలియదు" అని వైసీపీ ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి సమాధానం పంపారు. మరో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి సోమవారమే స్పీడ్‌పోస్టు ద్వారా స్పీకర్ నుంచి నోటీసులు అందాయి. దీంతో ఆయన వెను వెంటనే సభాపతికి అడ్వొకేట్ ద్వారా సమాధానం పంపారు. కాగా.. తమ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ సభాపతికి మరోసారి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఫిర్యాదు చేశారు. ఈ నెల 8న వ్యక్తిగతంగా షోకాజ్ నోటీసుకు వివరణ ఇవ్వాలని వారికి సభాపతి నోటీసును ఇచ్చారు.

జగన్‌తో అవనిగడ్డ వైసీపీ ఇన్‌చార్జి భేటీ

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా అవనిగడ్డ అసెంబ్లీ స్థానానికి తనను ఇన్‌చార్జిగా ప్రకటించినప్పటి నుంచి అందుబాటులో లేకుండా పోయిన సింహాద్రి చంద్రశేఖరరావు సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. ఆయన వెంట కుమారుడు రామ్‌చరణ్ ఉన్నారు. కాగా, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వచ్చి.. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయరెడ్డితో సమావేశమయ్యారు. పరుచూరు సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్, అనంతపురం, శ్రీశైలం ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కోడుమూరు (ఎస్సీ) ఇన్‌చార్జి ఆదిమూలపు సతీశ్, సిటింగ్ ఎమ్మెల్యే సుధాకర్, ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా సీఎంవోకు వచ్చారు.



ఏలూరు జిల్లా చింతలపూడిలో చంద్రబాబు బహిరంగ సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు

వచ్చే ఎన్నికల్లో జగన్ X జనం!

- అరాచక పాలనపై తిరుగుబాటు మొదలు: చంద్రబాబు
- గొండుపాలెం, చింతలపూడిలో 'రా..కదలిరా' సభలు

కె.కోటపాడు/అనకాపల్లి/ఏలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జగన్ అరాచక పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఇది ఎన్నికల నాటికి మరింత పెరిగి తుపానుగా మారి ఆయన కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టంచేశారు. వచ్చే ఎన్నికలు ఆయనకు, ప్రజలకు మధ్య యుద్ధమని ప్రకటించారు. ఆయన్ను ఇంటికి పంపడానికి జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెం, సాయంత్రం ఏలూరు జిల్లా చింతలపూడిలో 'రా...కదలిరా' బహిరంగ సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా భ్రష్టు పట్టించిన సైకోను ఇంటికి పంపించకపోతే పరిస్థితులు మరింత దారుణంగా తయారవుతాయని హెచ్చరించారు. 'ఏటా జాబ్ కేలెండర్‌కు ఎందుకు బటన్ నొక్కలేదు? రోడ్ల బాగు కోసం ఎందుకు బటన్ నొక్కలేదు? రైతుల ఆత్మహత్యలు ఆపడానికి, మెగా డీఎస్సీ కోసం ఎందుకు బటన్ నొక్కలేదు' అని నిలదీశారు. రానున్న ఎన్నికల్లో ఓటు బటన్ నొక్కి, జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మద్యని షేధం, సీపీఎస్ రద్దు అంటూ బుగ్గలు నిమిరి హామీలిచ్చి.. గద్దెనెక్కాక మరచిపోయాడని ఆక్షేపించారు. నకిలీ మద్యం తాగి 30 వేల మంది చనిపోయారని, 30 లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

> **సలహాదారుకు రూ.150 కోట్లా?**
>
> సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి జీతంగా రూ.150 కోట్లు ఇచ్చిన జగన్.. ఉచిత సలహాల కోసం రూ.700 కోట్లు ఖర్చుచేశాడు. సొంత రోతపత్రికకు ప్రకటనల రూపేణా రూ.1,000 కోట్లిచ్చాడు. రాష్ట్రాన్ని ప్రాంతాల వారీగా విభజించి నలుగురు రెడ్లకు అప్పగించాడు. ఇదేనా సామాజిక న్యాయం?

ఉత్తరాంధ్ర ఖాళీ..

జగన్ ధనదాహానికి ఉత్తరాంధ్ర మొత్తం ఖాళీ అయింది. నాలుగున్నరేళ్లలో ఊడ్చేశాడు. విశాఖపట్నంలో రుషికొండకు గుండు కొట్టించి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడు. టీడీపీ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎన్నో కంపెనీలను తీసుకొస్తే.. జగన్ విశాఖను కబ్జాల కేంద్రంగా మార్చేశాడు. కార్తీకవనం, జేపార్కు, దసపల్లా భూములు, సీబీసీఎన్‌సీ, ఎన్‌సీసీ, హయగ్రీవ భూములను అడ్డంగా దోచేశాడు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును అటకెక్కించాడు. రైల్వే జోన్‌కు భూమి ఇవ్వకుండా అడ్డుకుంటున్నాడు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు పూర్తిగా సహకరిస్తున్నాడు. యువతను చిత్తు చేసే ప్రమాదకరమైన గంజాయికి ఉత్తరాంధ్రను హబ్‌గా మార్చేశాడు. గంజాయిని తరలిస్తూ, విక్రయిస్తూ ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో పట్టుబడడం సిగ్గుచేటు. విశాఖలో ఎంపీ కుటుంబ సభ్యులనే కిడ్నాప్ చేశారు. తహసీల్దార్ రమణయ్యను ల్యాండ్ మాఫియా పొట్టన పెట్టుకుంది. జగన్ విశాఖ రావొద్దని ఉత్తరాంధ్ర ప్రజలే అంటున్నారు. ఈ ప్రాంతంలో బంగారం పండించే భూములున్నాయి. కానీ సాగునీరు అందుబాటులో లేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి టీడీపీ హయాంలో రూ.2 వేల కోట్లు కేటాయిస్తే, జగన్ హయాంలో పనులు పడకేశాయి.

అభ్యర్థులు దొరక్క..

ఇప్పుడు వైనాట్ పులివెందుల అనే పరిస్థితి నెలకొంది. జగన్‌కు అభ్యర్థులు దొరక్క గందరగోళంలో పడి అటూ ఇటూ ఇష్టానుసారం మారుస్తున్నాడు. నాతోపాటు అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, అనితపై తప్పుడు కేసులు పెట్టాడు. పది రూపాయలు ఖర్చు చేసి వంద రూపాయలు దోపిడీ చేసిన గజదొంగ జగన్.

రాజధానికి కుల ముద్ర

ఆదాయం పెరగాలంటే రాష్ట్రానికి అమరావతి వంటి రాజధాని అవసరం. 35 వేల ఎకరాలను రైతులు ఇస్తే, మొదలుపెట్టిన నిర్మాణాన్ని.. జగన్ కుల ముద్ర వేసి నాశనం చేశాడు. ఇవాళ రేపు రాజకీయాల్లో నానీలు పెరిగిపోయారు. ఈ మధ్యే బందరు నాని హోటల్ సర్వర్ అయ్యారు. చివరకు యువతను కూడా సర్వర్లుగా చేస్తారేమో! సైకో అరాచక పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయింది. టీడీపీ- జనసేన ప్రభుత్వం అభివృద్ధిపథంలో నడుపుతుంది. ఇప్పుడున్న సంక్షేమ పథకాలకు అదనంగా మరిన్ని ఇస్తా. కుటుంబాలను బాగుచేసే బాధ్యత ఆడబిడ్డలకు అప్పగిస్తా. ప్రతి ఒక్క బీసీకి అండగా ఉంటా. 3 నెలలు పింఛను తీసుకోకపోయినా సరే ఇంటికొచ్చి మరీ అందించేలా చర్యలు తీసుకుంటాం. పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తాం. ఆ జాగాలో ఇల్లు కూడా కట్టిస్తాం.

> **సోనియా కాళ్లపై జగన్**
>
> బెయిల్ ఇప్పించాలని ఈ పులివెందుల పులి సోనియాగాంధీ కాళ్లు పట్టుకున్నాడు. ఆ విషయం నేను కాదు.. షర్మిలే అంగీకరించింది. మీ ఇంటి రహస్యాలు మీరే చెప్పుకొంటూ.. నా మీద పడితే ఏం లాభం? తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని పులివెందుల పంచాయితీలు చేసిన జగన్ లక్ష కోట్ల అవినీతి చేయలేదా? రూ.42 వేల కోట్ల అవినీతి జరిగిందని సీబీఐ, ఈడీ చార్జిషీట్లు నమోదు చేయలేదా? చివరకు చనిపోయిన వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఆ చార్జిషీటుల్లో పెట్టాలని తన లాయర్లతో అఫిడవిట్లు వేయించలేదా? ఇలాంటి కొడుకు ఎవరికీ ఉండకూడదు. తోడబుట్టిన చెల్లిని, కన్న తల్లినే వదిలిపెట్టని జగన్ జనాన్ని మాత్రం వదిలిపెడతాడా? నన్ను ఎన్ని సార్లు వేధించినా బాధపడని నేను.. బయటకు కూడా రాని నా భార్యను అవమానిస్తే చాలా బాధపడ్డాను. ఐదేళ్లలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కిపోయింది. ఇంకా 64 రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయి. టీడీపీ-జనసేన గెలవడం, వైసీపీ ఇంటికి పోవడం ఖాయం.

> **అర్జునుడు కాదు.. అక్రమార్జునుడు**
>
> తాను అర్జునుడినని ఇటీవల జగన్ చెప్పుకొన్నాడు, డబ్బుల మీద డబ్బులు పంపిస్తున్నానని అంటున్నాడు. డబ్బులు కాదు నాయనా.. దెబ్బ మీద దెబ్బ వేస్తున్నాడు. అక్రమార్జనతో జేబులు నింపుకొంటున్నాడు. సొంత బ్రాండ్ల ఒక్కో క్వార్టర్ బాటిల్ మీద నెలకు రూ.4,500 ఈ జలగ మింగేస్తోంది. పెట్రోల్, డీజిల్, కందిపప్పు, చింతపండు, పంచదార.. చివరకు కేబుల్ టీవీ ధరలను వందల శాతం పెంచేసి సామాన్యుడిపై రూ.లక్షల భారం మోపుతున్నాడు. కరెంటు చార్జీలు 9 సార్లు.. రూ.64 వేల కోట్ల వరకు పెంచాడు. ఒక్క ఇసుక ధర పెంపుతోనే భవన నిర్మాణ రంగంలో 40 లక్షల మంది రోడ్డున పడ్డారు. ఈ ప్రభుత్వం వల్ల మీరు (ప్రజలు) ఎంత నష్టపోయారో ఆ జలగకు లెటర్ రాయండి. లెటర్ రాసి, బటన్ నొక్కండి. ఎన్నికల్లో ఉతికి ఆరేయాలి.

నిబద్ధతతో పని చేస్తారని విశ్వసిస్తున్నాం

- రాష్ట్ర ఎన్నికల అధికారులను ఉద్దేశించి హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్య
- ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లేందుకు పిటిషనర్లకు వెసులుబాటు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేసే క్రమంలో సరైన స్ఫూర్తి, నిబద్ధతతో వ్యవహిస్తారని విశ్వసిస్తున్నట్టు హైకోర్టు వ్యాఖ్యానించింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు చట్ట నిబంధనలకు లోబడి ఓటర్ల జాబితా సిద్ధం చేయడమే కీలకమని లక్ష్మీచరణ్ సేన్ కేసులో సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. నిబంధనలకు లోబడి ఓటర్ల జాబితా సిద్ధం చేయకుంటే వాటికి పవిత్రత ఉండదని, తదనతరం నిర్వహించే ఎన్నికలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించవని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని ప్రస్తావించింది. పర్చూరు నియోజకవర్గంలో పరిధిలో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జనవరి 5న తాము మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకముందే పిటిషనర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల అధికారులు వెకేట్ స్టే పిటిషన్‌తో జత చేసిన వివరాలను పరిశీలిస్తే అర్థమవుతోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. జాబితా నుంచి ఓట్లను తొలగిస్తూ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ చట్టబద్ధంగా అప్పీల్ వేసుకునేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. అప్పీల్ దాఖలు చేసిన మూడు వారాల్లో దానిని పరిష్కరించాలని, అప్పిలేట్ అథారిటీకి స్పష్టం చేస్తూ వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. జయసూర్య ఇటీవల తీర్పు ఇచ్చారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, సంబంధిత ఓటర్ల నుంచి వివరణ తీసుకోకుండా ఫారం-7 ఆధారంగా ఇష్టారీతిన తమ పేర్లను తొలగిస్తున్నారంటూ కొందరు పిటిషన్లు వేశారు. వీరిలో బాపట్ల జిల్లా, పర్చూరు నియోజకవర్గంలోని తిమ్మరాజుపాలెం ప్రాంతానికి చెందిన బి. గౌతమి మరో 10 మంది ఉన్నారు. అలాగే నియోజకవర్గం పరిధిలోని అన్నంబొట్ల వారి పాలెం, తిమ్మరాజుపాలెం, దేవరపల్లి, బోడవాడ, అడుసుమల్లి, నాగులపాలెం గ్రామాలకు చెందిన మరికొందరు ఓట్ల తొలగింపుపై పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వైఖరిని తీవ్రంగా తప్పుపట్టింది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం ఈఆర్‌వో జారీ చేసిన ఉత్తర్వులు, పిటిషనర్లకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన సమాచారంపై తేదీలు పేర్కొనక పోవడాన్ని ఆక్షేపించింది. తుది ఓటర్ల జాబితా నుంచి పిటిషనర్ల పేర్లను తొలగించవద్దని అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు.

అసెంబ్లీ ప్రాంగణంలో యథేచ్ఛగా ఖాకీలు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శాసనమండలి, శాసన సభ సంపూర్ణంగా చైర్మన్, సభాపతి నియంత్రణలో ఉంటాయి. శాసనసభలోనికి ఎవరూ మారణాయుధాలతో ప్రవేశించకూడదు. పోలీసు ఉన్నతాధికారులు కూడా విధి నిర్వహణలో భాగంగా పోలీసు డ్రెస్‌లో రాకూడదన్న నిబంధన ఉంది. ఒకవేళ వచ్చినా తలపై టోపీని, చేతిలో లాఠీని, నడుముకు తగిలించిన తుపాకీని అసెంబ్లీ సిబ్బంది వద్ద ప్రత్యేకంగా డిపాజిట్ చేయాలి. అలా చేయకుండా యథేచ్ఛగా అసెంబ్లీ ప్రాంగణంలో సంచరించేందుకు నియమ నిబంధనలు అంగీకరించవు. అలా చేయడాన్ని శాసనసభను అగౌరవపరచినట్టుగా భావిస్తారు. అయితే సోమవారం కొందరు పోలీసు ఉన్నతాధికారులు ఈ నియమ నిబంధనలను గాలికి వదిలేశారు. ఎవరు ఇచ్చిన ధైర్యమో ఏమో... కొందరు ఐపీఎస్ అధికారులు, సీఐ, ఎస్ఐ ర్యాంకు అధికారులు తలపై టోపీ, చేతిలో లాఠీతో అసెంబ్లీ ప్రాంగణంలో కలియతిరుగుతూ కనిపించారు. ఇది గమనించిన కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆశ్చర్యపోయారు. దీనిపై చైర్మన్, సభాపతి తక్షణమే స్పందించాలని, ఖాకీలు ఆయుధాలను గేటు వద్దే వదిలేసి రావాలంటూ రూలింగ్ ఇవ్వాలని పలువురు కోరారు.

2024-25లో ప్రారంభించాల్సిన కాలేజీల పరిస్థితి ఇదీ



ఆదోని మెడికల్ కాలేజీలో వివిధ భవనాల నిర్మాణాలు ఇలా

జరిగింది 15 శాతం పనులే

కర్నూలు జిల్లా ఆదోని వైద్య కళాశాలకు 2021 మే 31న సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర తరువాత 30 నెలల్లో పూర్తి చేసేలా 2022 డిసెంబరు 26న కాంట్రాక్ట్ సంస్థ ఒప్పందం చేసుకుని పనులు చేపట్టింది. 13 నెలలు గడిచినా 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. నిర్మాణ పనులు పునాదులు దాటి పిల్లర్ల దశలో ఉన్నాయి. గడువులో మిగిలిన 85 శాతం పనులు పూర్తి చేయడం సాధ్యమయ్యేలా కనపడటం లేదు.



మొండిగొడల్లా హాస్టల్ భవన నిర్మాణ పనులు

ఒక్కటీ పూర్తి కాలేదు

ప్రకాశం జిల్లా మార్కాపురం మెడికల్ కాలేజీలో ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తికాలేదు. మూడేళ్లలో నిర్మాణం పూర్తిచేస్తామని 2021 మే 21న జగన్ ప్రకటించారు. టెండర్ల అవార్డు ప్రకారం 2024 సెప్టెంబరు ఆఖరుకు పూర్తికావాలి. ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2024-25 నుంచి మెడికల్ కాలేజీని ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. యుద్ధప్రాతిపదికన పనులు చేసినా పూర్తి చేయడానికి మరో రెండేళ్లు పట్టడం ఖాయం.

ప్రారంభించిన కాలేజీల పరిస్థితి ఇదీ



రాజమహేంద్రవరంలో సాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

కా'లేజీ' పనులు

రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడున్నర ఎకరాల స్థలంలో కాలేజీ తాత్కాలిక భవనం నిర్మించి గతేడాది తరగతులు ప్రారంభించారు. చాలా భవనాలు ఇంకా పునాదుల్లోనే ఉన్నాయి. పూర్తి కావడానికి కనీసం రెండేళ్లు పడుతుందని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బోధనాసుపత్రి పనులు ఇంకా ఆరంభమే కాలేదు. తాత్కాలిక హాస్టళ్లు ఏర్పాటు చేశారు. సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

తాత్కాలికంగా ఏర్పాటు

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలను అరకొర సౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. ఎన్ఎంసీకి తప్పుడు సమాచారం ఇచ్చి 2023 ఏప్రిల్ 26న అనుమతి పొందారు. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో తాత్కాలిక భవనంలో తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. తరగతులు ప్రారంభమై ఐదు నెలలు అయినా ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు. కాలేజీ భవనాలు ఇంకా నిర్మాణంలో ఉన్నాయి. పూర్తిస్థాయిలో నిర్మాణం కావాలంటే మరో మూడేళ్లు పడుతుందని చెబుతున్నారు.

అన్నీ సమస్యలే



విజయనగరంలో నూతనంగా వైద్య కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అక్కడ చూస్తే అన్నీ సమస్యలే. అనేక విభాగాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. విద్యార్థుల వసతి గృహాల భవనాలను ఇప్పటికీ పూర్తి చేయలేదు. 2021 మేలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన భవనాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. తరగతులు నిర్వహించే బ్లాక్ పూర్తి చేశారు. ఇందులోనే ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు నిర్వహిస్తున్నారు. బోధనాసుపత్రి నిర్మాణ పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

అరచేతిలో 'వైద్యం'

ఆంధ్రజ్యోతి పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

నవశకం అంటూ రోత రాతలు రాశారు. తాత్కాలిక భవనాలు, అరకొర వసతులు-నిర్మాణాలకు కలర్‌ఫుల్‌గా రంగులు వేయించి కొత్త కాలేజీలను ప్రారంభించారు. ఈ మాత్రం దానికే ప్రభుత్వ వైద్య విద్యా రంగంలో సీఎం జగన్ సంచలన నిర్ణయాలు తీసుకున్నారంటూ.. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు అర్ధసత్యాలు, అసత్యాలు అచ్చేశారు. గతేడాది ప్రారంభించిన కాలేజీల పరిస్థితి ఇలా ఉండగా.. 2024-25 విద్యా సంవత్సరంలో కొత్తగా 5, 2025-26లో మరో 7 కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నట్టు గొప్పలకు పోయారు. ఈ ఏడాది ప్రారంభించాల్సిన మెడికల్ కాలేజీల్లో భవన నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి. కర్నూలు జిల్లా ఆదోని కాలేజీలో 15 శాతం పనులే జరిగాయి. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. అయినా ఈ ఏడాది ప్రారంభిస్తున్నట్టు డబ్బా కొట్టారు. ఇక 2025-26లో ప్రారంభిస్తామని చెబుతున్న కాలేజీల పరిస్థితి అయితే మరింత దయనీయంగా ఉంది. పార్వతీపురం మన్యం జిల్లా వైద్య కళాశాల నిర్మాణానికి ఇంకా టెండర్లు కూడా పిలవలేదు. పలు చోట్ల కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గడువులో పూర్తయ్యే పరిస్థితే లేదు. అయినా వాస్తవాలు వక్రీకరించి జగన్ రోతపత్రికలో అసత్యాలు వండి వార్చారు.



నత్తనడకన పనులు సాగుతున్న ఐపీడీ, ఓపీడీ బ్లాకల నిర్మాణం

కనీస వసతుల్లేకుండానే..

కృష్ణా జిల్లా మచిలీపట్నం మెడికల్ కళాశాలను కనీస వసతులు లేకుండానే ప్రారంభించారు. కేవలం మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతి గదులు, హాస్టల్ రూములు మాత్రమే పూర్తి చేసి గత ఏడాది సెప్టెంబరులో రిబ్బన్ కత్తిరించేశారు. కళాశాలకు వెళ్లాలంటే రైల్వేట్రాక్‌ను దాటి వెళ్లాలి. కనీసం ఫ్లైఓవర్ నిర్మించాలన్న ఆలోచన కూడా లేకుండా క్లాసులు మొదలు పెట్టేశారు. ఇంకా 30 భవనాల నిర్మాణం చేయాల్సి ఉంది. కళాశాల ప్రాంగణంలో రహదారులు, డ్రైనేజీ పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఒక్క రహదారి వినహా మిగిలిన రోడ్ల పనులు చేయలేదు. కళాశాలలో తాగునీటి వసతి లేదు. ఓపీడీ బ్లాక్, ఐపీడీ బ్లాక్‌ల నిర్మాణం 30 శాతం పనులు కూడా పూర్తికాలేదు. వీటి నిర్మాణం పూర్తయితేనే వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

అసంపూర్తి భవనాల్లో బోధన



నంద్యాల వైద్య కళాశాల పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని, ఇక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలే తరువాయి అంటూ జగన్ ప్రభుత్వ గొప్పలు చెబుతోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తే అంతా బూటకమే. వైద్య కళాశాల భవనాలు ఇంకా పూర్తి కాలేదు. కేవలం మొదటి సంవత్సరం విద్యార్థులకు అవసరమైన వసతులను సమకూర్చి తరగతులను నిర్వహిస్తున్నారు. బోధనకు అవసరమైన భవనాలను పూర్తి చేయకపోతే తరగతులు నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చేదిలేదంటూ గతేడాది మార్చిలో ఎన్ఎంసీ తేల్చి చెప్పడంతో.. ప్రభుత్వం హడావుడిగా సగం సగం పనులు చేపట్టి అనుమతులు తెచ్చుకుని అడ్మిషన్లను చేపట్టింది. విద్యార్థులకు అవసరమైన హాస్టల్ భవనాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఇవి అందుబాటులోకి వచ్చేందుకు ఇంకా చాలా సమయం పట్టేలా ఉంది.

2025-26లో ప్రారంభించాల్సిన వాటి పరిస్థితి ఇదీ

కొంత పునాది.. కొన్ని పిల్లర్లు

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు రెండున్నరేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని, 2024లో అడ్మిషన్లు ప్రారంభిస్తామని భూమి పూజ సందర్భంగా సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఏడాదిన్నర పాటు టెండర్ల పేరుతో కాలయాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించలేదు. పనులు ప్రారంభించి ఏడాది గడిచినా ఇంకా భూమి చదును పనులు జరుగుతున్నాయి. ఇప్పటిదాకా 8శాతం పనులే జరిగినట్లు తెలుస్తోంది. మెడికల్ కళాశాలను 2025-26 నాటికి ప్రారంభిస్తామని చెబుతున్నా, సాధ్యమేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

నత్తనడకన నిర్మాణ పనులు



పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. 2021 మే 30న సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో మెడికల్ కళాశాల, ఆసుపత్రి పూర్తి చేస్తామని గొప్పలు చెప్పారు. ఈ ఏడాది ఆఖరుకి పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నా.. 30 శాతం పనులకే మూడేళ్లు గడిస్తే, మిగిలిన 70 శాతం పనులకు ఇంకెన్నేళ్లు పడుతుందో?



ఎప్పటికి పూర్తవుతుందో?

మూడేళ్లలో బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేస్తామని 2021 మే 31న చెప్పారు. పనులు మొదలు పెట్టింది మాత్రం ఆరు నెలల క్రితమే. ఇంకా పిల్లర్ల దశలోనే పనులు జరుగుతున్నాయి. శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్ల పాటు పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండంతో 2025-26కల్లా మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభిస్తామని అంటున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తుంటే నిర్మాణం పూర్తి కావడానికే మరో మూడేళ్లు పట్టే అవకాశముంది. సకల హంగులు పూర్తి చేసుకుని మెడికల్ కళాశాల పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేసరికి 2027 దాటడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్మాణాలు పూర్తికావడం డౌటే

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సమీపంలో సమనస గ్రామంలో చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణ పనుల్లో ఆశించిన మేర పురోగతి లేదు. 32 భవనాలు నిర్మించాల్సి ఉండగా, ప్రస్తుతం 17 భవనాలు మాత్రమే నిర్మించడానికి కాంట్రాక్టు సంస్థ చర్యలు చేపట్టింది. వైద్య కళాశాల నిర్మాణ పనులను 2025 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు ఆచరణ సాధ్యం కాని పరిస్థితుల్లో ఉన్నాయి.

ఒక్క అడుగూ పడలేదు..



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణం పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకుండానే వర్చువల్‌గా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏడాదికి రైతులకు సొమ్ములు చెల్లించి వైద్య విధాన పరిషత్‌కు భూములను అప్పగించారు. 2022 నవంబరులో జగన్ హడావుడిగా పనులు ప్రారంభించారు. ఇప్పటిదాకా ఒక్క భవనం కూడా నిర్మించలేదు. కళాశాల కోసం సేకరించిన భూమిని కూడా ఇప్పటిదాకా పూడ్చలేదు.

కాగితాలకే పరిమితం

పార్వతీపురం మన్యం జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటోంది. కానీ ఆ గొప్పలు కాగితాలకే పరిమితమయ్యాయి. పార్వతీపురం పట్టణానికి సమీపంలో నిర్మాణం చేపట్టాలని అధికారులు స్థల పరిశీలన చేశారు. కానీ నేటికీ ఆ పనులకు సంబంధించి టెండర్లు పిలవలేదు.

పెద్దిరెడ్డి బానిసలకే టికెట్లు: గాంధీ

చిత్తూరు, ఫిబ్రవరి 5: "మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బానిసలుగా ఉండేవారికే ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు వస్తాయి తప్ప నిజాయతీగా ఉండేవారికి దక్కవు" అని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు ఆర్. గాంధీ ఆరోపించారు. చిత్తూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. "వైసీపీలో దళితులకు న్యాయం జరగడం లేదు. ముఖ్యంగా మంత్రి పెద్దిరెడ్డి దళితులను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. నేను 12 ఏళ్లకు ముందు మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో వైసీపీలో చేరాను. నన్ను కాదని పార్టీలో చేరతావా అంటూ పెద్దిరెడ్డి నాటి నుంచి నన్ను పక్కన పెట్టారు. సీఎం జగన్‌ను కలిసి దళితుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళతామంటే ఒక్కసారి కూడా అవకాశం ఇవ్వలేదు. పెద్దిరెడ్డి దళితుల పట్ల చూపుతున్న వివక్షపై పార్టీలో ఉండీ పోరాడలేకపోతున్నా. అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నా" అని గాంధీ అన్నారు. చిత్తూరు ఎంపీగా ఉన్న రెడ్డెప్ప మంత్రి పెద్దిరెడ్డి ముందు కనీసం కూర్చోలేరన్నారు. తాను మంగళవారం చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో జరిగే చంద్రబాబు 'రా కదలిరా!' సభలో టీడీపీలో చేరుతున్నట్టు వెల్లడించారు.

ప్రచార పర్వంలో వలంటీర్లు

- రాప్తాడులో అడ్డుకున్న టీడీపీ నేతలు

అనంతపురం రూరల్/తాడిపత్రి, ఫిబ్రవరి 5: వలంటీర్లు రంగంలోకి దిగిపోయారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ తరఫున గ్రామ వలంటీర్లు కరపత్రాలు పంపిణీ చేశారు. కురుగుంట గ్రామంలో సోమవారం వలంటీర్లు వైసీపీ కరపత్రాలు పంచుతుండగా టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఆ కరపత్రాల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని గెలిపించాలన్న నినాదాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ముద్రించారు. విజయవాడ నుంచి వచ్చిన ఓ బృందంతో కలిసి గ్రామ వలంటీర్లు ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ నేత వెంకటరాముడు వారిని అడ్డుకుని.. ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటూ, రాజకీయ ప్రచారం ఎలా చేస్తారని నిలదీశారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఎటు చూసినా ఓటరు జాబితాలతో వలంటీర్లు దర్శనమిస్తున్నారు. వాస్తవానికి ఓటరు జాబితా పరిశీలనకు వలంటీర్లను వినియోగించవద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అయినా.. పట్టణంలోని టైలర్స్ కాలనీ, పాతకోట, శాస్త్రి నగర్, కేవీ రెడ్డి నగర్‌ల్లో ఓటరు లిస్టును వలంటీర్లు వెరిఫికేషన్ చేశారు.

శరణు.. శరణు.. 17 మంది అప్పీళ్ల విచారణ

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం తన కార్యాలయంలో రెవెన్యూ కోర్టు నిర్వహించారు. తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న 17 మంది రెవెన్యూ అధికారులు దాఖలు చేసిన అప్పీళ్లను విచారణకు స్వీకరించిన అనంతరం ఆయా కేసులను రివిజన్ చేశారు. 17 మందికి నోటీసులు ఇవ్వగా కొందరే హాజరైనట్లు తెలిసింది. ప్రకాశం జిల్లా సదావర్తి మఠం భూముల అన్యాక్రాంతం కేసులో ఇటీవల ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, మరో నలుగురు అధికారుల అప్పీళ్లను మంత్రి పరిశీలించారు. మరో నలుగురు డిప్యూటీ కలెక్టర్ల కేసులను రివిజన్ చేశారు. చిన్న చిన్న తప్పులకు కూడా సీసీఎల్ఏ పెద్ద శిక్షలు విధిస్తున్నారని, తమను కాపాడాలంటూ మంత్రిని పలువురు అధికారులు వేడుకున్నారని తెలిసింది.

సర్పంచుల గృహనిర్బంధం

- నేటి 'చలో అసెంబ్లీ' భగ్నానికి ప్రభుత్వం చర్యలు

గ్రామ పంచాయతీల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడుతున్న సర్పంచులు తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు మంగళవారం చలో అసెంబ్లీ చేపట్టాలని నిర్ణయించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఇప్పటికే అన్ని జిల్లాల నుంచి సర్పంచులు విజయవాడకు చేరుకోగా, మరి కొందరిని దారి మధ్యలోనే పోలీసులు అరెస్టు చేశారు. వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌ను ఆదివారం రాత్రి నుంచి తన నివాసంలోనే గృహ నిర్బంధం చేశారు. పోలీసుశాఖ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులపై నిఘా ఉంచి ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తోంది.

కాంగ్రెస్ లేనప్పుడే దేశంలో అభివృద్ధి



- 2029లో కాంగ్రెస్ ముక్త భారత్‌ను చూస్తాం
- 2024 ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసినా రాహుల్ ఓడిపోతారు
- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది
- రాజ్యసభలో బీజేపీపై సాయి రెడ్డి పరోక్ష పొగడ్తలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి.. బీజేపీ పేరు ఎత్తకుండా పరోక్షంగా ఆకాశానికి ఎత్తేశారు. యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం వెనకపట్టుపట్టిందని, వాళ్లు అధికారంలో లేనప్పుడు మాత్రమే అభివృద్ధి జరిగిందని అన్నారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్ర విభజన తరువాత కూడా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. పదేళ్ల తరువాత, అనేక అబద్ధాలు చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చారు. త్వరలోనే అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. గత ఎన్నికల్లో అమేథీలో ఓడిపోయిన రాహుల్ గాంధీ 2024లో జరిగే ఎన్నికల్లో ఎక్కడా గెలవరు. ఎక్కడ నుంచి పోటీ చేసినా రాహుల్ ఓడిపోతారు. 2029 నాటికి కాంగ్రెస్ ముక్త భారత్‌ను చూస్తాం. గ్రాండ్ ఓల్డ్ పార్టీ మాయమైపోతుంది. కాంగ్రెస్ పరిపాలించిన 50 ఏళ్లలో ఎన్నడూ అభివృద్ధి లేదు. కాంగ్రెస్ నిద్రాణస్థితిలో ఉన్నప్పుడు మాత్రమే దేశం అభివృద్ధి బాటలో పయనించింది. కాంగ్రెస్ వెన్నెముక లేని పార్టీ. కాంగ్రెస్‌ను నేను 'ధోకే బాజ్ పార్టీ' (మోసకారి పార్టీ) అని పిలుస్తాను. వాళ్లు కుటుంబ రాజకీయాలు నడుపుతారు. వాళ్ల డర్టీ పాలిటిక్స్ కారణంగానే ప్రజలు వాళ్లకు ఓ గుణపాఠం నేర్పారు. దాని మూలంగానే ఏపీలో 2019 ఎన్నికల్లో వారికి నోటా కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. జాతీయ స్థాయిలో కూడా కాంగ్రెస్ పార్టీ పతనం విస్పష్టంగా కనిపిస్తోంది. 2024లో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావని వాళ్ల స్వంత కూటమి ఇండియా చెపుతోంది' అని విజయసారెడ్డి అన్నారు.

షర్మిలకు చెక్ పెట్టాల్సిందే

- బీజేపీ పెద్దలకు వైసీపీ సలహా

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'ప్రత్యేక హోదా' అంశం రాష్ట్రంలో గత నాలుగేళ్ల కాలంలో పెద్దగా చర్చకు రాలేదు. అయితే, ఏపీ కాంగ్రెస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల ప్రత్యేక హోదాపై నిలదీస్తున్నారు. ఇది.. వైసీపీ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ సర్కారుకు కూడా మింగుడు పడడం లేదు. "హోదా విషయంలో కేంద్రం మెడలు వంచుతానని చెప్పి.. ఇప్పటి వరకు హోదా తీసుకు రాలేదు" అంటూ షర్మిల తన ప్రసంగాల్లో సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇదిలావుంటే, ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాకూర్ తాజాగా లోక్‌సభలో విభజన హామీలపై వాయిదా తీర్మానం ఇచ్చారు. దీంతో బీజేపీ పెద్దలు వైసీపీ ముఖ్య ఎంపీ ఒకరిని పిలిపించి ఇదేంటని ప్రశ్నించారు. ఈ క్రమంలో షర్మిల అంశం ప్రస్తావనకు వచ్చింది. "ప్రత్యేక హోదా అంశాన్ని షర్మిల కావాలనే తెరపైకి తెస్తున్నారు. మేం ఎదురు దాడికి దిగాం. మీ పార్టీ నుంచి ఎవ్వరూ మాట్లాడట్లేదు. అలా వదిలేస్తే ఎన్నికల్లో నష్టం వస్తుంది" అన్నట్టు తెలిసింది. దీంతో ఢిల్లీ బీజేపీ పెద్దలు షర్మిలపై ఎదురుదాడి చేయాలని ఏపీ బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

తహసీల్దార్ హత్య కేసు నిందితుడు అరెస్ట్

- కన్వేయన్స్‌డీడ్ చేయలేదనే దారుణం!

విశాఖపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు మురహరి సుబ్రమణ్యం గంగారామ్‌ను అరెస్టు చేసినట్టు విశాఖ పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. చెన్నైలో ఉన్న గంగారామ్‌ను విశాఖ నుంచి వెళ్లిన ప్రత్యేక బృందం అక్కడి పోలీసుల సహాయంతో సోమవారం అదుపులోకి తీసుకుందన్నారు. ట్రాన్సిట్ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నామని చెప్పారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పెదరుషికొండలోని ఒక భూమికి కన్వేయన్స్ డీడ్ జారీ కోసం గంగారామ్ కొద్ది రోజులుగా విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్య చుట్టూ తిరుగుతున్నాడని, రమణయ్య విజయనగరం జిల్లాకు బదిలీ కావడంతో ఇక కన్వెయన్స్ డీడ్ జారీ అయ్యే అవకాశం లేదనే భావనతోనే ఆయనను రాడ్‌తో కొట్టి చంపేశాడని చెప్పారు. విచారణ ప్రాథమిక దశలోనే ఉన్నందున హత్య ఎందుకు జరిగింది? ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా? వంటి వివరాలు ఇప్పుడే చెప్పలేమన్నారు. లభించిన ఆధారాలను బట్టి నిందితుడు గంగారామ్ అని నిర్ధారణ కావడంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. శనివారం మధ్యాహ్నం 3.10 గంటలకు బెంగళూరు మీదుగా చెన్నై వెళ్లిన విమానంలో గంగారామ్ ఎక్కినట్టు తెలియడంతో విమానసర్వీసు సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. ఎయిర్‌హోస్టస్ గంగారామ్ పూర్తిపేరు, సీటు నంబర్ చెప్పి, సీటులోనే ఉండాలని అనౌన్స్ చేయడంతో అతనికి అనుమానం వచ్చి.. విమానం బెంగళూరులో ఆగినప్పుడు మిగిలిన ప్రయాణికులతోపాటే దిగిపోయాడని, అక్కడి నుంచి బస్సులో చెన్నై వెళ్లాడని తెలిపారు. శివారులోని చెంగల్పట్టులో బస్సు దిగి లోకల్ ట్రైన్‌లో చెన్నై సెంట్రల్‌కు వెళుతుండగా అక్కడి పోలీసుల సహాయంతో అతన్ని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. నిందితుడిని నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నామన్నారు. విమానాశ్రయంలో నిందితుడి వివరాలను పరిశీలించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, సిబ్బందిపై తగిన విచారణ జరుపుతున్నామన్నారు. నిర్లక్ష్యంగా తేలితే శాఖాపరమైన చర్యలు తప్పవని చెప్పారు. గంగారామ్ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదారు కోట్లకు ఐపీ పెట్టాడని, అక్కడ చీటింగ్ కేసు నమోదైందని తెలిపారు. విజయవాడలోనూ అతనిపై మరో చీటింగ్ కేసు ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో పూర్తిగా కూరుకుపోవడం వల్ల ఒత్తిడిలోనే హత్యకు తెగబడి ఉండవచ్చునని సీపీ అభిప్రాయపడ్డారు. రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలంటూ కొంత మంది ఉద్యోగులు, అధికారులు తమకు విజ్ఞప్తి చేయడం వాస్తవమేనన్నారు. నగరంలో భూముల విలువ పెరగడంతో భూ వివాదాలు, కబ్జాలు పెరిగిపోయాయని, ఇది పోలీస్, రెవెన్యూ శాఖలతోపాటు ప్రజలకు కూడా ఒక సమస్యగా మారిందని తెలిపారు. పోలీస్, రెవెన్యూశాఖలు నిర్వహించే గ్రీవెన్స్‌కు కూడా వీటిపైనే అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రతి వారం రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి, సమాచారాన్ని పరస్పరం మార్పిడి చేసుకోవాలని నిర్ణయించామని వివరించారు.

ఇక సామాన్యుల పరిస్థితేంటి?

(మొదటి పేజీ తరువాయి)

సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేసింది. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏడేళ్ల శిక్షకు వీలున్న కేసులో పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అరెస్టుకు ఎలా ప్రయత్నిస్తారని పోలీసులను నిలదీసింది. 'అరెస్టు చేయనివ్వండి.. బాధ్యులైన అధికారులను తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది.. వారిని లోపలకు పంపిస్తాం. ఉన్నతాధికారులపై చర్యలకు ఆదేశిస్తే తప్ప పరిస్థితి చక్కబడేటట్లు లేదు' అని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేసు వివరాలను కోర్టుకు సమర్పించేందుకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) సమయం కోరడంతో ఎమ్మెల్యే ఏలూరి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఆదేశాలిచ్చారు. గ్రానైట్ ఫ్యాక్టరీల తనిఖీలకు వచ్చిన మైనింగ్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా.. బాపట్ల జిల్లా మార్టూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా.. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. అత్యవసరంగా విచారించాలని అభ్యర్థించారు. మధ్యంతర ముందస్తు బెయిల్ కోరడంతో పాటు ఎమ్మెల్యే విషయంలో 41ఏ నిబంధనలు పాటించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ అనుబంధ పిటిషన్లు వేశామని తెలిపారు. ఎమ్మెల్యేపై నమోదైన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని అన్నారు. ఈ కేసులో ఇతర నిందితులను పోలీసులు అరెస్టు చేశారని.. వారికి మేజిస్ట్రేట్ రిమాండ్ కూడా విధించారని వెల్లడించారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పోలీసులు పాటించడం లేదన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని.. ఎమ్మెల్యే ఏలూరి హాజరు కావలసి ఉందని.. అయితే ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా తమకు 41ఏ కింద నోటీసులిచ్చేలా ఆదేశించండి.. పోలీసులు అరెస్టు చేస్తారేమోనని భయపడుతుంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసుల్లో అరెస్టుకు ఎలా ప్రయత్నిస్తారు' అని ప్రశ్నించారు. అరెస్టు చేస్తే.. బాధ్యులైన అధికారులను లోపలకు పంపిస్తామని హెచ్చరించారు. ఏపీపీ స్పందిస్తూ.. పిటిషన్ మొదటిసారి విచారణకు వచ్చిందని.. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

డూప్లికేట్ ఓట్లపై ఈసీకి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఓటర్ల జాబితాల్లో డూప్లికేట్ ఓట్లను తొలగించకపోవడంపై సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘా(ఈసీ)నికి సోమవారం నోటీసులు జారీచేసింది. మరణించినవారి ఓట్లను తొలగిస్తున్నా.. ఈ డూప్లికేట్ ఓటర్ ఎంట్రీలు మాత్రం అలాగే ఉంటున్నాయని 'సంవిధాన్ బచావో ట్రస్టు' అనే ఎన్జీవో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా వాదనలు వినిపించారు. చనిపోయిన, అడ్రస్ మారిన ఓటర్లకు సంబంధించి మాత్రమే ఓటర్ల జాబితాలను అప్‌డేట్ చేస్తున్నారని.. ఓటర్ల జాబితాల్లోని డూప్లికేట్ ఓటర్లను తొలగించే విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన త్రిసభ్య ధర్మాసనం.. జిల్లా ఎన్నికల అధికారులు సేకరించిన డేటాలో డూప్లికేట్ ఓట్ల అంశాన్ని ప్రస్తావించకపోవడంపై జవాబివ్వాలని ఈసీని ఆదేశించింది.

వివేకా కేసు డైరీని కోర్టు ముందుంచండి!

- సీబీఐకి సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దేశం

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఏప్రిల్ 22తో ప్రారంభమయ్యే వారంలో నాన్ మిస్లేనియస్ డే నాడు విచారణ చేపడతామని పేర్కొంది. ఆలోగా హత్య కేసుకు సంబంధించి డైరీని డిజిటల్ రూపంలో తమ ముందు ఉంచాలని సీబీఐని ఆదేశించింది. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు సోమవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఏప్రిల్ 22కన్నా ముందు ఈ కేసు విచారించే అవకాశం లేదని జస్టిస్ సంజీవ్‌ఖన్నా తెలిపారు. ఈ లోపు కేసు డైరీని తమ ముందు ఉంచాలని సీబీఐని ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 6 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



నాకు నచ్చిన గెటప్‌లో కనిపిస్తా

రవితేజ

"ఈగల్ సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకుల స్పందన కోసం ఎదురుచూస్తున్నాను. ఈ సినిమాలో నాకు విపరీతంగా నచ్చిన గెటప్‌లో కనిపిస్తాను' అని రవి తేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. అనుపమా పరమేశ్వరన్, కావ్యాథాపర్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఫిబ్రవరి 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. రవితేజ మాట్లాడుతూ "ఈగల్‌లో నా పాత్ర కోసం మేకోవర్ అవ్వడానికి మూడు నెలలు పట్టింది. నాకు చాలా బాగా నచ్చింది. అనుపమ పాత్రే 'ఈగల్' సినిమాను నడిపిస్తుంది. కావ్య లవ్లీ క్యారెక్టర్ చేశారు. మా దర్శకుడు కార్తీక్‌కు చాలా స్పష్టత ఉంది. సినిమాను ఎక్స్‌ట్రార్డినరీగా తీశాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నాకు హోమ్ ప్రొడక్షన్ లాంటిది. ఈ బేనర్‌లో ఎన్ని సినిమాలు చేయడానికైనా సిద్ధమే. నవదీప్‌కు ఈ సినిమాతో నటుడిగా మంచి పేరు వస్తుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈగల్' స్టైలిష్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్. క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది. నాకు అవకాశం ఇచ్చిన రవితేజకు ధన్యవాదాలు. ఇందులో నటీనటుల కాంబినేషన్ కూడా కొత్తగా ప్రయత్నించాం' అన్నారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తీక్‌తో మరో సినిమా చేస్తున్నాం. మంచి సందేశం ఉన్న చిత్రమిది' అన్నారు. అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో నాకు ఇది రెండో చిత్రం. 'ఈగల్'లో నాకు అద్భుతమైన పాత్ర ఇచ్చారు. తప్పకుండా ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది. రవితేజతో మరిన్ని సినిమాల్లో నటించాలనుంది' అని చెప్పారు. సరికొత్త ప్రేమకథా చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని కావ్యాథాపర్ తెలిపారు. రవితేజ అన్నయ్యతో పనిచేయడం ఆనందాన్నిచ్చిందని నవదీప్ తెలిపారు.



పద్దెనిమిదేళ్ల తర్వాత మళ్లీ..

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్ వేశారు. వశిష్ఠ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. మెగాస్టార్ కెరీర్‌లోనే క్లాసీయస్ట్ ఫిల్మ్ ఇది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం రకరకాలు పేర్లు వినిపించాయి. అయితే మెగాస్టార్ సరసన నటించడం కోసం త్రిషను కథానాయికగా ఎంపిక చేశారు దర్శకనిర్మాతలు. 2006లో 'స్టాలిన్' చిత్రంలో చిరంజీవి సరసన త్రిష నటించారు. మళ్లీ పద్దెనిమేదళ్ల అనంతరం ఆమె మెగాస్టార్‌తో కలసి నటిస్తున్నారు. సోమవారం సెట్‌లోకి అడుగుపెట్టిన త్రిష్‌కు చిరంజీవి, దర్శకుడు వశిష్ఠ, నిర్మాతలు స్వాగతం పలికారు. చాలా గ్రాండియర్‌గా, విజువల్ వండర్‌గా రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' చిత్రానికి సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, కాస్ట్యూమ్స్ డిజైనర్: సుస్మిత కొణిదల.



తండేల్ ప్రయాణం... కీలక ఘట్టం ముగిసింది

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ బేనర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు రియల్ లొకేషన్లలో షూటింగ్ చేస్తున్నారు. సుదీర్ఘ షెడ్యూల్‌ను యూనిట్ పూర్తి చేసింది. నాగచైతన్య, సాయిపల్లవి ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను యూనిట్ తెరకెక్కించింది. ఈ సందర్భంగా మేకర్స్ వర్కింగ్ స్టిల్స్‌ను విడుదల చేశారు. రాజు అనే మత్స్యకార యువకుడిగా నాగచైతన్య, అతని ప్రేయసి పాత్రలో సాయిపల్లవి కనిపించనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగచైతన్య సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్



పంతులమ్మ పోరాటం

జ్యోతిక ప్రధాన పాత్ర పోషించిన తమిళ చిత్రం 'రాక్షసి' తెలుగులో 'అమ్మ ఒడి'పేరుతో విడుదలవుతోంది. ఎస్ వై గౌతమ్‌రాజ్ దర్శకత్వంలో ఎస్ ఆర్ ప్రకాశ్, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. నాగినీడు, హరీశ్ పేరడి, పూర్ణిమ భాగ్యరాజ్, సత్యన్ కీలకపాత్రలు పోషించారు. సోమవారం చిత్రబృందం 'అమ్మ ఒడి' ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే బాధ్యతాయుతమైన టీచర్ పాత్రలో జ్యోతిక కనిపించారు. విద్యా వ్యవస్థను నాశనం చేసేవారి పాలిట ఆమె ఓ రాక్షసి అంటూ జ్యోతిక పాత్రను పరిచయం చేయడం సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్న వడ్డి రామానుజం, వల్లెం శేషారెడ్డి మాట్లాడుతూ "అమ్మఒడి' చిత్రం తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. విద్యావ్యవస్థ లోపాలను దర్శకుడు ఎత్తిచూపారు. త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామ'న్నారు.

మంచి దర్శకుడు దొరికితే మా తాత బయోపిక్

ఉపాసన

అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి బయోగ్రఫీ ఆధారంగా సినిమాను తెరకెక్కించే విషయంపై ఆయన మనవరాలు, హీరో రామ్ చరణ్ సతీమణి ఉపాసన స్పందించారు. మంచి దర్శకుడు దొరికితే దాని గురించి ఆలోచన చేస్తామన్నారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి 91వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 'ది అపోలో స్టోరీ ది అమర చిత్ర కథ' (కామిక్స్) పేరుతో ముద్రించిన పుస్తకాన్ని సోమవారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ సి రెడ్డితో పాటు ఆయన కుమార్తెలు సంగీతారెడ్డి, శోభనా కామినేని, సునీతారెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాసన విలేకరులతో మాట్లాడుతూ.. 'ది అపోలో స్టోరీ - అమర చిత్ర కథ' పుస్తకాన్ని రూపొందించడానికి హీరో రానా దగ్గుబాటి ఎంతగానో సహాయం చేశారు. హెల్త్ కేర్ గురించి యువతకు తెలియజెప్పాలన్న ఉద్దేశంలో ఈ పుస్తకాన్ని ముద్రించాం. మా తాత నాకు స్ఫూర్తి, ప్రేరణ. ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నాను. ఆయన మా గ్రాండ్‌మా, నలుగురు కుమార్తెల జీవితాలను తీర్చిదిద్దారు. ఏదైనా సమస్య ఎదురైతే పురుషులతో సమానంగా ధీటుగా ఎదుర్కోవాలని తాత మాలో ధైర్యాన్ని నింపి, అలా మమ్మల్ని తయారు చేశారు' అన్నారు.



-చెన్నై (ఆంధ్రజ్యోతి)

కమర్షియల్ లవ్‌స్టోరీ



రుత్విక్ కొండకింది, విశాఖ ధిమాన్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న నూతన చిత్రం 'రాజా ది రాజా'. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో చాణక్య అద్దంకి, నిహారికా రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దర్శకులు రవిబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలగలిసిన లవ్ స్టోరీ ఇది. కమర్షియల్ హంగులతో రూపొందిస్తున్నాం' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రకృతికి సంబంధించిన ఒక అంశం చుట్టూ అల్లుకున్న ఆసక్తికర కథతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. రెండు నెలల్లో షూటింగ్ పూర్తి చేస్తాం. జూన్‌లో విడుదల చేస్తామ'ని చెప్పారు. ఈ సినిమాలో తన పాత్ర ఎగ్జైటింగ్‌గా ఉంటుందని రుత్విక్ చెప్పారు.హీరోయిన్ అవ్వాలనే తన కల 'రాజా ది రాజా' చిత్రంతో తీరుతోందని విశాఖ ధిమాన్ తెలిపారు.



యూనిక్ కాన్సెప్ట్

టాలీవుడ్‌లో దాదాపు స్టార్ హీరోలందరితో పని చేసిన చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్దార్థ్ రాయ్' ఈ నెల 23న విడుదల కానుంది. హరీశ్‌శంకర్, వంశీ పైడిపల్లి వంటి దర్శకుల దగ్గర పనిచేసిన యశస్వీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. యూనిక్ కాన్సెప్ట్‌తో, మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ చిత్రంలో తన్వి నేగి కథానాయిక. ఇప్పటికే విడుదలైన సినిమా టీజర్, ట్రైలర్, పాటలు బాగా వైరల్ అయ్యాయనీ, సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందనీ నిర్మాతలు జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: రథన్, ఫొటోగ్రఫీ: శ్యామ్ కె నాయుడు, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, సహ రచయితలు: అన్వర్ మహ్మద్, లుధీర్ బైరెడ్డి.

ప్రాణం గడ్డిపోస అనుకో..



బాబీ సింహా, వేదిక, అనన్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే ముఖ్య పాత్రలు పోషించిన 'రజాకార్' చిత్రం త్వరలో విడుదల కానుంది. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడురు నారాయణరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా నుంచి 'ప్రాణం గడ్డిపోస అనుకో..' అనే పాటను విడుదల చేశారు. సుద్దాల అశోక్‌తేజ రాసిన ఈ పాటను శంకర్ మహదేవన్ పాడారు. భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మా సినిమాలోని ఎమోషన్‌ను అర్థం చేసుకుని సుద్దాల అద్భుతంగా పాట రాశారు. మన పూర్వీకులను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పిస్తూ తీస్తున్న సినిమా' అని చెప్పారు. 'రజాకార్లను ఉద్దేశించి మాత్రమే ఈ సినిమా తీశాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు నిర్మాత.

మా నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు

సుహాస్



'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రంతో హిట్ కొడతాం అనుకున్నాం. అది నిజమైంది. నాకు హ్యాట్రిక్ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ సినిమాను ఇంకా పెద్ద హిట్ చేయాలని ప్రేక్షకులను కోరుతున్నాను' అని హీరో సుహాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. సుహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో మిగిలిన పాత్రలకు కూడా సమాన పాధాన్యత ఉంది. అదే ఈ సినిమా స్క్రిప్ట్‌కు బలం. మా సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరి కృషి వల్లే ఈ సక్సెస్ వచ్చింది' అని చెప్పారు. నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' నిజాయితీతో చేసిన ప్రయత్నం. సుహాస్ అయితే ఈ కథకు న్యాయం చేయగలడని నమ్మాం. ప్రేక్షకులు మా నమ్మకాన్ని నిజం చేశార'న్నారు. దర్శకుడు దుశ్యంత్ మాట్లాడుతూ 'గీతాఆర్ట్స్, బన్నీవాసు గారు ధైర్యం చేయడం వల్లే ఈ సినిమా తీయగలిగాం. ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. దుష్యంత్ నన్ను హిట్ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం చేశారని శివాని తెలిపారు.

రైతుల ఆవేదనకు అద్దం పట్టేలా



రాజధాని ఏర్పాటు కోసం తమ వ్యవసాయ భూములు త్యాగం చేసిన వేలాదిమంది రైతుల ఆవేదనకు అద్దం పడుతూ తెరకెక్కిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో వినోద్ కుమార్, వాణీ విశ్వనాథ్ కీలకపాత్రలు పోషించారు. అఖిలన్, వీణ జంటగా నటించారు. చిత్రబృందం సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. 'ఆరుకోట్ల జనాభా ఉన్న రాష్ట్రానికి నాలుగు రాజధానులా, ఇది రాజ్యాంగబద్ధమా, వ్యక్తిగత ద్వేషమా' అనే ప్రశ్నతో మొదలైన ట్రైలర్ ఆలోచన రేకెత్తించింది. 'మనం ఒక పాదయాత్ర చేయబోతున్నాం. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకూ...మహా పాదయాత్ర' అంటూ పలికిన సంభాషణలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రాన్ని తెలుగు వన్ ప్రొడక్షన్స్ బేనర్‌పై హిమబిందు సమర్పణలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. భాను దర్శకుడు. సంగీతం: మణిశర్మ. సినిమాటోగ్రఫీ: రమేశ్

వ్యూహం సర్టిఫికెట్‌పై ఈనెల 9లోగా నిర్ణయం తీసుకోండి

సెన్సార్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలు



రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'వ్యూహం' సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ జారీచేసే అంశంపై మరోసారి నిర్ణయం తీసుకోవాలని.. ఇందు కోసం రివైజింగ్ కమిటీని మళ్లీ ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను సింగిల్ జడ్జి రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. తాజాగా మళ్లీ నియామకమయ్యే రివైజింగ్ కమిటీ ఈ సినిమాను వీక్షించి.. ఈనెల 9లోగా సర్టిఫికెట్ జారీచేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి తీర్పుతో ఏకీభవించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కు అని.. కానీ అది చట్టబద్ధమైన పర్యవేక్షణలో కొనసాగుతుందని వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 19 కల్పించిన స్వేచ్ఛ ప్రకారం వాస్తవ ఘటనలను తమ తమ కోణాల్లో ప్రస్తావించుకునే ప్రాథమిక హక్కు అందరికీ ఉంటుందని తెలిపింది. రివైజింగ్ కమిటీని పునర్నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఛైర్మన్ చెప్పారని పేర్కొంది. ఒకవేళ ఇప్పటికీ ఏర్పాటు చేయకపోయినా రివైజింగ్ కమిటీని మళ్లీ ఏర్పాటు చేయాలని తాము ఆదేశాలు జారీచేస్తున్నామని స్పష్టం చేసింది. ఆ కమిటీ సినిమాను వీక్షించి.. ఈనెల 9లోగా నిర్ణయం తీసుకోవాలని.. ఆ నిర్ణయాన్ని అప్పీలుదారులకు తెలియజేయాలని పేర్కొంది. ఈ మేరకు పిటిషన్‌లలో విచారణను ముగించింది. తొలుత ఈ సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడానికి సెన్సార్ బోర్డు ఎగ్జామినేషన్ కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత ఏర్పాటైన రివైజింగ్ కమిటీ పలు సవరణలు సూచిస్తూ సర్టిఫికెట్ జారీచేసింది. ఒకసారి తిరస్కరించిన తర్వాత మళ్లీ సర్టిఫికెట్ ఇవ్వడంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ సినిమా ప్రతిపక్ష నాయకులను కించపర్చేలా.. కోర్టు ధిక్కారణకు దారితీసేలా ఉందని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ధర్మాసనం.. సదరు సినిమాకు జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను కొట్టేస్తూ.. చట్టప్రకారం మూడువారాల్లో మళ్లీ నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. సింగిల్ జడ్జి ఆర్డర్‌పై దర్శక నిర్మాతలు డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్.. ఈనెల 1న తీర్పు రిజర్వు చేసి.. సోమవారం తుది తీర్పు వెలువరించింది.



విందు భోజనం లాంటి సినిమా

సాయిరోనక్, గనవి లక్ష్మణ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'లగ్గం'. 'భీమదేవరపల్లి బ్రాంచి' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రమేశ్ చెప్పాల ఈ సినిమాకు దర్శకుడు. రాజేంద్రప్రసాద్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "లగ్గం' విందు భోజనం లాంటి సినిమా. ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోలేని విధంగా నా పాత్ర ఉంటుంది. నా కెరీర్‌లో 'పెళ్లి పుస్తకం' తర్వాత అంత గొప్ప పాత్ర ఈ సినిమాలో చేస్తున్నాను. తెలుగు వారందరికీ ఈ కథ నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'పెళ్లి అంటే రెండు కుటుంబాల కలయిక మాత్రమే కాదు రెండు మనసుల కలయిక అని చెప్పే చిత్రమిది. గట్టి దావత్ ఇవ్వబోతున్నాం' అన్నారు. 'వినోదంతో పాటు భావోద్వేగాల సమాహారంగా ఈ చిత్రం ఉండబోతోంది, తెలంగాణలో వివాహ సంస్కృతిని కళ్లకు కడుతుంది' అని సాయిరోనక్ చెప్పారు. ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

మ్యూజిక్ షాప్ మూర్తి కథ



విలన్ పాత్రలతోనే కాదు కామెడీ రోల్స్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటుడు అజయ్ ఘోష్. ఆయన కీలక పాత్రధారిగా 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రం తయారవుతోంది.. చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి శివ పాలడుగు దర్శకుడు. హర్ష గారపాటి నిర్మాత. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో అజయ్ ఘోష్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన పాత్ర వినోదభరితంగా ఉంటుందని పోస్టర్ చూస్తే అర్థమవుతుంది. చాందినీ చౌదరి పాత్రకు, అజయ్ ఘోష్ పాత్ర ఉండే సంబంధం ఏమిటి, అసలు వీరిద్దరి కథ ఏమిటనేది ఆసక్తికరం అని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: పవన్, ఛాయాగ్రహణం: శ్రీనివాస్ బెజుగమ్, ఎడిటింగ్: బొంతల నాగేశ్వరరెడ్డి.



విజయనగరం కోట జంక్షన్‌లో నిరుద్యోగుల ఆందోళన... , 'నిన్ను దింపడానికి మేము సిద్ధం' అంటూ.. ప్లకార్డుతో నిరుద్యోగ యువతి

ఇదేం కక్కుర్తి జగన్ మామా?

- కళాశాల విద్యార్థులతో పాఠశాలల్లో అచీవ్‌మెంట్ సర్వే
- రూ.2కోట్ల అలవెన్సు ఇస్తామని ఎగ్గొట్టిన ప్రభుత్వం.. విద్యార్థుల ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు జీతాలు ఆలస్యం చేయడం చూసుంటారు... కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపేయడమూ చూసే ఉంటారు... కానీ కళాశాలల విద్యార్థులతో ఒక్కరోజు చేయించుకున్న పనికి ఇవ్వాల్సిన అలవెన్సులు ఆపేయడం ఎక్కడైనా చూశారా?.. విద్యార్థులే కదా.. వారికి డబ్బులు ఎగ్గొడితే ఎవరడుగుతారన్న ధోరణిలో ప్రభుత్వం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలివీ... జాతీయ విద్యా పరిశోధన మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) ఆదేశాలతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ గత నవంబరులో 3, 6, 9 తరగతుల విద్యార్థుల్లో భాషా సబ్జెక్టులు, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులపై అవగాహనను తెలుసుకునే రాష్ట్రవ్యాప్తంగా 'స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే' నిర్వహించింది. స్థానికంగా ఉన్న కాలేజీల నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు ఒక్కో మండలానికి సగటున 50 మంది.. వెరసి 20వేల మంది ఈ సర్వే చేశారు. వీరికి అలవెన్సు కింద రూ.600 ఇస్తామని ఎంఈవోల ద్వారా ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అందరికీ కలిపి సుమారు రూ.2కోట్ల లోపు చెల్లించాల్సి ఉంటుంది, కానీ.. మూడు నెలలైనా ఆ ఊసే ఎత్తడంలేదు. విద్యా రంగానికి వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకొనే ప్రభుత్వం చిన్నపాటి అలవెన్స్‌ల విషయంలో కక్కుర్తిగా వ్యవహరించడంపై విద్యార్థుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు డబ్బులు అడుగుతున్నారని, నిధులు ఇవ్వాలని ఎంఈవోలు పైఅధికారులను కోరినా ఉన్నతాధికారులు స్పందించడం లేదు.

ఇక అవేం ఇస్తారు?

మరోవైపు ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ పేరుతో ప్రభుత్వం ఇటీవల కొత్త కార్యక్రమం ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు సమీపంలోని ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులను ఇన్‌టర్న్‌షిప్ కింద వినియోగించుకోవడం దీని ఉద్దేశం. అలా పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్‌పై ఇన్‌టర్న్‌షిప్ కింద అవగాహన కల్పించినంత కాలం నెలకు రూ.12వేలు పారితోషికంగా ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. ఇలా ఒక్కో ఇంజనీరింగ్ విద్యార్థికి మూడు పాఠశాలలను అప్పగిస్తారు. అయితే ఒక్కరోజు అలవెన్స్ డబ్బులే ఇవ్వని ప్రభుత్వం ఇన్‌టర్న్‌షిప్ చేస్తే పారితోషికం ఇస్తుందా? అని విద్యార్థులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. డబ్బులివ్వకపోతే సమయం వృథా అయినట్లేనని భావిస్తున్నారు.

నిన్ను దింపడానికి మేము సిద్ధం

- దగా డీఎస్సీ వద్దంటూ నిరుద్యోగుల నిరసన
- విజయనగరం కోట జంక్షన్‌లో ఆందోళన

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 5: పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు నమ్మి మోసపోయాం.. మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ ముద్దు.. 23 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి.. అంటూ నిరుద్యోగులు విజయనగరంలోని కోట జంక్షన్‌లో సోమవారం భారీ నిరసన చేపట్టారు. మెగా డీఎస్సీ చేపట్టకపోతే నిన్ను(జగన్) దింపడానికి మేము సిద్ధం అంటూ నినదించారు. వందలాదిగా తరలివచ్చిన నిరుద్యోగ యువతతో పాటు డీఎస్సీ అభ్యర్థులు తెలుగు యువత ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు.

మెగా డీఎస్సీ పేరిట వైసీపీ సర్కారు దగా

- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



డీఎస్సీ అభ్యర్థులతో మాట్లాడుతున్న నాగబాబు

మంగళగిరి, ఫిబ్రవరి 5: మెగా డీఎస్సీ పేరిట వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతను దగా చేస్తోందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి డీఎస్సీ అభ్యర్థులు సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి విచ్చేసి ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. తొలుత జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు డీఎస్సీ అభ్యర్థుల వినతిపత్రాన్ని పరిశీలించి సమస్యలను పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు జనసేన కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థులతో మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థులు నాగబాబుకు తమ సమస్యలను తెలిపి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వేల నుంచి 30 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. జనసేన-టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ అభ్యర్థులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

కోరి తెచ్చుకున్న సర్కారే మోసం చేసింది

- బహుజన ఉపాధ్యాయుల ఆవేదన...విజయవాడలో ధర్నా



ధర్నాలో పాల్గొన్న బహుజన ఉపాధ్యాయులు

విజయవాడ(ధర్నాచౌక్), ఫిబ్రవరి 5: కోరి తెచ్చుకున్న ప్రభుత్వం తమను మోసం చేసిందని బహుజన ఉపాధ్యాయ సంఘ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సందర్భంగా పాదయాత్రలో తమకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కరించాలని లేదంటే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో సోమవారం ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిటి రమేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను చులకనగా చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అర్జునుడు కాదు అర్జున్‌రెడ్డి: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పూలే, కందుకూరి వీరేశలింగం లాగా ఫీల్ కావొద్దని ఏపీ సీఎం జగన్‌కు నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు సూచించారు. సోమవారం రచ్చబండ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ తన సొంత చెల్లెలను, తల్లిని ముందు తిట్టించడం మానేయాలి. కుటుంబ సభ్యులకు మర్యాద ఇవ్వడం నేర్చుకోవాలి. అర్జునుడిని అని చెప్పుకుంటున్న జగన్... ఎప్పుడో అర్జున్‌రెడ్డి క్యారెక్టర్‌లో ఒదిగిపోయారు. అవినీతికి తావులేకుండా చేస్తామంటున్న జగన్‌లాంటి నటుడిని ఇప్పటివరకూ నేను చూడలేదు. నాలుగు రోజులు ఆలస్యం అయినా టీడీపీ, జనసేనలకు బీజేపీతో పొత్తు ఉండే అవకాశం ఉంది. గోభక్షక పార్టీ (వైసీపీ)తో గోరక్షక పార్టీ(బీజేపీ) పొత్తు ఎందుకు పెట్టుకుంటుంది?' అని రఘురామరాజు ప్రశ్నించారు.

వృద్ధుడిపై వైసీపీ కక్ష సాధింపు

- ధరల పెంపుపై నోరు విప్పాడని పింఛను బదిలీ

అనపర్తి, ఫిబ్రవరి 5: వైసీపీ ప్రభుత్వంలో కక్షపూరిత చర్యలకు అంతూపొంతూ లేకుండాపోతోంది. ధరలపెంపుపై నోరువిప్పాడని ఓ వృద్ధుడిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరుకు చెందిన గొలుగూరి సుబ్బారెడ్డి మూడేళ్లుగా వృద్ధాప్య పింఛను పొందుతున్నాడు. ఇటీవల పెరిగిన నిత్యావసరాల ధరలపై ఆయన నోరు విప్పడంతో వైసీపీ పెద్దలకు ఉక్రోశం తన్నుకొచ్చింది. సాంకేతిక లోపం పేరుతో పింఛను తొలగించారు. ఇదేంటని వలంటీర్‌ను ప్రశ్నించగా తమకు సంబంధం లేదని, గ్రామ వైసీపీ పెద్దలను కలిసి మాట్లాడుకోవాలని సలహా ఇచ్చారు. అయితే వృద్ధుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. వరుసగా మూడు నెలల సమయం రావడంతో ఇక పూర్తిగా పింఛను తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గత నెలలో పోరాటం చేసి వృద్ధుడికి ప్రభుత్వ పింఛను రప్పించారు. అయితే అది ఒక్క నెల మాత్రమే అందించారు. రెండు నెలలు పింఛను సొమ్ము పోయినా పింఛను నిలబడిందని ఆ వృద్ధుడు సరిపెట్టుకున్నాడు. అయినా ఏకంగా వృద్ధుడి పింఛన్‌ను అనపర్తి నుంచి కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని పి.సూరంపాలెం గ్రామం బదిలీ చేయించారు. దీంతో బాధితుడు తిరిగి రామకృష్ణారెడ్డిని ఆశ్రయించడంతో సోమవారం వృద్ధుడిని వెంటబెట్టుకుని స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్‌కు ఫిర్యాదు చేయించారు. వైసీపీ కక్ష సాధింపు చర్యలపై రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. వృద్ధుడికి యథా ప్రకారం పింఛను అందించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు

రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రమేష్

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్‌ఎస్‌ఏ) ప్రధాన కార్యదర్శిగా కె.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం ఇక్కడి రెవెన్యూ భవన్‌లో జరిగిన సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నిన్నటి వరకు ప్రధాన కార్యదర్శిగా ఉన్న కృష్ణమూర్తికి ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో ఆయన ఆ పదవి నుంచి తప్పుకోగా, ఏలూరు జిల్లా రెవెన్యూ సంఘంలో కీలక నేతగా ఉన్న రమేష్‌కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడిగా దొమ్మేటి

రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ నూతన అధ్యక్షుడు (ఇన్‌చార్జి)గా దొమ్మేటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించిన హైకోర్టు రిటైర్డ్ జడ్జి టి.సునీల్‌చౌదరి రెండు రోజుల క్రితం పదవీ విరమణ చేశారు. దాంతో ఈ కమిషన్‌లో సీనియర్ సభ్యుడైన దొమ్మేటి శ్రీనివాస్‌ను నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో దొమ్మేటి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు సూర్యభాస్కరం, శ్రీనివాస్, 17 జిల్లా కమిషన్ల అధ్యక్షులు, సభ్యులు ఆయనను సన్మానించారు. అనంతరం దొమ్మేటి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని జిల్లాల కమిషన్‌లను మరింత పటిష్ఠం చేసి వినియోగదారులకు సత్వర న్యాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అంతా మా ఇష్టం..!

- నచ్చితేనే పదోన్నతులు తీసుకోండి
- వైద్యులకు డీఎంఈ అధికారుల ఆదేశం
- ప్రొఫెసర్లు చేరకముందే.. అసోసియేట్ పోస్టుల భర్తీ
- పదోన్నతి పొందిన వారి నుంచి లిఖితపూర్వక హామీలు
- అడ్డగోలుగా పదోన్నతులు కల్పిస్తున్న అధికారులు

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అధికారులు వైద్యుల హక్కులను కాలరాస్తున్నారు. తాము అనుకున్నదే జరగాలన్న పట్టుదలతో పదోన్నతుల విషయంలో నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లకు.. ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారమే జీవో జారీ చేశారు. ఈ జీవో వచ్చిన తర్వాత వారు ఆ పోస్టుల్లో జాయిన్ అయ్యేందుకు కనీసం వారం రోజులైనా సమయం ఇవ్వాలి. కానీ, వారికి ఆ సమయం ఇవ్వకపోగా.. ఖాళీ అయిన అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసేందుకు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సోమవారమే పదోన్నతి ఇచ్చేశారు. దీనికి సంబంధించిన కౌన్సెలింగ్ కూడా పూర్తిచేశారు. వాస్తవానికి ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందినవారు ఇంకా ఆ స్థానాల్లో చేరకముందే హడావుడిగా ఈ పని కానిచ్చేశారు. పైగా ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన వారికి డీఎంఈ ఆదేశాల మేరకు ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ ఫోన్లు చేసి.. ఎప్పుడు చేరుతున్నారు..? అసలు చేరతారా లేదా..? అని అడుగుతున్నారు. చేరతాం అని చెప్పిన వారి నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకుంటున్నారు. కొంత మంది చేరుతామని, కొంత మంది చేరబోమని లిఖితపూర్వక హామీలిచ్చారు. అలా హామీలు తీసుకున్న తర్వాత ఆ పోస్టులను సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో చూపించారు. వాస్తవానికి పదోన్నతి అనేది ఉద్యోగి హక్కు. నిబంధనల ప్రకారం పదోన్నతి పొందిన వారికి ఆయా పోస్టుల్లో చేరేందుకు కనీస సమయం ఇవ్వాలి. అలాకాకుండా డీఎంఈ లేదా ప్రిన్సిపాల్స్ ఫోన్లు చేసి మీరు చేరుతారా..? లేదా..? లిఖిత పూర్వక హామీ ఇవ్వండని ఒత్తిడి చేయడం నిబంధనలకు విరుద్ధం. కానీ ఆరోగ్య శాఖలో, డీఎంఈలో ఈ నిబంధన లేమీ వర్తించడం లేదు. మరోవైపు కొత్త స్థానాల్లో చేరతామని లిఖితపూర్వక హామీ ఇచ్చిన తర్వాత, ఆ వైద్యులకు ఏదైనా సమస్య వచ్చి చేరలేకపోతే ఎలా..? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. సమస్యలేవీ డీఎంఈ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో పదోన్నతులిచ్చిన సమయంలోనూ సమస్యలు తలెత్తాయి. ఆ సమయంలో కొంత మంది వైద్యులు డీ ఎంఈని కలిసి కొత్త స్థానాల్లో చేరేందుకు సమయమివ్వాలని కోరారు. కానీ ఇప్పుడు డీఎంఈ అధికారులు అవేమీ పట్టించుకోకుండా వారికి నచ్చినట్లు చేసుకుం టూ పోతున్నారు. వైద్యుల ఇబ్బందులను మాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదు. కేవలం ఖాళీల భర్తీపైనే దృష్టి పెట్టారు.



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రాన్ని జ్యుడిషియల్ ప్రివ్యూ జడ్జి జస్టిస్ బి.శివశంకరరావు సోమవారం దర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు ఆయనకు అందజేశారు. పెదకాకాని

హౌసింగ్ ఎండీగా వెంకటరమణారెడ్డి బాధ్యతల స్వీకరణ

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.వెంకటరమణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఐఏఎస్‌ల బదిలీల్లో తిరుపతి కలెక్టరుగా ఉన్న వెంకటరమణారెడ్డిని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగాను, ఈ స్థానంలో ఉన్న జి.లక్ష్మీషాను తిరుపతి కలెక్టరుగాను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే లక్ష్మీషా రిలీవై.. తిరుపతి కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించారు. వెంకటరమణారెడ్డి మాత్రం హౌసింగ్ ఎండీగా బాధ్యతలు చేపట్టడానికి నిరాకరించడంతో ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్ జేఎండీగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి శివప్రసాద్‌ను ఇన్‌చార్జి ఎండీగా నియమిస్తూ రాష్ట్ర హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వెంకటరమణారెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకున్నారో.. ఏమో.. సోమవారం విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంస్థ సీనియర్ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కొత్తగా మరో 2.32 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్ కుటుంబాన్ని ఆదుకోండి

- మంత్రి ధర్మానను కోరిన ఉద్యోగుల సంఘం

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ రమణయ్య హంతకులను పట్టుకొని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఆర్‌ఎస్‌ఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మంత్రి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె. రమేష్‌కుమార్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం కలిసింది. రమణయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని, తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సంఘం కోరింది. రమణయ్య భార్యకు గ్రూప్-2 స్థాయి ఉద్యోగం కల్పించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. భూ ఆక్రమణలు, భూ మాఫియా, కేసుల పరిష్కారం కోసం రెవెన్యూ పోలీసు అధికారులతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అలాగే రెవెన్యూ అధికారులపై దాడులకు తెగపడేవారిపై కఠిన చర్యలు ఉండేలా సర్కారు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

తుది ఓటర్ల జాబితాలో తప్పులు: ఎంఏ షరీఫ్

ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని, తక్షణమే ఓటర్ల జాబితాలోని లోపాలను సరిదిద్దాలని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి సోమవారం లేఖ రాశారు. ఓటర్ కార్డులో పేర్లు, ఇంటి నంబర్లు తప్పులున్నాయని, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించలేదన్నారు. జిల్లాల వారీగా ఓట్ల అవకతవకలపై ఆధారాలు సమర్పించారు.

పోలవరం నిర్మాణ బాధ్యత రాష్ట్రానిదే

- డబ్బులివ్వడం వరకే మా బాధ్యత: కేంద్రం
- 2021 నుంచి పెట్టిన ఖర్చును ఏపీకి చెల్లించాం
- రాజ్యసభకు తెలిపిన కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్
- టీడీపీ సభ్యుడు కనకమేడల ప్రశ్నకు సమాధానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పోలవరం.. జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ దాన్ని నిర్మించే బాధ్యత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదేనని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పష్టం చేశారు. రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సోమవారం సమాధానమిచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం బాధ్యత నూటికి నూరు శాతం నిధులు మంజూరు చేయడం వరకేనన్నారు. ఏపీ ప్రభుత్వం 2021 నుంచి పెట్టిన ఖర్చును కేంద్రం తిరిగి చెల్లించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా కేంద్రానికి పంపుతుందని వివరించారు. 2020లో వచ్చిన భారీ వరదల వల్ల పాక్షికంగా నిర్మించిన అప్పర్ కాఫర్ డామ్ ద్వారా నీరు ప్రవేశించి డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని మంత్రి తెలిపారు. ఎన్‌హెచ్‌పీసీ దీనిపై సాంకేతిక సమీక్ష జరిపిందని, అంతర్జాతీయ డిజైన్ ఏజెన్సీలను కూడా సంప్రదించిందని చెప్పారు. వారి సూచనల మేరకు కేంద్ర జలవనరుల సంఘం ఆమోదించిన డిజైన్ ప్రకారం ఏపీ ప్రభుత్వం డయాఫ్రం వాల్ ను పునరుద్ధరిస్తుందన్నారు. అయితే, పోలవరం ఎప్పటికి పూర్తవుతుందని కనకమేడల అడిగిన ప్రశ్నకు మాత్రం మంత్రి సమాధానం ఇవ్వలేదు.

ఇదేమి కసాయితనం తల్లీ!

- ఇద్దరు భర్తలను వదిలి మరొకరితో సహజీవనం
- ప్రియుడి మోజులో, మద్యం మత్తులో నీచపు పనులు
- వ్యభిచారం చేసి సంపాదించి తమను పోషించాలని ఒత్తిడి
- కూతురి వరసయ్యే బాలికపైనా ప్రియుడి లైంగిక దాడి
- గతంలో ఇదే తరహాలో పెద్ద కూతురిపైనా వేధింపులు
- ఇంటి నుంచి పారిపోయి అక్క వద్దకు చేరిన బాలిక
- తల్లి వద్ద ఉన్న మరో చెల్లెలి పరిస్థితిపై ఆందోళన
- ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన అక్కాచెల్లెళ్లు

కన్న కూతురిని బలవంతంగా వ్యభిచార రొంపిలోకి..

గుంటూరు, ఫిబ్రవరి 5: మానవత్వం మంటగలిసేలా.. సభ్య సమాజం సిగ్గుపడేలా.. తన కడుపున పుట్టిన బిడ్డల పట్లే ఓ తల్లి అత్యంత అమానుషంగా, నీచంగా వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. ఇప్పటికే ఇద్దరు భర్తలను మార్చి.. మూడో వ్యక్తితో సహజీవనం చేస్తున్న ఆమె.. మొదటి ఇరువురు భర్తలకు పుట్టిన ఆడ బిడ్డలపై అమానుషంగా ప్రవర్తిస్తోంది. వ్యభిచారం చేసి తనను, తన ప్రియుడ్ని పోషించాలంటూ బలవంతంగా ఆ పిల్లలను వ్యభిచారంలోకి దించింది. ప్రియుడి కోరిక కూడా తీర్చాలంటూ వేధించ సాగింది. తండ్రి వరసయ్యే అతడు కూడా బాలికపై లైంగిక దాడికి దిగాడు. తాము చెప్పినట్టు మాట వినడం లేదని బాలిక ప్రైవేటు అవయవాలపై కాల్చి వాతలు పెట్టారు. తల్లి, ఆమె ప్రియుడి వేధింపులు తట్టుకోలేని ఆ బాలిక.. ఇంటి నుంచి పారిపోయి తన అక్క వద్దకు చేరింది. అయితే ఆ కసాయి తల్లి వద్ద మరో పదకొండేళ్ల చెల్లెలు, తొమ్మిదేళ్ల తమ్ముడు ఉన్నారు. ఆ బాలికను కూడా తనలాగే చేస్తుందేమోనని ఇరువురు అక్కలూ భయాందోళన చెందుతూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో స్పందనను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళకు గతంలో ఓ వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఓ కుమార్తె జన్మించింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భర్తను వదిలి కూతురితో ఆమె వేరుగా ఉంది. తర్వాత మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. రెండో భర్తకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు పుట్టారు. ఇదిలా ఉంటే తమకు పుట్టిన ముగ్గురు సంతానంలో రెండో కుమార్తె అయిన పసిపిల్ల పట్ల రెండో భర్త అసభ్యంగా ప్రవర్తించాడంటూ అప్పట్లో తల్లి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది.. భర్తపై కేసు నమోదయింది. అనంతరం రెండో భర్తను కూడా వదిలేసి, ఆరేళ్లుగా ఆమె మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ నేపథ్యంలో.. మొదటి భర్త కుమార్తెకు చిన్న వయసులోనే పెళ్లి చేశారు. ఆమెకు తన భర్త నుంచి వేధింపులు ఎదురవగా, తల్లి వారిద్దరినీ విడదీసి తన వద్దకు తీసుకొచ్చేసింది. మొత్తం నలుగురు పిల్లలనూ స్కూలుకు పంపకుండా చితకబాది బలవంతంగా కూలి పనులకు పంపుతుండేది. ఈ క్రమంలో పెద్ద కుమార్తె ఓ యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. ఇక, రెండో భర్తకు పుట్టిన ముగ్గురు సంతానంలో మొదటి కుమార్తెకు ఏడాది క్రితం 14 ఏళ్ల వయసులో విజయవాడకు చెందిన ఓ యువకుడితో వివాహం చేశారు. భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం తలెత్తగా.. వారికి సర్ది చెప్పకపోగా, కూతుర్ని బలవంతంగా తన ఇంటికి తెచ్చుకుంది. మైనర్ అయిన కూతురికి పెళ్లి చేయడమే కాకుండా, వారి కాపురాన్ని చెడగొట్టి తన వద్దకు తెచ్చుకొన్న ఆమె.. కూతురిని వ్యభిచార రొంపిలోకి దింపింది. అంతేగాక తన ప్రియుడి కోరిక కూడా తీర్చాలని వేధించేది. ఈ క్రమంలో ప్రియుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. మద్యానికి అలవాటు పడిన తల్లి ఆ మత్తులో తన ప్రియుడి కోరిక తీర్చాలని ఒత్తిడి చేస్తూ బాలిక వినకపోవడంతో ఆమె ప్రైవేటు అవయవాలపై కాల్చి వాతలు పెట్టింది. వేధింపులు తట్టుకోలేక ఆ బాలిక సమీపంలో ఉంటున్న తన అక్క వద్దకు వెళ్లి తలదాచుకుంది. అయితే, బాలికను తమతో పంపాలని, లేదంటే మీ కాపురం తీస్తామని తీవ్రస్థాయిలో బెదిరించారు. కాగా, తన చెల్లెలు(11), తమ్ముడు(9)ఇంకా తల్లి వద్దే ఉంటున్నారని, చెల్లిలి పరిస్థితి కూడా తమ లాగే తయారవుతుందేమోనని ఆ అక్కాచెల్లెళ్లు భయపడుతున్నారు. తమపట్ల కర్కశంగా, నీచంగా ప్రవర్తిస్తున్న తమ తల్లితో పాటు ఓ ప్రైవేటు బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఆమె ప్రియుడి నుంచి రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు. తమ నలుగురినీ చదివించలేదని, కనుక కూలి పనులు చేసుకుని జీవనం సాగించేలా తమకు ఆసరా కల్పించాలని వారు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నారు.


జగనన్న స్థలాల కబ్జా

- 49 ప్లాట్ల ఆక్రమణ.. వైసీపీ నేతల బరితెగింపు
- ఏడాదిగా లబ్ధిదారుల గోడు పట్టించుకోని అధికారులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 5: కర్నూలు జిల్లా జిల్లా నందవరం మండలం హాలహర్వి గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన జగనన్న ఇంటి స్థలాలనే వైసీపీ నాయకులే కబ్జా చేశారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు సబ్ కలెక్టర్ శివనారాయణశర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. హాలహర్వి గ్రామంలో సర్వే నం.407లో 117 మందికి ఒకటిన్నర సెంటు చొప్పున ప్రభుత్వం ఏడాది క్రితం జగనన్న ఇంటి స్థలాలను కేటాయించింది. హద్దులు ఏర్పాటు చేసి పట్టాలు ఇచ్చి జియో ట్యాగింగ్ కూడా చేశారు. అయితే, ఇందులో 49 మంది లబ్ధిదారుల స్థలాలను స్థానిక వైసీపీ నాయకులు కబ్జా చేశారు. లబ్ధిదారులను బెదిరించి ఆ స్థలాల్లో కొట్టాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీన బాధితులు బుడ్డమ్మ, రామలక్ష్మి, ఉరుకుందమ్మ, ఈరన్న, దస్తగిరి, రామాంజినమ్మతోపాటు మిగిలిన వారు నందవరం తహసీల్దార్ నిత్యానంద రాజుకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలాలను గ్రామానికి చెందిన లచ్చుమర్రి మోహన్, చిన్నన్న, వెంకటేశులు, హనుమప్ప, ఎర్రన్న, వెంకటస్వామి, రాజు, హనుమన్న, హరికృష్ణ, నాగేంద్ర, కాశీం, జమ్మప్ప, కర్రెన్న, శీను, నాగేష్, చాకలి ఉరుకుందు, మునిస్వామి, చాకలి దుబ్బన్న కబ్జా చేశారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో వారంతా తక్షణమే తమ వద్ద హాజరు కావాలని గత ఏడాది ఏప్రిల్ 3వ తేదీన ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. కబ్జా చేసిన వైసీపీ నేతలు హాజరు కాకపోగా, లబ్ధిదారులను స్థలాల్లోకి రానివ్వకుండా బెదిరిస్తున్నారు. ప్రస్తుతం జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో తమ స్థలాలను కూడా తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయాలని బాధితులు సిబ్బందిని కోరారు. కానీ, ఉన్నతాధికారుల ఆదేశాలు లేనిదే తాము రిజిస్ట్రేషన్ చేయలేమని సిబ్బంది తేల్చి చెప్పడంతో బాధితులు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు.

మరుగుదొడ్డి స్థలాన్నీ వదలని వైసీపీ

- రూ.కోటి విలువ చేసే స్థలం కబ్జాకు యత్నం
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట చెంబులతో నిరసన



కర్నూలు జిల్లా హొళగుంద తహసీల్దార్ కార్యాలయం ముందు చెంబులతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

హొళగుంద, ఫిబ్రవరి 5: కర్నూలు జిల్లాలో ఓ వైసీపీ నేత రూ.కోటికి పైగా విలువచేసే సామూహిక మరుగుదొడ్డి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించాడు. కర్నూలు జిల్లా హొళగుంద బీసీ కాలనీలోని సిద్ధప్ప తాత గుడి ప్రాంతంలో ఎకరా స్థలంలో 70 సంవత్సరాలుగా సామూహిక మరుగుదొడ్డి ఉండేది. బీసీ కాలనీ, కోటవీధికి చెందిన మహిళలు దీన్ని వాడుకొనేవారు. ప్రభుత్వం సామూహిక మరుగుదొడ్లను నిషేధించడంతో దాన్ని తొలగించారు. దీని స్థానంలో రూ.పది లక్షల వ్యయంతో 6 వ్యక్తిగత మరుగుదొడ్ల గదుల నిర్మాణాన్ని 10 సెంట్ల స్థలంలో చేపట్టారు. మిగత 90 సెంట్ల స్థలాన్ని కొట్టేసేందుకు ఓ వైసీపీ నేత ప్రయత్నాలు చేపట్టాడు. ఇది తెలుసుకున్న కొందరు మహిళలు తిరగబడ్డారు. హొళగుంద తహసీల్దార్ కార్యాలయం ముందు చెంబులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ ఏఎం ప్రసాద్ రాజును వివరణ కోరగా, కబ్జాకు గురికాకుండా కాపాడుతామన్నారు.

పిల్లలను ప్రచారానికి దూరం పెట్టండి

- అభ్యర్థులు వారిని ఎత్తుకోవడమూ ఉల్లంఘనే: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఏ విధంగానూ పిల్లలను ఉపయోగించుకోవద్దని సూచించింది. పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, నినాదాలివ్వడం, ర్యాలీల్లో తిప్పడం వంటి ప్రచార కార్యక్రమాల్లో పిల్లలను వాడుకోవద్దని తెలిపింది. అభ్యర్థులు పిల్లలను ఎత్తుకోవడం, వాహనాల్లో తిప్పడంతో పాటు తమకు అనుకూలంగా పాటలు/పద్యాలు పాడించడం, డ్యాన్సులు చేయించడం, మాట్లాడించడం ఉల్లంఘన కిందకే వస్తాయని పేర్కొంది.

అసభ్య పోస్టింగ్‌లపై సునీత ఫిర్యాదుపై కేసు నమోదు

- ఆమెతో పాటు షర్మిల, విజయమ్మపై దూషణలకు
- పాల్పడుతూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు
- వర్రా రవీంద్రరెడ్డిపై ఫిర్యాదు.. అతడిపై గతంలోనూ కేసులు
- చంపేస్తే ఎన్నికల్లో పనికొస్తుందని పోస్టింగ్
- బాబాయికి పట్టిన గతే షర్మిలకూ అంటూ హెచ్చరిక
- మానసికక్షోభకు గుర్తిచేస్తున్నాడని సునీత ఫిర్యాదు

దర్యాప్తు ప్రారంభించిన హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తనతో పాటు సోదరి వైఎస్ షర్మిల, చిన్నమ్మ వైఎస్ విజయమ్మపై అసభ్య పదజాలంతో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని వైఎస్ వివేకానందరెడ్డి కూతురు సునీతా రెడ్డి చేసిన ఫిర్యాదుపై హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 2న ఆమె ఫిర్యాదు చేయగా.. సైబర్ క్రైం పోలీసులు ఎఫ్ఐఆర్ (నంబర్ 589/2024) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తనకు భద్రత కరువైందని, తనను మానసిక వేదనకు గురి చేస్తున్నారని, సమాజంలో పరువుతీస్తున్నారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. బాబాయికి పట్టిన గతే షర్మిలకూ పడుతుందని బెదిరిస్తున్నారని తెలిపారు. "సమాజంలో గొప్ప పేరున్న కుటుంబ నేపథ్యం, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబం నుంచి వచ్చిన నేను ప్రైవేట్ జీవితం గడుపుతున్నాను. గత కొన్ని రోజులుగా వర్రా రవీంద్రరెడ్డి అనే వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి నాపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నాడు. బెదిరింపులకు పాల్పడే ధోరణిలో నాతో పాటు సోదరి వైఎస్ షర్మిల, చిన్నమ్మ వైఎస్ విజయమ్మపై అసభ్య పదజాలంతో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నాడు. గత నెల 29న ఇడుపులపాయలో షర్మిలను కలిశాను. ఈ విషయంపై సోషల్ మీడియాలో నా సన్నిహితులు పోస్ట్ చేయగా విస్తృత ప్రచారం జరిగింది. ఆ పోస్టును తెరిచి చూడగా... వర్రా రవీంద్రరెడ్డి ఫేస్‌బుక్ ఖాతా నుంచి వీడియోను పోస్ట్ చేశాడు. శత్రుశేషం ఉండకూడదని పెద్దలు చెప్పినట్లు అందులో పేర్కొన్నాడు. వాళ్లను కూడా చంపేస్తే ఎన్నికల్లో పనికొస్తుందని పోస్టులో ఉంది. వీడియో చూడగా.. వైఎస్సార్ ఘాట్ వద్ద నేను, షర్మిల వైఎస్సార్‌కు శ్రద్ధాంజలి ఘటించిన దృశ్యాలున్నాయి. ఆ వ్యక్తి ఫేస్‌బుక్ పేజీని చూడగా అందులో వైఎస్ విజయమ్మ, షర్మిలకు సంబంధించి బెదిరింపు పోస్టులున్నాయి. నన్ను, షర్మిలను కించపరుస్తూ, వైఎస్ విజయమ్మ గౌరవానికి భంగం కలిగించేలా పోస్టులున్నాయి' అని సునీతారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆధారాలతో సహా పోలీసుల ముందుంచారు. వర్రా రవీంద్రరెడ్డి గురించి వివరాలు సేకరించగా గతంలో అతనిపై ఎన్నో కేసులున్నట్లు గుర్తించారు. రవీంద్రరెడ్డి యూట్యూబ్ చానళ్లకు ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లో తనను, తన తండ్రిని కించపరిచినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను వేధిస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 6 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

సీసీఎంబీలో సమ్మర్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్

హైదరాబాద్ సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సీసీఎంబీ)- సమ్మర్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ 2024నకు దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి 60 రోజులు(ఎనిమిది వారాలు). ఇది మేలో ప్రారంభమౌతుంది. ప్రోగ్రామ్ ఫీజు లేదు. అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఓ సైంటిస్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది. సీసీఎంబీ స్టాఫ్ సైంటిస్టులు మెంటార్లుగా వ్యవహరిస్తారు. పాపులర్ సైన్స్ టాపిక్స్, సైంటిఫిక్ ఎథిక్స్, ల్యాబరేటరీ ప్రాక్టీసెస్, లైఫ్ సైన్సెస్ అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిషన్, పోస్టర్ ప్రజంటేషన్ ఉంటాయి.



అర్హత

- మొదటి ఏడాది పూర్తిచేసిన ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంఫార్మసీ అభ్యర్థులు; మూడో ఏడాది పూర్తి చేసిన బీటెక్/ బీఫార్మసీ/ఎంబీబీఎస్/బీడీఎస్/నాలుగేళ్ల బీఎస్సీ-బయో సైన్సెస్ అభ్యర్థులు; ఎనిమిదో సెమిస్టర్ లేదా నాలుగో సంవత్సరం పూర్తి చేసిన ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్/ బీఎస్సీ-ఎమ్మెస్సీ/ బీవీఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ ప్రోగ్రామ్ చేస్తున్న అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.
- అభ్యర్థులు తమ ఇన్‌స్టిట్యూట్/యూనివర్సిటీ/కళాశాలకు చెందిన హెచ్ఓడీ లేదా డీన్ నుంచి ఆథరైజేషన్ లెటర్‌ను ఆన్‌లైన్ ద్వారా సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 1
- **అభ్యర్థులు తమ అనుమతి తెలిపేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ప్రోగ్రామ్‌లో జాయినింగ్ తేదీలు:** మే 15 నుంచి జూన్ 14 వరకు
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in

మోతీలాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీఏ



అలహాబాద్‌లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ఎన్ఐటీ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి.

మొత్తం 77 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 29, జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 2, ఓబీసీ అభ్యర్థులకు 20, ఓబీసీ దివ్యాంగులకు 1, ఎస్సీ అభ్యర్థులకు 10, ఎస్సీ కేటగిరీ దివ్యాంగులకు 1, ఎస్టీ అభ్యర్థులకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 8 సీట్లు ప్రత్యేకించారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్యాట్ 2023 స్కోర్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: అడ్మిషన్ కమిటీ నిర్ణయం ప్రకారం క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీటిలో సాధించిన స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 8 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 20
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 29, 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **వెబ్‌సైట్:** mnnit.ac.in

ఎన్ఐబీఎంలో పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్

పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్(ఎన్ఐబీఎం)- పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్'. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ వర్తిస్తుంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఆరు టర్మ్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్, సోషల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఫైనాన్స్, ఎకనామిక్స్, ఆపరేషన్స్, క్వాంటిటేటివ్ అనాలిసిస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, జనరల్ మేనేజ్‌మెంట్ ఇన్ బ్యాంకింగ్ సిస్టమ్స్, అసెట్స్ అండ్ లయబిలిటీ మేనేజ్‌మెంట్, క్రెడిట్ అప్రైజల్ అండ్ మేనేజ్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, బ్యాంక్ రెగ్యులేషన్, లీడర్‌షిప్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అంశాలు బోధిస్తారు. క్లాస్‌రూం లెక్చర్స్, కేస్ స్టడీస్, ఇండివిడ్యువల్ అండ్ గ్రూప్ అసైన్‌మెంట్స్, సిమ్యులేషన్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్, ఫీల్డ్ విజిట్స్, రీసెర్చ్ స్టడీస్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/సీమ్యాట్ 2024 స్కోర్ లేదా జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 35 శాతం, అకడమిక్ ప్రతిభకు 25 శాతం, ఆన్‌లైన్ ఓరల్ కమ్యూనికేషన్ టెస్ట్‌కి 10 శాతం, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూకి 25 శాతం, అనుభవం సహా క్రీడలు తదితర అదనపు అర్హతలకు 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జాతీయ పరీక్ష స్కోర్ కటాఫ్: జనరల్ అభ్యర్థులకు 75; ఓబీసీ అభ్యర్థులకు 65; ఎస్సీ అభ్యర్థులకు 60; దివ్యాంగులు, ఎస్టీ అభ్యర్థులకు 50; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 65గా నిర్దేశించారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** www.pgdm.nibmindia.org

జాబ్ కార్నర్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 1025

న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం.. దేశ వ్యాప్తంగా వివిధ శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ల నియామకానికి ప్రకటన విడుదల చేసింది.

1. ఆఫీసర్-క్రెడిట్(జేఎంజీ స్కేల్-1): **1000 పోస్టులు**
2. మేనేజర్- ఫారెక్స్(ఎంఎంజీ స్కేల్-2): **15 పోస్టులు**
3. మేనేజర్ - సైబర్ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్-2): **5 పోస్టులు**
4. సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్-3): **5 పోస్టులు**

విద్యార్హత: ఖాళీలను అనుసరించి బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏఐ, సీజీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి ఆఫీసర్ పోస్టులకు 21-28 ఏళ్లు; మేనేజర్ పోస్టులకు 25-35 ఏళ్లు; సీనియర్ మేనేజర్ పోస్టులకు 27-38 ఏళ్ల మధ్య ఉండాలి.

జీతభత్యాలు: నెలకు ఆఫీసర్‌కు రూ.36,000 - రూ.63,840; మేనేజర్‌కు రూ.48,170 - రూ.69,810; సీనియర్ మేనేజర్‌కు రూ.63,840 - రూ.78,230.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.59, మిగతా అభ్యర్థులకు రూ.1180.

తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు: విజయవాడ, వైజాగ్, హైదరాబాద్

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఫిబ్రవరి 7

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఫిబ్రవరి 25

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: 2024 మార్చి/ఏప్రిల్‌లో

వెబ్‌సైట్: https://www.pnbindia.in/

భారత్ - ఫ్రాన్స్ ద్వైపాక్షిక సంబంధాలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)

భద్రత-రక్షణ రంగాల్లో సహకారం: భారతదేశానికి రెండో అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారు ఫ్రాన్స్. ఒక్క ఫ్రాన్స్ నుంచే భారతదేశానికి 30 శాతం ఆయుధాలు దిగుమతి అవుతున్నాయి. రఫెల్ ఫైటర్ జెట్స్, మిరేజ్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, స్కార్పీన్ జలాంతర్గాములు వంటి వాటిని వీటిలో ప్రధానమైనవిగా పేర్కొనవచ్చు. సాంకేతిక బదిలీ ఒప్పందం ద్వారా భారత్‌లోని మజ్‌గావ్ డాక్‌యార్డ్‌లో ఫ్రాన్స్ సహకారంతో ఆరు స్కార్పీన్ తరహా జలాంతర్గాములను నిర్మిస్తున్నారు. వీటిలో ఒకటైన 'ఐఎన్ఎస్ కల్వరి' సబ్‌మెరైన్ జలప్రవేశం ఇప్పటికే(2017) పూర్తయింది. ఫ్రాన్స్-భారత్ హిందూ మహాసముద్ర ప్రాంతం(ఐఓఆర్)లో ఉమ్మడి గస్తీ నిర్వహణతో పాటు, త్రివిధ దళాల్లోనూ ఉమ్మడి సైనిక విన్యాసాలు తరచూ చేపడుతున్నాయి. (నావికాదళ విన్యాసాలు- 'వరుణ', వైమానిక విన్యాసాలు- 'గరుడ', ఆర్మీ విన్యాసాలు- 'శక్తి').

శక్తి, పర్యావరణ రంగాల్లో సహకారం: 1984లో తారాపూర్ అణువిద్యుత్ కేంద్రానికి అణు ఇంధనాన్ని అందించాల్సిన అమెరికా అర్ధాంతరంగా తప్పుకొంది. దాంతో ఫ్రాన్స్ ఆ ఇంధనాన్ని అందించి సహకరించింది.

- 2008లో న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్(ఎన్ఎస్‌జీ) మినహాయింపులను భారత్‌కు అందించడంలో ఫ్రాన్స్ పాత్ర ఎనలేనిది. అదేవిధంగా ఎన్ఎస్‌జీలో భారత్ చేరికకు ఫ్రాన్స్ మద్దతు ప్రకటిస్తోంది. భారతదేశంలో జైతాపూర్(మహారాష్ట్ర)లో ఆరు న్యూక్లియర్ పవర్ రియాక్టర్ల స్థాపనకు 2018లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్(ఐఎస్ఏ)స్థాపనలో భారత్-ఫ్రాన్స్ ప్రముఖపాత్ర పోషించాయి.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సహకారం: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో) తొలినాళ్లలో నిర్మించిన శ్రీహరికోటలోని లాంచ్‌ప్యాడ్/సైట్ నిర్మాణంలో, రాకెట్ టెక్నాలజీలో తొలి నుంచి ఫ్రాన్స్ భారత్‌కు సహకరిస్తూ వచ్చింది.

- 2018లో ఇస్రో, ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థ సీఎన్ఈఎస్ మధ్య ఉమ్మడి లక్ష్యాల్లో సహకారం కోసం ఒప్పందం కుదుర్చుకున్నాయి.
  - అంతరిక్ష వ్యర్థాలు(స్పేస్ డెబ్రిస్) తొలగింపు, జాయింట్ మార్స్ మిషన్‌ను ఉమ్మడిగా చేపట్టనున్నాయి.
  - అదేవిధంగా 'జాయింట్ ఎర్త్ అబ్జర్వేషన్ మిషన్‌'ను చేపట్టనున్నాయి.
  - హిందూ మహాసముద్ర ప్రాంతంలో నిఘా, పర్యవేక్షణకు పది ఉపగ్రహ సమూహాన్ని ఇండియా-ఫ్రాన్స్ సంయుక్తంగా ప్రయోగించనున్నాయి.
  - భారత్ యూపీఐ పేమెంట్ సిస్టమ్‌ను తమ దేశంలో అనుమతించిన తొలి యురోపియన్ దేశం ఫ్రాన్స్.
  - ఇదేవిధంగా కృత్రిమమేధ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, క్వాంటమ్ టెక్నాలజీ, కంప్యూటింగ్ వంటి సాంకేతికపరంగా పరస్పర సహకార ఒప్పందాలు కుదిరాయి.

ఇండో-ఫ్రాన్స్ సత్సంబంధాల ఆవశ్యకత

1. బహుళ ధ్రువ ప్రపంచ సాధన దిశగా రెండు శక్తిమంతమైన దేశాలు ఫ్రాన్స్, భారత్ ఒక మధ్యేమార్గాన్ని ప్రపంచానికి చూపుతున్నాయి. అమెరికా, పాశ్చాత్య దేశాల కూటమి, చైనా, రష్యా కూటములకు ప్రత్యామ్నాయంగా, అలీన మార్గాన్ని ఏర్పర్చడానికి ఇండో-ఫ్రాన్స్ ఒక తాటిపై ఉండటం ఎంతో అవసరం.
2. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని, చొరబాటును నిలువరించడానికి ఆ ప్రాంతంలో భద్రత, స్థిరత్వాలను కాపాడటానికి భారత్-ఫ్రాన్స్ చేస్తోన్న కృషి కొనసాగింపునకు ఈ దేశాల మధ్య సత్సంబంధాలు మరింతగా బలపడాలి.
3. 1998 పోఖ్రాన్ అణు పరీక్ష సమయంలో అగ్రరాజ్యాలన్నీ భారత్‌పై ఆంక్షలు విధించినా ఫ్రాన్స్ అలాంటి చర్యలకు పాల్పడలేదు. పైగా భారతదేశ శాంతికాముకత్వాన్ని గుర్తిస్తూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వానికి, న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూపులో ప్రవేశానికి తన మద్దతును భారత్‌కు ప్రకటిస్తూనే వస్తోంది.

- ఫ్రాన్స్-భారత్ చిరకాల స్నేహానికి గుర్తుగా 1970వ దశకం నుంచి ప్రతి దశకంలోనూ ఫ్రాన్స్ అధ్యక్షుడిని భారత గణతంత్ర దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తున్నారు.
- ఇటీవల భారత ప్రధాని ఫ్రాన్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వం తమ అత్యున్నత పౌర, మిలిటరీ పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లీజియన్ ఆఫ్ హానర్‌'ను ప్రధానికి ప్రదానం చేసింది.

4. 2047 వరకు భారత్-ఫ్రాన్స్ క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సూపర్ కంప్యూటింగ్ వంటి వాటిపై పరస్పరం సహకరించుకోనున్న నేపథ్యంలో... ఫ్రాన్స్ సాంకేతికతకు, భారత్ మేథ సంపదకు ఈ చొరవ ఇతోధికంగా సహకరిస్తుంది.

భారత్-ఫ్రాన్స్ సంబంధాల పటిష్ఠతకు ఎదురవుతున్న సవాళ్లు

1. భారత్-ఫ్రాన్స్ మధ్య రిపబ్లిక్ డే సందర్భంగా కుదిరిన అనేక ఒప్పందాలు, బలపడుతున్న మైత్రి చైనాను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఫ్రాన్స్-చైనా దౌత్య సంబంధాల 60వ వార్షికోత్సవం సందర్భంగా చైనా అధ్యక్షుడు, ఫ్రాన్స్‌తో స్నేహ సంబంధాలను బలపరుచుకొనే దిశగా అనేక కీలక వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌తో స్నేహబంధాన్ని పెంచుకోవాలని ఆశిస్తున్నట్టు ప్రకటించారు. భారత్‌కు ప్రత్యక్షంగా ఈ సంఘటన వల్ల నష్టం లేకపోయినా... భారత్ సరిహద్దు దేశాల్లో, ముఖ్యంగా మిత్ర దేశమైన మాల్దీవుల విషయంలో చైనా వ్యూహాత్మక ఎత్తుగడలపై భారత్‌కు అనుభవం ఉంది.

- ఈ నేపథ్యంలో భారత్ సమయానుసారం మరింత జాగరూకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. 'చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'కు ఫ్రాన్స్ మద్దతు తెలపడం, ఫ్రాన్స్- అమెరికా మధ్య చిరకాల మైత్రి... భారత్, ఫ్రాన్స్ సంబంధాల్లో కొన్ని బలహీన అంశాలుగా చెప్పుకోవచ్చు.

2. భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఫ్రెంచ్ వ్యాపార సంస్థలకు చెందిన మేథా సంపత్తి హక్కుల పరిరక్షణ విషయంలో ఫ్రాన్స్ తరచూ భారత్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. భారతదేశం ఫ్రాన్స్ మధ్య విదేశీ వాణిజ్యంలో ఫ్రాన్స్ ఎగుమతులు ఎక్కువగా ఉంటున్నాయి. దాంతో వ్యాపార అసమతౌల్యానికి గురవుతున్నామన్న అసంతృప్తి భారత్‌కు ఉంది.
3. అదేవిధంగా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారత్-జర్మనీ వంటి ఇతర దేశాల ద్వైపాక్షిక వాణిజ్యంతో పోల్చితే చాలా తక్కువస్థాయిలోనే ఉంది.

- బీటీఐఏ(ఇండియా - యురోపియన్ యూనియన్ బేస్డ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ అగ్రిమెంట్)లో పురోగతి కనిపించకపోవడం వల్ల ఫ్రాన్స్‌తో మరింత భారీ స్థాయిలో వాణిజ్య నిర్వహణకు భారత్‌కు అవకాశం ఉండటం లేదు.
- జైతాపూర్ న్యూక్లియర్ ప్రాజెక్టు దిశగా పురోగతి లేకపోవడం కూడా ఈ దేశాల మధ్య వాణిజ్య బంధాన్ని బలహీన పరుస్తోంది. అయితే ఎన్ని అవరోధాలు ఉన్నప్పటికీ చిరకాల మైత్రి, అనేక వ్యూహాత్మక అంశాల దృష్ట్యా... భారత్ - ఫ్రాన్స్ మధ్య సత్సంబంధాలు కొనసాగించాలి. ఇరు దేశాలు తమ మధ్య ఉన్న చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుని భారత్ పర్యటనలో కుదిరిన కొన్ని కీలక ఒప్పందాలు, సంయుక్త ప్రకటనలు-

1. భారత్-ఫ్రాన్స్ రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, అంతరిక్ష సంబంధిత రక్షణరంగ అంశాల్లో సహకారానికి రోడ్‌మ్యాప్‌నకు అంగీకారం.
2. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, ఎరియన్ స్పేస్(ఎస్ఏఎస్)(ఫ్రాన్స్) మధ్య అంతరిక్ష రంగంలో ఎర్త్ మానిటరింగ్, రిమోట్ సెన్సింగ్, ప్రివెంటింగ్ సొల్యూషన్స్ పరంగా సహకారం.
3. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లిమిటెడ్(టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ సంస్థల మధ్య భారత్‌లో పౌరవిమానయానానికి హెచ్125 హెలికాప్టర్ల అసెంబ్లీ లైన్ నిర్మాణ సహకారానికి ఒప్పందం.
4. ఇరుదేశాల శాస్త్ర, సాంకేతికరంగ ప్రభుత్వ సంస్థల మధ్య సహకారానికి ఒప్పందం. సంయుక్త పరిశోధన ప్రాజెక్టులకు ఆర్థిక, సాంకేతిక సహకారానికి ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటుకై నిర్ణయం.
5. ఆరోగ్యం, ఔషధరంగంలో సహకారానికి భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, మినిస్ట్రీ ఆఫ్ లేబర్, హెల్త్ అండ్ సాలిడారిటీ ఆఫ్ ఫ్రాన్స్ మధ్య ఒప్పందం.
6. ప్రభుత్వ పాలన, పాలన సంస్కరణల పరంగా ఇరు దేశాల మధ్య సహకారానికి సంబంధిత ఇరుదేశాల మంత్రిత్వశాఖల మధ్య ఒప్పందం.
7. సుస్థిర పట్టణాల అభివృద్ధిపరంగా ఇరుదేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఒప్పందాలను మరింత పొడిగించారు.
8. 2026ను ఇండియా-ఫ్రాన్స్ 'ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'గా ప్రకటించారు.
9. ఈఫిల్ టవర్ వద్ద భారత్ నగదురహిత చెల్లింపుల వ్యవస్థ యూపీఐను అమలులోకి తెస్తున్నట్టు ఫ్రాన్స్ ప్రకటించింది.
10. ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్‌కు సంబంధించిన స్టార్-సి ప్రోగ్రామ్ కింద సెనెగల్‌లో 'సోలార్ అకాడమీ'ని ఏర్పాటు చేయనున్నారు.
11. భారత కాన్సులేట్‌ను ఫ్రాన్స్‌లోని మార్సెల్లీలో, ఫ్రాన్స్ కాన్సులేట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరింది.
12. 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్టనర్‌షిప్' ఒప్పందం కింద 'యంగ్ ప్రొఫెషనల్ స్కీమ్' ఏర్పాటు.
13. ఫ్రెంచ్ ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన భారతీయులకు అయిదు సంవత్సరాల వ్యవధి కలిగిన 'షెన్ జెన్' వీసా సౌలభ్యం.
14. ఫ్రాన్స్‌లోని నైస్ పట్టణంలో 2025లో జరగనున్న 'యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్'కు భారత్ మద్దతు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్స్



సింహం- చిట్టెలుక

అడవిలో మృగరాజు సింహం. రాజు వస్తున్నాడంటే హడలు. అయితే అదే అడవిలో ఓ చిట్టెలుక ఉండేది. ఆ చిట్టెలుక సోమరి. ఎంత సోమరి అంటే శత్రువు వచ్చినా పరిగెత్తకుండా సోమరిగా ఉండేంత సోమరి. ప్రాణాలు పోతాయని మిత్రులు హెచ్చరించినా పట్టించుకునేది కాదు. దాని తీరే అంత.


ఒకరోజు సింహం దారింటా వెళ్తోంది. దానికి నిద్ర వస్తోంది. పడుకుందామని పొదలచాటుకు వెళ్లింది. ఆ పొదల చాటునే అనుకోకుండా చిట్టెలుక ఇల్లు ఉంది. ఆ సింహం పడుకుంది. నిద్రలో ఉంది. చిట్టెలుక బొరియలోంచి బయటకు రావాలి ఆహారం కోసం. సింహం ఉందని పట్టించుకోకుండా సింహాన్ని ఎక్కి తన పనికి వెళ్లిపోయింది. మళ్లీ అరగంట తర్వాత బొరియ దగ్గరకు వచ్చింది. సింహం మీద తిరుగుతూ ఉంది. మృగరాజు ఆ సింహమే అని దానికి తెలీదు. మిగతా జంతువులు దాని దరిదాపుల్లో లేవు. సింహం చిట్టెలుక చేష్టలకు చూసింది. పంజా దగ్గరకు వస్తూనే చిట్టెలుకను పట్టేసుకుంది సింహం. చిట్టెలుక ప్రాణం పోయినట్టు విలవిల్లాడింది. మృగరాజునే అవమాన పరుస్తావా? అన్నట్లు చూసింది సింహం. వదిలేయండి రాజా.. మీరనుకోలేదు. మీకు తప్పకుండా ఏదో సాయం చేస్తాను అన్నది చిట్టెలుక.

సింహానికి కోపం వచ్చింది. 'అసలే తప్పు చేశావు. పైగా నాకు సాయం చేస్తానని నోటికి మాట్లాడుతున్నావు' అంటూ చేతిని అదిమిపట్టింది. చిట్టెలుక కళ్లు బయటకి వచ్చాయి. క్షణాల్లో ఓ చిలుక వచ్చి.. 'చిట్టెలుక మీదనా మీ ప్రతాపం' అన్నది. వెంటనే చిట్టెలుకను సింహం వదిలేసింది. భయంతో వణికిపోయింది. బొరియలోపలికి పారిపోయింది.

ఒక రోజు చిట్టెలుక బొరియలో ఉన్నది. ఓ సింహం అరుపు వినపడింది. బయటకు వచ్చి చెట్టెక్కి చూసింది. సింహం వలలో ఇరుక్కుపోయింది. వేటగాడి వలకు చిక్కిన సింహం దగ్గరకు వెళ్లింది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆ వలను తన పొడవైన పళ్లతో కొరికేసింది. ఆ చిట్టెలుక మంచితనంతో పాటు ఇచ్చిన మాట నెరవేర్చుకునే తత్వానికి పొంగిపోయింది సింహం. ఎంత గొప్ప మనసో అంటూ చిట్టెలుకను కీర్తించింది. 'ఇది సాయమే కదా' అన్నది చిట్టెలుక.


దారి కనుక్కోండి





చుక్కలు కలిపి రంగులు వేయండి

సరైన నీడ ఏది?





డైలీ సుడోకు - 222

				6			8	7
			1				9	
		8						2
4	5	1	6					3
		2				8		
8					2	6	4	5
9						7		
	7				3			
2	4			5				

సుడోకు - 221 సమాధానం

9	5	2	8	6	1	4	3	7
3	7	6	4	5	2	8	9	1
4	8	1	9	7	3	6	5	2
8	3	4	2	1	5	9	7	6
5	6	9	3	4	7	2	1	8
2	1	7	6	9	8	5	4	3
1	9	8	7	2	4	3	6	5
6	2	5	1	3	9	7	8	4
7	4	3	5	8	6	1	2	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.